



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 24 శనివారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 249

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur






# అభివృద్ధి పథంలో తెలంగాణ



- తెలంగాణ అభివృద్ధికి కేంద్రంతో కలిసి పని చేస్తా
- నిధుల కోసం అవసరమైతే ప్రధానిని కలుస్తా
- తెలంగాణ నిధుల సాధనకు మరో 50సార్లయినా కలుస్తా
- త్వరలో నిమ్జ్‌లూళి హ్యుందాయ్ కార్ల పరిశ్రమ
- జహీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
జహీరాబాద్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ జిల్లాతో ఇందిరమ్మకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ,జిల్లా అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నిమ్జ్ భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారం నుంచి రాష్ట్ర సమగ్రాభివృద్ధి వరకు పలు కీలక అంశాలపై ఆయన ప్రసంగించారు. మెదక్ తో ఇందిరమ్మ అనుబంధం, నిమ్జ్ అభివృద్ధి మెదక్ పేరు వినగానే ఇందిరమ్మ గుర్తుకు వస్తారని, చివరి శ్వాస వరకు మెదక్ ఎంపీగా కొనసాగిన గొప్ప నాయకురాలు ఆమె అని రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన నిమ్జ్ అభివృద్ధిని తమ ప్రభుత్వం వేగవంతం చేసిందని తెలిపారు. నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని పెంచామని, భూసేకరణను వేగవంతం చేశామని వెల్లడించారు. త్వరలో హ్యుందాయ్ కార్ల తయారీ కంపెనీ ఇక్కడ పనులు మొదలుపెట్టడం సంతోషంగా ఉందని ఆయన ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, నిధుల మంజూరు నిమ్జ్ భూ నిర్వాసితులైన 5612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి ఈ వేదికగా ప్రకటించారు. ఆ కుటుంబాలకు భోజనాలు పెట్టి, ఇళ్ల పట్టాలు ఇచ్చే బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు

# ఏపీకి రూ.28,346 కోట్ల గ్రీన్ ఎనర్జీ కారిడార్

- సోలార్ ప్రాజెక్టుల అభివృద్ధి, ప్రధాని సూర్యఘర్ పథకం అమలుపై చర్చ
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఆర్ పాటిల్‌లతో కూడా సీఎం సమావేశం
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చ
- గ్రీన్ ఎనర్జీ కారిడార్ మంజూరుకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ సానుకూలస్పందన

2



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. మొదటగా కేంద్ర పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన సీఎం, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలతో కలిసి సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో సోలార్ ప్రాజెక్టుల అభివృద్ధి, ప్రధాని సూర్యఘర్ పథకం అమలుపై చర్చ జరిగింది. అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఆర్ పాటిల్‌లతో కూడా సీఎం సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు. ప్రెస్‌మీట్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా కేంద్రం

# హైదరాబాద్‌లో అంతర్జాతీయ సిరిధాన్యాల కేంద్రం



- సిరిధాన్యాల కేంద్రం ఏర్పాటుకు రూ.250 కోట్లు మంజూరు
- హైదరాబాద్ ఐఐఎంఆర్‌లో అంతర్జాతీయ సిరిధాన్యాల కేంద్రం ఏర్పాటుకు రూ.250 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- వెల్లడించిన కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి
- సిరిధాన్యాల ఉత్పత్తి, వినియోగానికి ప్రోత్సాహం
- తెలంగాణ రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వెల్లడి

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
హైదరాబాద్‌లోని ఇకార్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) ప్రాంగణంలో అంతర్జాతీయ సిరిధాన్యాల నైపుణ్య కేంద్రాన్ని (గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్) ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం అధికారికంగా వెల్లడైంది. ఈ ప్రతిష్ఠాత్మక కేంద్రం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.250 కోట్లు మంజూరు చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.
ఈ నిధుల మంజూరు విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తనకు రాసిన లేఖ ద్వారా తెలియజేశారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన భారతదేశం కోసం ఆహార, పోషకాహార భద్రతను సాధించే లక్ష్యంతో సిరిధాన్యాల ఉత్పత్తిని, వినియోగాన్ని ప్రోత్సహించే పీఎం శ్రీ అన్న యోజన (మిల్లెట్స్)లో భాగంగా ఈ చొరవ తీసుకున్నట్లు ఆయన వివరించారు.
ఈ సందర్భంగా కిషన్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ఈ నూతన అంతర్జాతీయ నైపుణ్య కేంద్రం ద్వారా ఐఐఎంఆర్‌లో జరుగుతున్న పరిశోధనలకు మరింత ఊతం లభిస్తుంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన పరిశోధన ప్రయోగశాలలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, విస్తరణ కేంద్రాలను ఇక్కడ నెలకొల్పుతారు. ముఖ్యంగా తెలంగాణ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించి, సిరిధాన్యాల సాగును ప్రోత్సహిస్తారు. రైతులకు క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వడం, విలువ ఆధారిత ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మద్దతు, ఈ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి

# మెగా డీఎస్సీ వాయిదా పిటిషన్లు కొట్టివేత

- సుప్రీం కీలక నిర్ణయం..!

2

**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో:** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ను రద్దు చేసి కొత్తగా మెగా డీఎస్సీ నిర్వహించేందుకు వీలుగా కూటమి సర్కార్ ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ మేరకు టెట్ పరీక్షలు కూడా నిర్వహిస్తోంది. అయితే షెడ్యూల్ ప్రకారం త్వరలో జరగాల్సిన ఈ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై ఇవాళ సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో డీఎస్సీతో పాటు టెట్ పరీక్షలు కూడా వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై ఇవాళ సుప్రీంకోర్టులోని జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ మేరకు ఆరుగురు అభ్యర్థులు దాఖలు చేసిన

# కొడాలి నానిపై లుకౌట్ నోటీసులు జారీ

- దేశం విడిచి వెళ్లే అవకాశాలు ఉన్నాయన్న సమాచారం
- అన్ని రకాల ప్రయాణ మార్గాలపై నిఘాకై కేంద్రం ఆదేశం
- భూమార్గం, వాయుమార్గం, జలమార్గం అనే తేడా లేకుండా అన్నిచోట్లా నిఘా పెట్టాలని ఆదేశాలు
- కొడాలి నానిపై ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదు

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నానిపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లుకౌట్ నోటీసులు జారీ చేసింది. ఆయన దేశం విడిచి వెళ్లే అవకాశాలు ఉన్నాయన్న సమాచారంతో, అన్ని రకాల ప్రయాణ మార్గాలపై నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను కేంద్రం ఆదేశించింది. భూమార్గం, వాయుమార్గం, జలమార్గం అనే తేడా లేకుండా అన్నిచోట్లా నిఘా పెట్టాలని ఈ ఆదేశాల్లో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. కొడాలి నానిపై ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదై ఉన్నాయి. వీటిలో కొన్ని కేసుల్లో తీవ్రమైన అభియోగాలు

# చేజారనున్న కర్నాటక

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ తేడాతో ఓడిపోబోతుంది
- తాజా సర్వేలో ఇది తేటతెల్లం..కర్నాటక కాంగ్రెస్‌లో కలవరం
- పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ, కొడెమో టెక్నాలజీస్ సంయుక్తంగా
- నిర్వహించిన 'పల్స్ ఆఫ్ ది కర్ణాటక స్టేట్' సర్వే నివేదికలో షాకింగ్ నిజాలు

2



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో:** జాతీయ కాంగ్రెస్ పార్టీకి మరో రాష్ట్రం చేజారిపోనున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడుతున్నాయి. అవినీతి, హామీల అమలులో వైఫల్యం, అంతర్గత గ్రూపు రాజకీయాలకు తోడు మారుతున్న జాతీయ రాజకీయాల ప్రభావంతో కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో తన పట్టు కోల్పోనున్నదని తాజా సర్వేలు తేటతెల్లం చేశాయి. పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ, కొడెమో టెక్నాలజీస్ సంయుక్తంగా నిర్వహించిన 'పల్స్ ఆఫ్ ది కర్ణాటక స్టేట్' సర్వే నివేదికలో ఈ షాకింగ్ నిజాలు వెల్లడయ్యాయి. సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ఈ సర్వే తీవ్ర ప్రజా వ్యతిరేకతను బయటపెట్టింది. దీనికి విరుద్ధంగా, ప్రధాన ప్రతిపక్షం బీజేపీకి ప్రజాదరణ గణనీయంగా పెరుగుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నేటికి ఎన్నికలు జరిగితే బీజేపీ ఏకంగా 136-159 స్థానాలతో అధికారాన్ని కైవసం చేసుకునే అవకాశం ఉందని సర్వే పేర్కొంది. కాంగ్రెస్ 62-82 స్థానాలకు పరిమితం కాగా, జేడీ(ఎస్) కేవలం 3-6 స్థానాలకే పరిమితమవుతుందని అంచనా వేసింది.
మహిళా సంక్షేమ పథకాలు భారీగా అమలు చేస్తున్నా, కాంగ్రెస్‌కు ఆశించిన ఆదరణ లభించడం లేదు. ముఖ్యంగా పురుష, యువ ఓటర్లలో, రైతులు, హిందూ సామాజిక వర్గాల్లో బీజేపీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది. పహల్గాం ఘటన, ఆపరేషన్ సింధూర్ వంటి పరిణామాలు కూడా బీజేపీకి అనుకూలంగా మారినట్లు సర్వే చెబుతోంది.
గత 1985 నుండి కర్ణాటకలో ఏ అధికార పార్టీ కూడా తదుపరి ఎన్నికల్లో సొంతంగా సంపూర్ణ

# కేసీఆర్‌కు లేఖ రాసింది నిజమే

- కేసీఆర్ దేవుడని, కానీ చుట్టూ దెయ్యాలున్నాయి
- నా లేఖ లీక్ కావడంపై కుట్ర జరిగిందని ఆరోపణ
- పార్టీలోని కొందరు కోవర్టులే లేఖను బయటపెట్టారు
- లేఖలో వ్యక్తిగత అజెండా లేదు.. కార్యకర్తల అభిప్రాయాలే
- పార్టీలోని లోపాలు సరిదిద్దుకుంటేనే భవిష్యత్తు: కవిత

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తాను రాసిన లేఖ లీక్ కావడంపై ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్‌ను దేవుడితో పోల్చిన ఆమె, ఆయన చుట్టూ కొందరు దెయ్యాలు ఉన్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేసీఆర్‌కు లేఖ రాసిన మాట వాస్తవమేనని కవిత అంగీకరించారు. సుమారు రెండు వారాల క్రితమే ఈ లేఖ రాసినట్లు

# హైదరాబాద్‌లో కరోనా కలకలం

- తాజాగా కేసు నమోదు కావడంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ
- హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఓ డాక్టర్‌కు కరోనా
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ వైద్యశాఖ ఆదేశం
- ఢిల్లీలో 23 కొత్త కోవిడ్ కేసులు నమోదు
- ఆసుపత్రుల్లో బెడ్లు, ఆక్సిజన్ సిద్ధం చేయాలని ఢిల్లీ సర్కార్ సూచన

2

**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో:** ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ విజృంభించే సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలో గత కొన్ని రోజులుగా అక్కడక్కడా కొవిడ్ కేసుల గురించి వార్తలు వస్తుండగా, తాజాగా హైదరాబాద్‌లో ఒక కేసు నమోదైంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.
హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఒక వైద్యుడికి కోవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ పరిణామంతో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆ వైద్యుడి ఆరోగ్య పరిస్థితి, కాంటాక్ట్ ట్రేసింగ్ వివరాలపై అధికారులు దృష్టి సారించారు.

**ఢిల్లీలోనూ పెరుగుతున్న కేసులు**
దేశ రాజధాని ఢిల్లీలో కూడా కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి.

# రూ.12 వేల కోట్ల ఫ్రాడ్ కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్‌పై ఈడీ దాడులు

2

**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో:** రూ.12,000 కోట్ల ఫ్రాడ్ కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్స్, ఇతరులపై ఈడీ దాడులు చేసింది. సదరు సంస్థలు, వ్యక్తుల ఇళ్లపై మనీలాండరింగ్ దర్యాప్తులో పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తోంది.రూ.12 వేల కోట్ల మోసం కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్స్, ఇతరులపై ఈడీ దాడులు చేసింది. సదరు సంస్థలు, వ్యక్తుల ఇళ్లపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఈడీ పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ మేరకు అధికారిక వర్గాలు నిర్ధారించాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం

# ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ చైర్‌పర్సన్‌గా డీకేఅరుణ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు చెందిన కన్సల్టేటివ్ కమిటీకి తెలంగాణ చైర్ పర్సన్‌గా ఎంపీ డీకేఅరుణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో ఆహార ఉత్పత్తులు, ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఇతర అంశాలపై ఈ కమిటీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తుంది. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కేంద్ర ప్రభుత్వానికి డీకే అరుణ కృతజ్ఞతలు తెలిపారు.

# మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి,హత్య

- ఏపీ రాష్ట్రం మైలవరంలో దారుణం
- మూడేళ్ల బాలికపై వృద్ధుడి దాష్టీకం
- నిందితుడికి దేహశుద్ధి:పోలీసులకు అప్పగింత

2

**మైలవరం-నవభూమి:** చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వయసుతో సంబంధం లేకుండా మృగాళ్ల కామానికి స్త్రీలు బలి అవుతూనే ఉంటున్నారు. ఇప్పుడు కడప జిల్లా మైలవరం మండలం కంబాలదిన్నెలో కూడా హృదయాన్ని కలిచివేసే ఘటన చోటు చేసుకుంది. ఓ మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేయడమే కాకుండా.. అనంతరం దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. నిందితుడిని పట్టుకున్న గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ అనూహ్య ఘటన రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. ఈ దారుణానికి సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ప్రొద్దుటూరులోని అమృతనగర్‌కు చెందిన దంపతులు, తమ మూడేళ్ల కూతురితో కలిసి బంధువుల పెళ్లికి కంబాలదిన్నెకు వెళ్లారు. వేడుక జరుగుతున్న సమయంలో చిన్నారి పెళ్లి మండపం బయట ఆడుకుంటుండగా.. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అరటి పండు ఇస్తానని ఆశ చూపించి

# అతివేగానికి 6గురు బలి

- రాంగ్ రూట్‌లో వచ్చి లారీని ఢీకొట్టిన కారు
- ఒకే కుటుంబంలో ఆరుగురు దుర్మరణం
- ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు
- ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

2



**బాపట్ల-నవభూమిప్రతినిధి:**
అసలే అతివేగం.. ఆపై తప్పిన కంట్రోల్.. దీంతో ఇన్నోవాకారు చూస్తుండగానే ఎదురుగా వస్తున్న లారీని మార్జిన్ దాటి వచ్చి మరీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతిచెందగా.. ఇద్దరు చిన్నారులు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన ప్రకాశంజిల్లా కొమరోలు మండలం తాటిచర్ల మోటు పెట్రోలు బంకు సమీపంలో అమరావతి-కడప రహదారిపై శుక్రవారం జరిగింది.

## తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. మరో ఐదురోజులు భారీ వర్షాలే..!

నవ వార్త



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణవ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాగల రెండురోజుల్లో నైరుతి రుతు పవనాలు కేరళను తాకనున్నాయి. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని.. దాంతో పాటు కర్నాటక, తమిళనాడుతో పాటు దక్షిణ మధ్య ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఈ నెల 27న పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావ రణశాఖ తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. శనివారం నిర్మ ల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందని చెప్పింది.ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్క దక్కడ ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని చెప్పింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

## బీసీలకు తెలంగాణ సర్కార్ శుభవార్త..

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ ప్రభుత్వం బీసీలకు శుభవార్త చెప్పడానికి రెడీ అయ్యింది. ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తోన్న కల సాకారం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇంతకు ఆ శుభవార్త ఎంటంటే.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు. త్వరలో తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుంచి దీన్ని అమలు చేయాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

కాంగ్రెస్ పార్టీ గతంలో కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. నాడు ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు రిజర్వేషన్ల అమలుకు సబ్ కమిటీ వేసింది. ఆ తర్వాత ముసాయిదా బిల్లును తీసుకొచ్చి.. అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించింది. దీని ప్రకారం.. రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులను తీసుకొచ్చింది.

వాటిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడమే కాక.. ఆ వెంటనే కేంద్రానికి పంపించింది. ఇక త్వరలోనే నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నుంచే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయించుకున్నట్లు సమాచారం.

**సీఎం కీలక ఆదేశాలు..**

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించక 16 నెలలు కావొస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండే. కానీ 42 శాతం రిజర్వేషన్ల కోసం వేచిచూసిన రేవంత్ సర్కార్.. స్థానిక సంస్థల ఎన్నికల నుంచే దీన్ని అమలు చేయాలనే లక్ష్యంతోనే ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించలేదు.

అయితే.. తాజాగా రిజర్వేషన్ల అమలుపై, స్థానిక సంస్థల ఎన్నికలపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అనుకున్న ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూనే ఎలక్షన్ నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు సమాచారం.

**కేంద్రం ఆమోదంకై ఎదురు చూపు..**

ఇప్పటికే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రానికి పంపించారు. కేంద్రం నుంచి సైతం రిజర్వేషన్ బిల్లుకు సానుకూల స్పందన వచ్చే అవకాశాలు ఉన్నట్లు సీఎం రేవంత్ భావిస్తున్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ.. ఎలక్షన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయని తెలిసింది. జూన్, జులై నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## మెట్రో రైల్ ప్రయాణికులకు శుభవార్త.. భారీగా తగ్గిన ఛార్జీలు..




**హైదరాబాద్-నవభూమి:** నగరం అంటే మనకు ముందుగా గుర్తొచ్చేది ట్రాఫిక్. ట్రాఫిక్ హెవీగా ఉంటే ఒక కిలోమీటర్ ప్రయాణానికి గంటల సమయం పడుతుంది. హైదరాబాద్ ట్రాఫిక్ కష్టాల నుంచి ప్రజల్ని రక్షించడానికి మెట్రో ఓ వరంగా మారింది. మెట్రో పుణ్యమా అని జనం ట్రాఫిక్ చింత లేకుండా.. ఎక్కువ దూరాన్ని తక్కువ సమయంలో ప్రయాణిస్తున్నారు.అయితే, సాధారణ బస్ ఛార్జీలతో పోల్చుకుంటే మెట్రో ఛార్జీలు కొంచెం అధికంగా ఉంటాయి. ఇదే ప్రయాణికులకు కొంచెం ఇబ్బందిగా ఉండేది. ఛార్జీల విషయంలో కూడా ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదని మెట్రో యజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ఛార్జీలను తగ్గించింది. తగ్గిన ఛార్జీలు శనివారం నుంచి అమలు కానున్నాయి.

**తగ్గిన ఛార్జీల వివరాలు..**

తగ్గిన మెట్రో ఛార్జీల ప్రకారం.. కనీస ధర 11 రూపాయలుగా కాగా.. గరిష్ట ధర 69 రూపాయలుగా ఉంది. రెండు కిలోమీటర్ల వరకు మెట్రో ఛార్జీని 12 రూపాయల నుంచి 11 రూపాయలకు తగ్గించారు. 2 నుంచి 3 కిలోమీటర్ల వరకు ఛార్జీని 18 రూపాయల నుంచి 17 రూపాయలకి.. 4 నుంచి 6 కిలో మీటర్ల వరకు ఛార్జీని 30 నుంచి 28 రూపాయలకు..

6 నుంచి 9 కిలోమీటర్ల వరకు ఛార్జీని 40 నుంచి 37 రూపాయలకు వరకు తగ్గించారు. 9 నుంచి 12 కిలోమీటర్ల వరకు ఛార్జీ 50 నుంచి 47 రూపాయలకు.. 12 నుంచి 15 కిలోమీటర్ల వరకు ఛార్జీ 55 నుంచి 51 రూపాయలకు.. 15 నుంచి 18 కిలోమీటర్ల ఛార్జీ 60 నుంచి 56 రూపాయలకు.. 18 నుంచి 21 కిలోమీటర్ల ఛార్జీ 66 నుంచి 61 రూపాయలకు..21 నుంచి 24 కిలోమీటర్ల ఛార్జీని 70 నుంచి 65 రూపాయలకు.. 24 కిలోమీటర్లకు పైగా ఉండే ప్రయాణ ఛార్జీ 75 రూపాయల నుంచి 69 రూపాయలకు తగ్గించారు. తగ్గిన ఛార్జీలతో మెట్రో ప్రయాణికులకు ఎంతో మేలు జరగనుంది. రాబోయేది వర్షాకాలం కాబట్టి.. జనం మెట్రో ప్రయాణానికి మొగ్గుచూపే అవకాశం ఉంది.

## నగరం చుట్టూ చెక్‌పోస్టులు..



**హైదరాబాద్-నవభూమి:** నగరం చుట్టూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. నిబంధనలు పాటించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు. గురువారం కమాండ్ కంట్రోల్ రూములోని కమిషనర్ కార్యాలయంలో బక్రీద్ పండగ ఏర్పాట్లపై వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నిబంధనలు పాటించకుండా జంతువులను తరలిస్తున్న వారిని గుర్తించేందుకు జీహెచ్ఎంసీ, వెటర్నరీ, పోలీస్ అధికారుల బృందాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా జంతువులు తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయడంతో పాటు జంతువులను గోశాలలకు తరలించాలని తెలిపారు.

## అనర్హులకు ఇళ్లు మంజూరు చేస్తే చర్యలు



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించనుంది. ఈ పథకం కోసం లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వీటిని నిశితంగా పరిశీలించి.. అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆ వివరాలు..ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగితే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడైనా అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తే.. వాటిని మంజూరు చేసిన అధికారులపైనే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవసరమైతే అలాంటి అదికారుల సర్వీసు రద్దు చేస్తామన్నారు.ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తే.. ముందుగా సదరు అధికారిని సస్పెండ్ చేస్తామని.. ఆ తర్వాత నిజనిర్ధారణ చేసి.. ఆరోపణలు వాస్తవమని తేలితే.. అలాంటి అధికారిని సర్వీస్ నుంచి రిమూవ్ చేస్తామని వెల్లడించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ లో మీడియాతో మాట్లాడుతూ పొంగులేటి ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం భూభారతి, ఇందిరమ్మ ఇండ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. భూభారతి అమలుపై ప్రత్యేక నిఘా ఉంటుందని వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుకు సంబంధించి.. మూడు, నాలుగు దశల్లో క్రాస్ చెక్ చేసిన తర్వాతే అర్హులకు ఇండ్లు కేటాయిస్తున్నామన్నారు. జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఇండ్లలో గృహ ప్రవేశాలు చేసేలా వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా పొంగులేటి చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు 1.95 లక్షల లబ్ధిదారులను గుర్తించామన్నారు. మిగిలిన వారిని ఈ నెలాఖరు లోపు ఎంపిక చేస్తామని తెలిపారు. అలానే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు అదనంగా 10 వేల ఇండ్లు ఇస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 9,800 చెంచు కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామని, వాళ్లందరికీ ఇండ్లు ఇస్తామని మరోసారి ఆయన స్పష్టం చేశారు.గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి వల్ల రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం ఇబ్బంది పడిందని మంత్రి పొంగులేటి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి పథకం అమలు కింద పైలట్ మండలాలుగా ఎంపిక చేసిన వాటిల్లో వచ్చిన సమస్యల్లో.. కోర్టులో ఉన్నవాటిని తప్పించి మిగిలిన వాటిని జూన్ 2లోగా పరిష్కరిస్తామని తెలిపారు. అలానే రాష్ట్రంలో 413 గ్రామాలకు ఇప్పటి వరకు నక్షాలు, సర్వే రికార్డులు లేవని, వాటిలో ఐదింటిని పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసి సర్వే చేయబోతున్నట్లు చెప్పారు.

## సర్పంచ్ ఎన్నికలకు ముహూర్తం ఫిక్స్



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో త్వరలో మరో ఎన్నికల నగరా మోగనుంది. అదే స్థానిక సంస్థల ఎన్నికలు. ఎన్నికల తేదీని ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించలేదు. కానీ ఆశావాహులు మాత్రం వారి ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్లను ఆకర్షించే కార్యక్రమాలు మొదలుపెట్టారు. మరో నెల, రెండు నెలల్లో నోటిఫికేషన్ వస్తుంది.. అప్పటి వరకు ఆగడం ఎందుకన్నట్లు.. ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోయారు. ఇప్పటికే గ్రామాల్లో.. స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. కొన్ని గ్రామాల్లో అయితే ప్రత్యేక మేనిఫెస్టోలు, సర్పంచ్ పదవుల వేలం పాటలు కూడా నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఈ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. తాజాగా సర్పంచ్ ఎన్నికలపై కీలక అప్డేట్ వచ్చింది. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ముహూర్తం ఫిక్స్ చేసింది. ఆ వివరాలు..తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు.. ఎప్పుడు జరుగుతాయి అనే దానిపై జనాల్లో ఆసక్తి నెలకొని ఉంది. ఎన్నికల తేదీ ఎప్పుడు ఫిక్స్ చేస్తారా అని అందరూ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సర్పంచ్ ఎన్నికలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చినట్లు సమాచారం అందుతుంది. జూన్ చివరి వారం లేదా జులై మొదటి వారంలో ఈ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు త్వరగా అమలు కావాలంటే సర్పంచులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో సర్పంచుల పదవి కాలం ముగిసింది. గ్రామాల్లో సర్పంచ్లకు అధికారులు లేకుండా పోయాయి. దీంతో పాలన ఎక్కడికక్కడ ఆగిపోయిందని తెలుస్తోంది. అందుకే వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి.. ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా అడుగులు వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుంది.గతంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం స్థానిక సంస్థల ఎన్నికలపై స్పందించారు. మొదట జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని.. ఆ తర్వాత జూలై చివరి వారంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. తాజా సమాచారం ప్రకారం మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుందని సంబంధిత వర్గాల అధికారులు తెలిపారు.

## కేసీఆర్‌కు లేఖ రాసింది నిజమే

**(1వపేజీ తరువాయి)**ఆమె తెలిపారు. అయితే, ఆ లేఖలో తన వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదని, కేవలం పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను మాత్రమే కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశానని స్పష్టం చేశారు. "ఆ లేఖ నాదే, అందులో నా వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదు. కార్యకర్తల అభిప్రాయాలు మాత్రమే చెప్పాను" అని కవిత పేర్కొన్నారు.

అంతర్గతంగా తాను రాసిన లేఖ బయటకు రావడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వెనుక కచ్చితంగా కుట్ర ఉందని ఆరోపించారు. "కేసీఆర్ దేవుడు.. కానీ, కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. అంతర్గతంగా నేను రాసిన లేఖ బయటకు వచ్చిందంటే అర్థం ఏమిటి? నా లేఖ బయటకు వచ్చిందంటే పార్టీలో సామాన్యుల పరిస్థితి ఏంటి?" అంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలోని కొందరు కోవర్టులే ఈ లేఖను లీక్ చేసి ఉంటారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు.

కేసీఆరే తమ నాయకుడని, ఆయన నాయకత్వంలోనే తామంతా పనిచేస్తామని కవిత పునరుద్ఘాటించారు. అయితే, పార్టీలోని లోపాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని తాను అభిప్రాయపడుతున్నట్లు తెలిపారు. కాగా, కవిత అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ తిరిగి వచ్చారు. ఆమెకు తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

## హైదరాబాద్‌లో కరోనా కలకలం

**(1వపేజీ తరువాయి)**తాజాగా 23 కొత్త కోవిడ్ కేసులు నమోదైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రులలో పడకలు, ఆక్సిజన్, అవసరమైన మందులు, వ్యాక్సిన్లను సిద్ధంగా ఉంచుకోవాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు కూడా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ, అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది.

## రూ.12 వేల కోట్ల ఫ్రాడ్ కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్‌పై ఈడీ దాడులు



**(1వపేజీ తరువాయి)**నిబంధనల కింద ఢిల్లీ-ముంబైలో దాడులు జరుగుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల సొమ్ములు సుమారు 12,000 కోట్ల మేరకు మోసం, ఇంకా నిధుల "మళ్లింపు"కు సంబంధించిన కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్స్ లిమిటెడ్, ఇతరులపై ఈ సోదాలు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. గౌర్సన్స్, గుల్షన్, మహాగున్, సురక్ష రియాలిటీ వంటి, జేపీ ఇన్ ఫ్రా అనుబంధ సంస్థలపై కూడా దాడులు జరుగుతున్నాయని చెప్పారు. అయితే, దాడుల నేపథ్యంలో సంబంధిత కంపెనీలు ఇప్పటివరకూ ఏమీ స్పందించలేదు.

## తెలంగాణలో కొత్త రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు అనేక విప్లవాత్మక చర్యలను తీసుకుంటోంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 1.55 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వచ్చే నెల నుంచి వారికి సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రక్రియ సాగుతోంది. రాష్ట్రంలోని పేద బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 1.55 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేయనుంది రాష్ట్ర ప్రభుత్వం. అర్హులైన లబ్ధిదారుల వివరాలు ఈ నెల 25వ తేదీ నుంచి మొబైల్ ఫోన్ లకు మెసేజ్ లు వస్తాయని పౌరసరఫరాల శాఖ పేర్కొంది. వచ్చే నెల నుంచి వారికి సన్న బియ్యం పంపిణీ చేపట్టనుంది. కొత్తగా మంజూరైనవారికి మే 25 నుంచి మొబైల్ లకు మెసేజ్ లు వస్తాయని పౌర సరఫరాల శాఖ పేర్కొంది. కొత్త రేషన్ కార్డుదారులకు వచ్చే నెల సన్నబియ్యం పంపిణీ ఉంటుందని స్పష్టం చేసింది. గ్రామ సభల ద్వారా ఎంపికైన వారికి కొత్త కార్డులు మంజూరు చేసినట్లు వివరించింది. కొత్త రేషన్ కార్డులతో కలిపి రాష్ట్రంలో 3 కోట్ల మంది రేషన్ లబ్దిదారులుగా ఉన్నారు.

## హైదరాబాద్‌లో అంతర్జాతీయ సిరిధాన్యాల కేంద్రం

**(1వపేజీ తరువాయి)**కార్యక్రమాలు చేపడతారు," అని తెలిపారు.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కూడా ఉన్న కిషన్ రెడ్డి, ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

కేంద్ర వ్యవసాయ మంత్రి చౌహాన్ తన లేఖలో ఈ నైపుణ్య కేంద్రం యొక్క ప్రధాన ఉద్దేశాలను ప్రస్తావించారు. సిరిధాన్యాల జన్యు బ్యాంకును బలోపేతం చేయడానికి, పరిరక్షణ, నిర్దిష్ట లక్షణాల గుర్తింపు, పంట అభివృద్ధి కోసం సిరిధాన్యాల జీవవైవిధ్యాన్ని ఉపయోగించుకో వడానికి ప్రపంచస్థాయి జన్యు పదార్థాల మధ్యకాలిక నిల్వ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం వీటిలో ఒకటి.

దిగుబడి, ఉత్పాదకతను పెంచడానికి సిరిధాన్యాల లక్షణాలు, విత్తనాలు, పంట అభివృద్ధి కోసం ఇది ప్రపంచ సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అంతేకాకుండా, ఈ నైపుణ్య కేంద్రం సిరిధాన్యాల కోసం పోషకాహార తృణధాన్యాల విశ్లేషణ, ఆహార భద్రత, నాణ్యత హామీ జాతీయ ప్రయోగశాలగా కూడా పనిచేస్తుంది.

వ్యవస్థాపకత, ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల పెంపుదల కోసం సిరిధాన్యాల విలువ ఆధారిత శ్రేణికి అంతర్జాతీయ నైపుణ్య కేంద్రంగా కూడా ఇది సేవలందిస్తుందని కేంద్ర వ్యవసాయ మంత్రి తన లేఖలో వివరించారు.

## అభివృద్ధి పథంలో తెలంగాణ

**(1వపేజీ తరువాయి)**మంజూరు చేసేందుకు అవసరమైన కార్యా చరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అవస రమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం, నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి కూడా నిధులు ఇస్తామని, సురేష్ షెట్కర్, సంజీవరెడ్డిలు నారాయణఖేడ్‌కు రెండు కళ్లలాంటివారని ప్రశంసించారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేశామని, రైతు భరోసాను రూ. 12 వేలకు పెంచి, భూమిలేని పేదలకూ భరోసా అందిస్తున్నామని పేర్కొన్నారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని గుర్తుచేశారు.

## ఏపీకి రూ.28,346 కోట్ల గ్రీన్ ఎనర్జీ కారిడార్

**(1వపేజీ తరువాయి)** సహకరిస్తోందన్నారు. రూ. 28,346 కోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ కారిడార్‌ను మంజూరు చేయాలని కోరగా, ప్రహ్లాద్ జోష్ సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. సూర్యఘర్ పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 10వేల కుటుంబాలకు విద్యుత్‌ను అందించనున్నట్లు తెలిపారు. ఇక, తిరుపతిలోని ఐఐటీలో డీఆర్‌డీవో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరినట్టు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## కొడాలి నానిపై లుకౌట్ నోటీసులు జారీ

**(1వపేజీ తరువాయి)**న్నాయని, నేరం రుజువైతే గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉన్న సెక్షన్లు కూడా ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో, ఆయన విచారణ ప్రక్రియనుంచి తప్పించుకునేందుకు విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని కేంద్ర దర్యాప్తు సంస్థలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా వివిధ కేసులలో నిందితులుగా ఉన్న వ్యక్తులు దేశం విడిచి పారిపోతారనే బలమైన అనుమానాలు ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇటువంటి లుకౌట్ సర్క్యులర్‌లను జారీ చేస్తుంటుంది.

ఈ లుకౌట్ నోటీసుల జారీతో కొడాలి నాని కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా కొనసాగుతుంది. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, దేశ సరిహద్దుల వద్ద ఇమ్మిగ్రేషన్ అధికారులను అప్రమత్తం చేస్తారు. ఆయన విదేశీ ప్రయాణానికి ప్రయత్నిస్తే తక్షణమే అదుపులోకి తీసుకునే అవకాశాలుంటాయి. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## మెగా డీఎస్సీ వాయిదా పిటిషన్లు కొట్టివేత

**(1వపేజీ తరువాయి)**పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. వీరు లేవనెత్తిన కారణాలు సమంజసంగా లేవని అభిప్రాయపడింది. దీంతో వీరి పిటిషన్లను కొట్టేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఇతరత్రా సమస్యలు ఏవైనా ఉంటే మాత్రం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాల్సిందిగా పిటిషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రస్తుతానికి వీరు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేస్తూ రాష్ట్రంలో డీఎస్సీ, టెట్ పరీక్షలు యథావిధిగా నిర్వహించుకోవచ్చని ప్రభుత్వానికి సూచించింది. దీంతో ప్రభుత్వం వచ్చే నెల 6 నుంచి జూలై 6 వరకూ ఈ పరీక్షలు నిర్వహించి టీచర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు సిద్దమవుతోంది. మొత్తం 16347 పోస్టులకు ఈసారి డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు.

## చేజారనున్న కర్నాటక

**(1వపేజీ తరువాయి)**మెజారిటీ సాధించలేదనే చరిత్రను బట్టి చూస్తే, ప్రస్తుత ట్రెండ్ కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారడం ఆ పార్టీ అధిష్టానానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది కాంగ్రెస్ పార్టీకి మరో పెద్ద ఎదురుదెబ్బ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అతివేగానికి 6గురు బలి

**(1వపేజీ తరువాయి)**బాపట్ల జిల్లా స్టువర్టుపురం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన గజ్జల అంకాల్ (40), గజ్జల నరసింహ (23), మొగిలి భవాని (20), గజ్జల జోసఫ్ (25), కర్రెద్దుల దివాకర్ (24), బచ్చుల సన్నీ (27)తోపాటు మొగిలి భవానీకి చెందిన ఇద్దరు పిల్లలు.. మొత్తం 8 మంది ఇన్నోవా లో గురువారం వ్యక్తిగత పనిమీద డోన్‌కు వెళ్లారు. అక్కడ పని పూర్తికాగానే శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో తాటిచర్ల మోటు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద.. రోడ్డుకు ఎడమవైపు వెళ్లాల్సిన ఇన్నోవా కారు.. అతివేగంగా రోడ్డుకు కుడివైపునకు దూసుకొచ్చి మార్జిన్ కూడా దాటి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో కారు 120 కి.మీ. వేగంతో ఉంది. దీంతో కారు పూర్తిగా లారీ కింద ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న గజ్జల అంకాల్, గజ్జల నరసింహ, మొగిలి భవాని, గజ్జల జోసఫ్, కర్రెద్దుల దివాకర్, బచ్చుల సన్నీ అక్కడికక్కడే మృతిచెందారు. భవాని పిల్లలు శిరీషా, సిద్దు (జీతన్) గాయాలతో బయటపడ్డారు. పోలీసులు చిన్నారులను గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జీతన్ పరిస్థితి విషయమంగా ఉండడంతో ఐసీయూలో ఉంచారు.

**సీఎం చంద్రబాబు, లోకేశ్ దిగ్భ్రాంతి**

ప్రకాశం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఉన్న ఆయన ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా, ఈ ప్రమాదంపై మంత్రి లోకేశ్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

## మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి,హత్య

**(1వపేజీ తరువాయి)**ఆమెను ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి.. హత్య చేశాడు. అయితే చిన్నారి కనిపించకపోవడం తో తల్లిదండ్రులు పరిసరాల్లో గాలించగా.. చివరికి ముళ్ల పొదల్లో మృతదేహాన్ని గుర్తించారు. ఈ ఘటనతో చిన్నారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా.. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు వెల్లడించారు. అభం శుభం తెలియని చిన్నారిని బలితీసుకున్న కిరాతకుడిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
3
శుక్రవారం
23 మే 2025



# నవ జాతీయం

## పెళ్లి విఫలం కావడంతో.. పెళ్లి మధ్యవర్తిని హత్య చేసిన వ్యక్తి



**బెంగళూరు-నవభూమి:** పెళ్లి మధ్యవర్తి కుదిర్చిన వివాహం విఫలమైంది. పెళ్లి చేసుకున్న మహిళ తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఆగ్రహించిన వ్యక్తి పెళ్లి బ్రోకర్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఆ పెళ్లి మధ్యవర్తి ఇద్దరు కుమారులు కూడా కత్తి దాడిలో గాయపడ్డారు. కర్ణాటకలోని మంగళూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వామంజూర్ ప్రాంతానికి చెందిన 50 ఏళ్ల సులేమాన్ పెళ్లి సంబంధాలు చూసే మధ్యవర్తి. తన బంధువైన 30 ఏళ్ల ముస్తఫాకు షహీనాజ్ అనే మహిళతో పెళ్లి సంబంధం కుదిర్చాడు. ఎనిమిది నెలల కిందట వారిద్దరికి పెళ్లి జరిగింది.కాగా, పెళ్లైన రెండు నెలలకే ముస్తఫా పెళ్లి పెటాకులైంది. భార్య షహీనాజ్ అతడ్ని వదిలి తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో వివాహం విఫలం కావడంపై పెళ్లి సంబంధం కుదిర్చిన మధ్యవర్తి సులేమాన్‌పై ముస్తఫా ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి.మరోవైపు మే 21న రాత్రి వేళ సులేమాన్‌కు ముస్తఫా ఫోన్ చేశాడు. అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో సులేమాన్ తన ఇద్దరు కుమారులు రియాబ్, సియాబ్‌తో కలిసి వాలాచిల్‌లోని ముస్తఫా ఇంటికి చేరుకున్నాడు. కుమారులు బయట వేచి ఉండగా సులేమాన్ ఇంట్లోకి వెళ్లి ముస్తఫాతో మాట్లాడాడు. అతడు ఎంతకీ వినకపోవడంతో తిరిగి వెళ్లేందుకు బయటకు వచ్చాడు.కాగా, ముస్తఫా పరుగున ఇంటి బయటకు వచ్చి సులేమాన్‌ను బెదిరించాడు. వెంటతెచ్చిన కత్తితో అతడి మెడపై పొడవటంతో అక్కడికక్కడే మరణించాడు.



## మైసూర్‘పాక్’ ఇక మైసూర్‘శ్రీ’..

### పాక్‌తో ఉద్రిక్తతల వేళ స్వీట్ల పేర్లను మార్చిన దుకాణ యజమాని




**జమ్మూ కాశ్మీర్- నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి తో దాయాది దేశం పాకిస్థాన్‌పై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ‘పాకిస్థాన్..’ అన్న పేరు వింటేనే దేశ ప్రజలకు చిర్రెత్తుకొస్తోంది. ఆ పేరు వినడానికి కూడా ఎవరూ ఇష్టపడట్లేదు. ఈ క్రమంలో రాజస్థాన్ జైపూర్ కు చెందిన ఓ మిఠాయి దుకాణం యజమాని కీలక నిర్ణయం తీసుకున్నారు. తన దుకాణంలో ‘పాక్’ పేరుతో ఉన్న మిఠాయిలకు పేర్లు మార్చేశారు. మైసూర్‘పాక్’ సహా వివిధ స్వీట్ల పేర్లను మార్చేశారు.తన దుకాణంలోని ‘పాక్’ పేరుతో ఉన్న స్వీట్ల పేర్ల స్థానంలో ‘శ్రీ’ని యాడ్ చేశారు. మైసూర్‘పాక్’ని మైసూర్‌శ్రీ గా, మోతీ‘పాక్’ని మోతీశ్రీగా, గోండ్‌పాక్‌ని గోండ్‌శ్రీగా ఇలా పేరు మార్చినట్లు దుకాణ యజమాని తెలిపారు. స్వీట్స్‌లోని ‘పాక్’పదం కన్నడలో తీపి అని అర్థం. అయితే, ప్రస్తుతం భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సదరు దుకాణదారుడు పేర్కొన్నారు.గత నెల 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరాన్ వ్యాలీలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. సమీపంలోని అడవిలో నుంచి ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యాటకులే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. మతం అడిగి మరీ కుటుంబ సభ్యుల ఎదుటే కాల్చి చంపారు. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ ‘ఆపరేషన్ సిందూర్’ను విజయవంతంగా చేపట్టింది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది కీలక ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. ఇందుకు ప్రతిగా భారత్‌పై దాడికి ప్రయత్నించిన పాక్ సైన్యంపై కూడా విరుచుకుపడింది. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, మిస్సైళ్లను గగనతలంలోనే కూల్చివేసింది. పాక్ ఆర్మీ స్థావరాలపై కూడా దాడి చేసి దాయాదికి గట్టి బుద్ధి చెప్పింది.

## మైసూర్ శాండల్ బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నా ఎంపికపై వెల్లువెత్తిన విమర్శలు




**న్యూఢిల్లీ-నవభూమి:** మైసూర్ శాండల్ సోప్ బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నా భాటియాను కర్నాటక ప్రభుత్వం నియమించింది. అయితే, ఈ నిర్ణయంపై కన్నడిగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్నాటకకు చెందిన హీరోయిన్లను కాదని కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ బ్రాండ్ తమన్నాను తీసుకోవడంపై సోషల్ మీడియా వేదికగాపై మండిపడుతున్నారు. సర్కారు నిర్ణయంపై పలు పార్టీల నేతలు స్పందించారు. ఈ క్రమంలోనే కర్నాటక భారీ, మధ్య తరహా పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఇది భాష, ప్రాంతీయ గుర్తింపునకు సంబంధించిన విషయం కాదని.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కేఎస్‌డీఎల్ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన సమగ్ర బ్రాండ్ వ్యూహమని ఎంబీ పాటిల్ పేర్కొన్నారు. తమన్నాకు పెద్ద ఎత్తున ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకొని ఆమెను ఎంపిక చేసినట్లు తెలిపారు. 2030 నాటికి కేఎస్‌డీఎల్ అమ్మకాలను రూ.5000 కోట్లకు తీసుకెళ్లడమే మా లక్ష్యమని, దీనికి బలమైన మార్కెటింగ్ వ్యూహం అవసరమన్నారు. తమన్నా భాటియాకు 2.8 కోట్లకుపైగా సోషల్ మీడియా ఫాలోవర్లు ఉన్నారని.. ఇది ఆమె యువతరంతో కనెక్ట్ అయ్యేందుకు వీలు కల్పిస్తుందన్నారు.రష్మిక మందన్న, పూజా హెగ్డే, కియారా అద్వానీ, దీపికా పదుకొనే వంటి హీరోయన్లను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇందులో కొందరికి వీలు కుదరలేదని.. మరికొందరు వేరే బ్రాండ్స్‌కు ప్రచారకర్తలుగా ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లోనే తమన్నా భాటియాను తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 22న తమన్నా భాటియాను కేఎల్‌డీఎల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా విమర్శలు వచ్చాయి. కర్నాటకకు చెందిన హీరోయిన్ బ్రాండ్ ప్రచారకర్తగా ఉండాలని డిమాండ్ చేశారు.

## వచ్చే వారం రష్యాకు జాతీయ భద్రతా సలహాదారు..

**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశ జాతీయ భద్రతాసలహాదారు అజిత్ దోవల్ వచ్చే వారం రష్యా పర్యటనకు వెళ్లనున్నారు. భారత ప్రభుత్వ వర్గాలు ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించాయి. భారతసైన్యం పహల్గాం ఉగ్రదాడి కి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో ఈ నెల ఆరంభంలో పాకిస్థాన్ లోని, పాక్ ఆక్రమిత జమ్ముకశ్మీర్ లోని ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసి మొత్తం 9 స్థావరాలను ధ్వంసం చేసింది.ఏకంగా వంద మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ నేపథ్యంలో అజిత్ దోవల్ రష్యా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా నుంచి S-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ దిగుమతి కోసం భారత్ కొత్త ఆర్డర్‌లు ఇచ్చిందన్న ప్రచారం జరుగుతున్న సమయంలో దోవల్ రష్యాకు వెళ్తున్నారు. భారత్ ఇప్పటికే ఆర్డర్ చేసిన వాటిలో మరో రెండు S-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ దిగుమతి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ రెండు S-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను సాధ్యమైనంత తొందరగా భారత్‌కు డెలివరీ ఇవ్వాలని తొందరపెట్టేందుకే ఆయన అక్కడికి వెళ్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే రష్యాలో పర్యటిస్తున్న భారత ఎంపీల పర్యటనకు కొనసాగింపుగా దోవల్ పర్యటన జరగనుంది. మే 27 నుంచి 29వ తేదీ వరకు రష్యా రాజధాని మాస్కోలో.. భద్రతా అంశాలపై ఉన్నతస్థాయి ప్రతినిధుల అంతర్జాతీయ సమావేశం జరగనుంది. వివిధ దేశాల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. అజిత్ దోవల్ కూడా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉన్నది.

## మహిళలు ప్రసూతి సెలవులు పొందే హక్కును ఏ సంస్థ హరించలేదు : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ-నవభూమి:** మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మరోసారి సమర్థించింది. మహిళలు మాతృత్వపు లబ్ధిని, సంతానాన్ని పొందే హక్కుల్లో ప్రసూతి సెలవులు అత్యంత కీలకమైనవని పేర్కొంది. ఏ సంస్థ కూడా మహిళలకు ఉన్న ప్రసూతి సెలవు హక్కును హరించలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తన రెండో పెళ్లి తర్వాత బిడ్డకు జన్మనిచ్చేందుకు వీలుగా ప్రసూతి సెలవులను ఇచ్చేందుకు అక్కడి అధికారులు నిరాకరించారు. దాంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన మొదటి వివాహం ద్వారా ఇప్పటికే ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చినందున ఇప్పుడు ప్రసూతి సెలవులు ఇచ్చేందుకు అధికారులు నిరాకరించినట్లు ఆమె కోర్టుకు తెలియజేశారు.

# వర్షంలో వికసించిన మత సామరస్యం



ప్రకృతినే మనమంతా దేవుడిగా భావిస్తాం. చెట్టు, పుట్టలకు పూజలు చేస్తుంటాం. కులమతాలకు అతీతంగా అన్ని దేవుళ్లను పూజిస్తుంటాం. ముఖ్యంగా అనేక మంది హిందువులు ముస్లిం దేవుళ్లకు కందుర్ల పేరిట పూజలు చేస్తుంటారు. ముస్లింలు కూడా వినాయక చవితి వేడుకల్లో పాల్గొంటూ కనిపిస్తుంటారు. ఇదంతా ఎక్కడో ఓ చోట మనమంతా చూసే ఉంటాం. దేవుడిపై నమ్మకమే మనతో ఇదంతా చేయిస్తుంటుంది. అయితే తాజాగా వరుణ దేవుడు మరోసారి రెండు మతాల ప్రజలను కలిపాడు. హఠాత్తుగా కురిసిన వర్షంతో మత సామరస్యం వికసించింది. ఫలితంగా ఒకే వేదికపై హిందూ, ముస్లిం జంటలు వివాహాలు జరిగాయి.పెళ్లి అంటే నూరేళ్ల పంట. ఇద్దరు మనసులతో పాటు రెండు కుటుంబాలు, అనేక కుటుంబాలు జీవితాంతం కలిసుండబోయే ఆనందకరమైన క్షణం. ఇది అన్ని పెళ్లిళ్లలో జరిగేదే. కానీ మనం ఇప్పుడు చూడబోయే పెళ్లిలో మాత్రం రెండు సామాజిక వర్గాలు కలిశాయి. మే 20వ తేదీ రోజు పుణేలో కురిసిన వర్షం కారణంగా.. ఒకే వేదికపై హిందూ, ముస్లిం వివాహాలు జరిగాయి. వివరాల్లోకి వెళ్తే.. వనవడిలోని ఎస్‌ఆర్‌పీఎఫ్ మైదాన సమీపంలోని అలంకరణ లాన్స్‌లో హిందూ జంట సంకృతి కావడే, నరేంద్ర గలాందే పెళ్లి వేడుక జరుగుతోంది. అయితే అనుకోకుండా కుండపోతగా వర్షం కురిసింది. బహిరంగ వేదిక కావడంతో.. వేదిక, నూతన వధూవరులు, బంధువులు అంతా వర్షంలో తడిసిపోయారు.దీంతో కుటుంబ సభ్యులు సహా బంధువులు అంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పెళ్లి మధ్యలో ఆగిపోతుందేమోనని విలవిల్లాడారు. ఏం చేయాలో పాలుపోక ఫంక్షన్ హాల్ యాజమాన్యం వద్దకు వెళ్లి మరో వేదిక ఉంటే ఇవ్వాలని కోరారు. కానీ తమ వద్ద కాళీగా ఉన్న వేదిక మరేదీ లేదని.. కానీ లోపల ఉన్న ఫంక్షన్ హాల్లో మరో పెళ్లి వేడుక జరుగుతోందని చెప్పారు. వారిని ఓసారి అడగమని చెప్పారు. వారు అనుమతి ఇస్తే రెండు వివాహహాలు ఒకే వేదికపై చేయొచ్చని సలహా ఇచ్చారు. దీంతో హిందూ జంట తల్లితండ్రులు వెంటనే ముస్లిం జంట తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తమ పరిస్థితి వివరించారు. పెళ్లి మధ్యలో ఆగిపోతుంది.. కాస్త వేదికపై చోటిస్తే తమ పిల్లల పెళ్లి చేసుకుంటామని చెప్పారు.అయితే వారి పరిస్థితి అర్థం చేసుకున్న ముస్లింలు అంతా.. హిందువులు కూడా అదే వేదికపై పెళ్లి చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. దీంతో బంధువులు సహా వదూవరులు, ఇతర సామగ్రిని వెంటనే తరలించి అదే వేదికపై పెళ్లి చేశారు. రెండు కుటుంబాలు, రెండు మతాల సంప్రదాయాలకు గౌరవం ఇస్తూ.. ఎవరి పద్ధతుల్లో వారు వివాహాలు జరిపించగా.. అక్కడున్న వారంతా తెగ సంబుర పడిపోయారు. మతాల కంటే మానవత్వమే ముఖ్యమని.. హిందూ, ముస్లిం భాయి భాయి అంటూ చెప్పుకొచ్చారు. పైగా కాజీ కుటుంబం.. హిందూ అతిథులను తమ విందులోకి ఆహ్వానిస్తూ అసలైన అతిథి సత్కారం అంటే ఏంటో చూపించారు. ఈ సంఘటన మత సౌహార్ధానికి ప్రతీకగా మారింది.


# పాకిస్థాన్‌కు రెండో విడత రుణం మంజూరు

### పాకిస్థాన్‌కు ప్యాకేజీపై భారత్ వ్యాఖ్యలు.. ఐఎంఎఫ్ కీలక ప్రకటన



**జమ్మూ కాశ్మీర్- నవభూమి:** పాకిస్థాన్‌కు రుణం విషయంలో అంతర్జాతీ యంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో అమెరికా సైనిక సలహాదారు.. ట్రంప్ యంత్రాంగంపై విమర్శలు గుప్పించారు. రుణంపై పునరాలోచించాలని భారత్ కూడా వ్యాఖ్యలు చేసింది. తాజాగా, దీనిపై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ స్పందించింది. పాకిస్థాన్‌కు ఇచ్చిన బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,000 కోట్ల) ప్యాకేజీ మంజూరును ఐఎంఎఫ్ సమర్దించుకుంది. అవసరమైన అన్ని లక్ష్యాలను పాక్ పూర్తి చేసినందున తాజా విడత ప్యాకేజీని విడుదల చేసినట్టు పేర్కొంది. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు అనంతరం ఇరు దేశాల మధ్య ఘర్షణల సమయంలోనే ఐఎంఎఫ్ ఈ రుణాన్ని విడుదల చేసింది.ఐఎంఎఫ్ నిర్ణయంపై ఇటీవల భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉగ్రవాదాన్ని విధానంగా మార్చుకుని.. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ.. భారత్‌పై దాడులు జరిపే పాకిస్థాన్‌కు రుణాన్ని పునఃపరిశీలించాలని కోరింది. భారత రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ మాట్లాడుతూ.. “పాకిస్థాన్ ఇచ్చే సహాయం పరోక్షంగా ఉగ్రవాదానికి నిధుల అందజేయడమేనని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు బెయిల్ ఔట్ ప్యాకేజీ కింద రెండు విడతల్లో 2.1 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.16,500 కోట్లు) విడుదల చేసింది. మొత్తం 7 బిలియన్ డాలర్ల రుణ ఒప్పందం గత ఏడాది కుదిరింది. ‘పాకిస్థాన్ అన్ని లక్ష్యాలను సాధించింది... కొన్ని సంస్కరణల పరంగా పురోగతి కనిపించింది. అందువల్ల మా బోర్డు ఈ రుణాన్ని ఆమోదించింది’ అని కమ్యూనికేషన్ విభాగ డైరెక్టర్ జూలీ కొజాక్ మీడియా బ్రీఫింగ్‌లో అన్నారు.‘మొదటి సమీక్షను 2025 తొలి త్రైమాసికంలో నిర్వహించేందుకు ప్లాన్ చేశాం... 2025 మార్చి 25న %×వీఫీ% సిబ్బంది, పాకిస్థాన్ అధికారులు ఈ సమీక్షపై ఒప్పందం కుదుర్చుకున్నారు... ఆ ఒప్పందాన్ని మే 9న మా ఎగ్జిక్యూటివ్ బోర్డుకు సమర్పించగా, సమీక్ష పూర్తి చేసింది... దీంతో పాకిస్థాన్‌కు ఆ విడత నిధులు విడుదల అయింది’ అని ఆమె వివరించారు.భారత్, పాక్ ఉద్రిక్తతలపై స్పందించిన జూలీ కొజాక్ ‘ఈ ఘర్షణలో ప్రాణాలు కోల్పోయినవారికి మా ప్రగాఢ సానుభూతిజ. ఈ ఘర్షణకు శాంతియుత పరిష్కారం లభించాలని ఆశిస్తున్నాం’ అన్నారు. కాగా, తుదుపరి విడత రుణం కోసం పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ 11 కొత్త షరతులు విధించింది. భారత్‌తో ఉద్రిక్తతలు ఈ పథకం ఆర్థిక, సంస్కరణల లక్ష్యాలకు ముప్పు కలిగించవచ్చని ఐఎంఎఫ్ తెలిపింది. అంతేకాదు, భారత్‌తో ఘర్షణలను పెంచుకుంటే మీకే నష్టమని హెచ్చరించింది. పొరుగు దేశంతో ఉద్రిక్తతలు ఈ కార్యక్రమం ఆర్థిక, సంస్కరణల లక్ష్యాలను ప్రమాదంలోకి నెట్టొచ్చని ఐఎంఎఫ్ హెచ్చరికలు చేసింది.ఇక, పాక్‌కు ఐఎంఎఫ్ షరతుల్లో రూ. 17.6 లక్షల కోట్ల కొత్త బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం తప్పనిసరి. విద్యుత్ బిల్లుల్లో అప్పులపై చార్జీల పెంపు. మూడేళ్లకు పైబడిన వాడిన కార్ల దిగుమతులపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయడం వంటి అంశాలు ఉన్నాయి. అంతేకాదు, పాక్‌లోని నాలుగు ప్రావిన్సులు వ్యవసాయ ఆదాయ పన్ను చట్టాలను అమలు చేయాలి. ఇందులో పన్ను రిటర్నుల ప్రక్రియ, పన్ను చెల్లింపుదారుల గుర్తింపు, రిజిస్ట్రేషన్, అవగాహన ప్రచారం, అమలు పథకం ఉన్నాయి. దీనికి చివరి గడువు: జూన్ 2025.

# ఇండిగో పైలట్ రిక్వెస్ట్ తిరస్కరించిన పాక్



**జమ్మూ కాశ్మీర్- నవభూమి:** ఉత్తరాది రాష్ట్రాలను మే 21న అకాల వర్షాలు వణికించాయి. ఇక, దేశ రాజధాని ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఇండిగో విమానం హఠాత్తుగా సంభవించిన గాలివానతో ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. శ్రీనగర్ సమీపానికి విమానం చేరుకున్న సమయంలో అకస్మాత్తుగా వడగండ్ల వర్షం మొదలైంది. దీంతో పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించేందుకు అనుమతి కోరుతూ లాహోర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు ఇండిగో పైలట్ రిక్వెస్ట్ చేశాడు. కానీ పాక్ ఈ విజ్ఞప్తిని తిరస్కరించినట్టు అధికార వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. విమానం అమృతసర్ మీదుగా ప్రయాణిస్తుండగా ఈ విజ్ఞప్తి చేశారు. కానీ అనుమతి లభించకపోవడంతో విమానం తన అసలైన మార్గంలోనే ప్రయాణించాల్సి వచ్చింది. పహల్గామ్ ఘటన తర్వాత నెలకున్న ఉద్రిక్తతలతో భారత విమానాలకు గగనతలాన్ని పాకిస్థాన్ మూసివేసిన విషయం తెలిసిందే. తుఫాన్ కారణంగా విమానానికి ముందు భాగం దెబ్బతింది. న్యూఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తోన్న 6E2142 ఇండిగో విమానంలో 227 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రతికూల వాతావరణంతో విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.విమానం శ్రీనగర్‌కు చేరుకునే సమయానికి పైలట్ ఎమర్జెన్సీని ప్రకటించారు. దీంతో తమ ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్టే అని అంతా అనుకున్నారు. కానీ, చివరకు విమానాన్ని పైలట్ సురక్షితంగా శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ, అప్పటికే దాని ముందు భాగం దెబ్బతింది. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయిన వెంటనే గ్రౌండ్ డ్యూటీ సిబ్బంది సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రయాణికులు, సిబ్బంది అందర్నీ సురక్షితంగా దింపి.. విమానాన్ని తక్షణ మరమ్మతుల కోసం ‘ఎయిర్‌క్రాఫ్ట్ ఆన్ గ్రౌండ్’గా ప్రకటించారు.ఘటనపై ప్రకటన చేసిన ఇండిగో.. “ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్లిన విమానం ఆకస్మికంగా తుఫాను ఎదుర్కొన్నదని, కానీ విజయవంతంగా శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది” అని తెలిపింది. ‘ల్యాండింగ్ అనంతరం ప్రయాణికులందరినీ పరామర్శించాం. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రస్తుతం విమానానికి శ్రీనగర్‌లో తనిఖీలు, మరమ్మతులు కొనసాగుతున్నాయి.. అవసరమైన అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సేవలు పునఃప్రారంభిస్తుంది’” అని ఎయిర్‌లైన్ తెలిపింది.ఈ విమానంలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, నదీముల్ హక్ సహా ఐదుగురు నేతలు కూడా ఉన్నారు. విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసిన పైలట్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ‘చావుకు అంచుల వరకు వెళ్లాం.. దాదాపు ప్రాణాలు పోయాయి అనిపించింది. ప్రయాణికులు కేకలు వేస్తూ, ప్రార్థనలు చేస్తూ భయంతో హాహాకారాలు చేశారు’ అని జర్నలిస్ట్ సాగరికా ఘోష్ చెప్పారు. గాల్లో ఉండగానే గడగడ.. వండగడ్ల వానకు దెబ్బతిన్న విమానం ముక్కు!‘అతడే మన హీరో. విమానం ల్యాండ్ అయినప్పుడు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైందని తెలిసింది’ అని ఆమె పేర్కొన్నారు. ఆ తర్వాత వారి ప్రతినిధి బృందం పైలట్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిందని చెప్పారు. భారత, పాక్ మధ్య ఉద్రిక్తతలు ఉన్న సమయంలో విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ సంఘటన మరోసారి హైలైట్ చేసింది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నపుడు గగనతల అనుమతులకు సంబంధించి పరిమితులు ఎలాంటి ప్రభావం చూపుతాయే ఈ ఘటన ద్వారా స్పష్టమైంది.పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాలూ పరస్పరం గగనతల అనుమతులు రద్దుచేశాయి. అయితే, అత్యవసర పరిస్థితుల్లో మాత్రం మానవతాకోణంలో విమానాలను అనుమతించిన సందర్భాలు ఉన్నాయి. కానీ, పాకిస్థాన్ అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఇక, కేంద్ర ప్రభుత్వం మాత్రం.. భారత విమానాలకు పాక్ గగనతల ప్రవేశాన్ని నిరాకరించడం సాధారణమైందని పేర్కొంది.

# విద్యార్థులు కోటాలోనే ఎందుకు చనిపోతున్నారు..?

**న్యూఢిల్లీ-నవభూమి:** ఉన్నత చదువు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్ కోటాలో విద్యార్థులు ఆత్మహత్య లకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఒత్తిడి కారణంగా గత కొంతకాలంగా విద్యార్థులు తనువు చాలిస్తున్నారు. వసతి గృహాల్లోని ఫ్యాన్లకు ఉరివేసుకోవడం, విషం తాగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఆత్మహత్యలను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇది చాలా ఆందోళకరమైన విషయం అంటూ రాజస్థాన్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యింది.విద్యార్థుల ఆత్మహత్యలు కోటాలో మాత్రమే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించింది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని నిలదీశింది. వీటిని తేలికగా తీసుకోవద్దన్న ధర్మాసనం వ్యాఖ్యానిం చింది. ఈ ఏడాది కోటాలో ఇప్పటి వరకూ 14 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న విషయం తెలిసిందే. విద్యార్థుల ఆత్మహత్యలపై నమోదైన పిటిషన్లపై న్యాయమూర్తులు జేబీ పార్దీవాలా, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది.విద్యార్థుల మరణాలు చాలా తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. వీటిని తేలిగ్గా తీసుకోకూడదని పేర్కొంది. ‘మీరు ఏం చేస్తున్నారు..? ఇంత మంది పిల్లలు కోటాలో మాత్రమే ఎందుకు ఆత్మహత్య చేసుకుం టున్నారు..? దీని గురించి మీరు ఆలోచించలేదా..?’ అంటూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదిని జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించారు. ‘కోటాలో ఇప్పటి వరకూ ఎంత మంది యువ విద్యార్థులు మరణించారు.

## పోక్సో కేసులో దోషికి ఏ శిక్షా విధించని సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** పోక్సో కేసు లో దోషిగా తేలిన వ్యక్తి విషయంలో సుప్రీంకోర్టు అరుదైన తీర్పు ఇచ్చింది. ఆ వ్యక్తి కేసులో దోషిగా నిర్ధారణ అయినప్పటికీ అతడికి తన తుది తీర్పులో ఏ శిక్షా విధించలేదు. దోషిగా తేలినా శిక్ష విధించకపోవడం ఏమిటి అనుకుంటున్నారా..? అందుకు ఆ కేసులోని ప్రత్యేక పరిస్థితే కారణం. ఆ ప్రత్యేక పరిస్థితి గురించి తెలియాలంటే కేసు పూర్వాపరాలు తెలుసుకోవాల్సిందే..మైనర్ అయిన బాలికతో లైంగిక సంబంధం కొనసాగించినందుకు గతంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. ఆ కేసు విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అతడు కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు 2023 అక్టోబర్ 18న సంచలన తీర్పు వెలువరించింది.బాలిక పిటిషనర్‌తో ఇష్టపూర్వకంగానే లైంగిక సంబంధాన్ని కొనసాగించినట్లు రుజువైనందున అతడిని నిర్దోషిగా ప్రకటిస్తున్నట్లు తెలిపింది. ఆ సందర్భంగా హైకోర్టు కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. ‘కేవలం రెండు నిమిషాల లైంగిక ఆనందం కోసం చూసుకుంటే.. సమాజం దృష్టిలో బాలికలు పరాజితులుగా మిగిలిపోతారు. కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలి’ అని సూచించింది.ఈ తీర్పుపై అప్పట్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దాంతో ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. అదే సమయంలో నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దాంతో హైకోర్టు తీర్పును 2024 ఆగస్టు 20న సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ కేసులో నిందితుడికి ట్రయల్ కోర్టు విధించిన శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు స్పష్టంచేసింది.అయితే అదే సమయంలో బాధిత బాలిక మైనర్‌గా ఉన్నప్పుడు తనతో లైంగిక సంబంధం నెరిపిన వ్యక్తినే ఇప్పుడు పెళ్లి చేసుకొని ఒక బిడ్డకు జన్మనిచ్చిన విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. బాధితురాలు, దోషి ఇద్దరూ ఇప్పుడు వివాహ బంధంతో ఒక్కటైనందున పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీ వేసి, బాధితురాలితో చర్చించాలని సూచించింది. ఆ కమిటీ నివేదిక ఆధారంగా శిక్షపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపింది.దాంతో కోర్టు విధించిన గడువులోగా నిపుణుల కమిటీ కేసుకు సంబంధించిన నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకుఅందించింది. ఆ నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ ఏడాది ఏప్రిల్ 3న బాధితురాలితో మాట్లాడింది. తాజాగా శుక్రవారం తుది తీర్పు వెలువరించింది. మైనర్ బాలికపట్ల సదరు వ్యక్తి వ్యవహరించిన తీరు నేరమే అయినప్పటికీ.. ఇద్దరూ ఇప్పుడు కలిసి కాపురం చేస్తున్నందున తనకున్న విచక్షణాధికారాలను వినియోగించి ఎలాంటి శిక్ష విధించకుండా వదిలేస్తున్నట్లు పేర్కొంది.అంతేగాక బాధితురాలు పదో తరగతి పరీక్షలు రాసిన అనంతరం ఆమెకు ఉపాధి కల్పించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు బెంగాల్ ప్రభుత్వానికి సూచించింది. తన తుది తీర్పులో సుప్రీంకోర్టు ఏమన్నదంటే.. ‘ప్రస్తుతం ఆమె మేజర్. చట్టప్రకారం ఆ ఘటనను అందరం నేరంగానే చూస్తున్నప్పటికీ.. బాధితురాలు దానిని అలా చూడటం లేదు. ఆ నేరం వల్ల ఆమెపై మానసికంగా ఎలాంటి ప్రభావం పడలేదు. కానీ కొన్ని ఇబ్బందికర పరిణామాలను ఎదుర్కొంది.’ అని వ్యాఖ్యానించింది.ఈ కేసులోని ప్రత్యేక పరిస్థితులు అంటే మరీ ముఖ్యంగా దోషితో ప్రస్తుత కుటుంబ జీవితంలో బాధితురాలికి ఏర్పడిన భావోద్వేగ బంధాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నామని, ఆమెకు పూర్తిగా న్యాయం చేయడానికి తమ విచక్షణాధికారాలను ఉపయోగిస్తున్నామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ మేరకు దోషిగా నిర్ధారణ అయినప్పటికీ బాధితురాలి భర్తకు ఎలాంటి శిక్ష విధించకుండా వదిలేసింది. అయితే అతడిని నిర్దోషిగా మాత్రం ప్రకటించలేదు.

## ఒక వ్యక్తిని 38 సార్లు పాము కాటేసింది..


### రూ.11 కోట్లు పరిహారం ఇచ్చారు: జితు పట్వారీ

**భోపాల్-నవభూమి:** పాము కాటు కుంభకోణం గురించి తాను ఎప్పుడూ వినలేదని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ జితు పట్వారీ అన్నారు. అయితే సీఎం మోహన్ యాదవ్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వంలో ఇలాంటి కొత్త కుంభకోణం జరిగిందని విమర్శించారు. ఒక వ్యక్తిని 38 సార్లు పాము కాటుకు గురిచేశారని, పరిహారం పేరుతో రూ.11 కోట్లు కాజేశారని ఆరోపించారు. ‘వివిధ రకాల అవినీతి, అక్రమాలను చూశాం. కానీ సియోనీ జిల్లాకు చెందిన ఒక వ్యక్తిని 38 సార్లు పాములు కాటు వేశాయి. ప్రతిసారీ రూ.4 లక్షలు (పాము కాటుకు గురైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అందించే పరిహారం) విత్ డ్రా చేశారు. పాము కాటు పరిహారంగా ఒక జిల్లాకే రాష్ట్ర ప్రభుత్వం నుంచి దాదాపు రూ.11 కోట్లకు పైగా తీసుకున్నారు. పాము కాటు కుంభకోణం గురించి మేం ఎప్పుడూ వినలేదు. కానీ మధ్యప్రదేశ్‌లో ఇది వెలుగులోకి వచ్చింది. ఆర్థిక వనరులను ఎలా దోచుకుంటున్నారో చూడండి’ అని మండిపడ్డారు.కాగా, మధ్యప్రదేశ్‌లోని సియోనీ జిల్లాలో ఆర్థిక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ జిల్లాలో సుమారు 47 మంది పాము కాటు వల్ల పలుసార్లు చనిపోయినట్లు అధికారికంగా పేర్కొన్నారు. నకిలీ మృతుల జాబితాలో ఒకే వ్యక్తిని పాము కాటు కారణంగా మరణించినట్లు 30 సార్లు చూపించారు.

## ప్రజలను ఓట్లు అడగను.. పేదరికం నుంచి ఎలా బయటపడాలో చెబుతా: ప్రశాంత్ కిషోర్

**పాట్నా-నవభూమి:** ఎన్నికల్లో ప్రజలను తాను ఓట్లు అడగబోనని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. అయితే పేదరికం నుంచి ఎలా బయటపడాలో అన్నది చెబుతానని అన్నారు. రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ మూడేళ్లుగా బీహార్ అంతటా పర్యటిస్తున్నారు. రెండేళ్లుగా పాదయాత్ర కూడా చేస్తున్నారు. సుమారు 5,000 గ్రామాలను కాలినడకన చేరుకున్నారు. బీహార్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయ. దీంతో ప్రజలకు మరింతగా చేరువయ్యేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు.కాగా, గురువారం సరన్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడారు. దేశంలోని రాజకీయ పార్టీలను ఆయన విమర్శించారు. బీహార్ ప్రజలు కాంగ్రెస్‌ను 40 నుంచి 50 సంవత్సరాలు గెలిపించారని, ఆ తర్వాత వారు లాలూ ప్రసాద్ యాదవ్‌ను రాజుగా చేశారని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా నితీశ్ కుమార్‌ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టారని అన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గెలిపించారని, అయితే వారి జీవితాలు, వారి పిల్లల జీవితాలు మెరుగుపడలేదని విమర్శించారు. గత నాయకులంతా తీయగా మాట్లాడి ఎన్నికల్లో గెలిచిన తర్వాత వారి వాగ్దానాలను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు.మరోవైపు ఇతర నేతల మాదిరిగానే తాను కూడా సామాన్యులను మోసం చేయగలనని, అందుకే తాను ఓట్లు అడగబోనని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. 'ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ అనే వ్యక్తి ఇక్కడికి వచ్చాడు. మేం చెప్పేది విని మాకు ఓటు వేయండి. కానీ గెలిచిన తర్వాత మేం మిమ్మల్ని మోసం చేయమని హామీ ఏమిటి? కాబట్టి, నేను ఓట్లు కూడా అడగను. పేదరికం నుంచి బయటపడటానికి మీకు ఒక మార్గం చెబుతా. మీరు దానిని నేర్చుకుంటే, మీరు ఎవరికైనా ఓటు వేయవచ్చు.

నవ సాహితీ



## 'దేశ భాషలందు తెలుగు లెస్స'

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని కృష్ణదేవరాయలు చెప్పిన మాటలు మనకు ఎప్పటికీ గర్వకారణం. తెలుగు భాషకు అద్భుతమైన చరిత్ర, సంప్రదాయం, సాహిత్యం ఉన్నాయి. కానీ ఆధునిక కాలంలో ఉద్యోగాల వేటలో, విదేశాల బాటలో పరుగులు పెడుతూ మనమే మన భాషను విస్మరిస్తున్నాం. భవిష్యత్తుకు బాటలు వేసే బడి నుంచి తెలుగును నెమ్మదిగా వెలి వేశారు. ప్రైవేటు పాఠశాలల్లో మొదలైన ఈ పోకడ, రానురాను ప్రభుత్వ బడులకు కూడా పాకింది. కాన్వెంట్లలో చదివిన పిల్లలు ఆంగ్లం నేర్చుకొని, ఉన్నత విద్య పూర్తి కాగానే విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారన్న భావన సమాజంలో బలపడడంతో పల్లెల్లో కూడా ప్రభుత్వ బడులకు నిరాదరణ ఎదురైంది. మాతృభాష అంటే కేవలం సంభాషణకు ఉపయోగించే భాష కాదు. అది మన భావోద్వేగాల ప్రతిబింబం, మన సంస్కృతికి మూలాధారం. తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలలో మాతృభాష పరిరక్షణకు ప్రభుత్వాలే కాకుండా ప్రజలు, ప్రజాసంఘాలు కూడా పాటుపడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే తల్లిభాష పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూస్తున్నాం. శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం, మాతృభాషలో పునాది బలంగా ఉన్న విద్యార్థులు ఇతర భాషలను సులభంగా నేర్చుకుంటారు. పైగా మాతృభాషలో విద్యాబోధన వల్ల విద్యార్థులు బాగా అర్థం చేసుకుంటారు. ఇంట్లో మాట్లాడే భాషకు, బడిలో పాఠాలు నేర్చుకునే మాధ్యమానికి పొంతన లేకపోవడం వల్ల పిల్లలపై చిన్నప్పటి నుంచే భారం పడుతున్నది. సమాజం ఎప్పుడూ పైకి చూస్తుంది. ఉన్నత స్థానాల్లో ఉన్న వాళ్లను అనుసరిస్తుంది, అనుకరిస్తుంది. ఈ వైఖరే తెలుగును ప్రమాదపు అంచుల దాకా తీసుకుపోయింది. దాదాపు మూడు నాలుగు దశాబ్దాల క్రితం పల్లెల్లో డబ్బున్న వాళ్లు తమ పిల్లలను పక్క ఊళ్ళలోని ప్రైవేటు బడులకు పంపించడం, పట్టణాలూ నగరాల్లో పేరున్న విద్యాసంస్థల్లో చేర్పించడం మొదలయింది. అలా చదువుకున్న పిల్లలు మన దేశంలోనో పర దేశంలోనో బాగా డబ్బు సంపాదించి, సొంతూరికి వచ్చినప్పుడు మారిన జీవన శైలితో అందరి దృష్టిలో పడేవాళ్లు. అది చాపకింద నీరులా ఇంటింటికీ పాకింది. అప్పోసప్పో చేసైనా తమ పిల్లలను ప్రైవేటు బడులలో ఇంగ్లీషు మీడియం చదివించాలన్న భావన పల్లెల్లో బలపడింది.

తెలుగు భాష ప్రమాదంలో పడిందని భాషాభిమానులు గ్రహించే లోగానే పరిస్థితి దాదాపు చేతులు దాటిపోయింది. మాతృభాషలో చదువుల ఆవశ్యకతను తెలియజేస్తూ కాళ్లకు బలపాలు కట్టుకొని ఊళ్లు పట్టుకొని తిరుగుతున్న వాళ్లకు ప్రోత్సాహం లభించకపోగా, ప్రతిఘటన ఎదురయింది. వీళ్లంతా తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో చదివించి, విదేశాలకు పంపించి, ఇప్పుడిప్పుడే బలపాలు పట్టుకున్న నిరుపేదల పిల్లలను ఎదగకుండా చేసేందుకే తెలుగుభాషా పరిరక్షణ పేరుతో వీధుల్లోకి వస్తున్నారనే వాదన తెరమీదికి వచ్చింది. తెలుగును కాపాడుకోవాలని పిలుపునిస్తున్న అధిక శాతం ప్రముఖుల పిల్లలుగానీ, వాళ్ల పిల్లలుగానీ తెలుగు మాధ్యమంలో చదవడం లేదు. ఒక భాష మనుగడ కోల్పోతే, ఆ భాషతో పాటు ఆ సంస్కృతి, ఆ చరిత్ర కూడా అంతరించిపోతుంది. ఐక్యరాజ్యసమితి విద్యా విజ్ఞాన సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా నెలకు సగటున రెండు భాషలు అంతరించిపోతున్నాయి. తెలుగు భాషకు అలాంటి ప్రమాదం ఇప్పుడే లేదు అనుకున్నా, మన నిర్లక్ష్య ధోరణి కొనసాగితే అది సమీప భవిష్యత్తులో విపత్తుగా మారవచ్చు. ఎంట్రెన్సుల కోసం విద్యార్థులను తోమీతోమీ ఆప్షనల్ సబ్జెక్టులను బట్టీ పట్టించే ప్రైవేటు విద్యాసంస్థలు దీనికి ఒక అడ్డదారి కనుగొన్నాయి. తెలుగుకు బదులుగా సంస్కృతాన్ని ద్వితీయ భాషగా తీసుకుంటే పెద్దగా కష్టపడకుండానే నూటికి నూరు మార్కులు తెచ్చుకునే అవకాశం ఉండడంతో అందరినీ సంస్కృతం వైపు నడిపించాయి. ఇది తెలుగు భాషకు పెద్ద ప్రమాదంగా పరిణమించింది. చదువు జనం భాషలో ఉన్నపుడే చదువుకున్నవాళ్లకూ సామాన్యులకూ మధ్య వారధిగా ఉంటుందన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వాలు ప్రతి విభాగంలోనూ తెలుగును ఆచరణీయమైన భాషగా అమలు చేయాలి. మాతృభాషా పరిరక్షణ నినాదం ప్రతి ఇంటికీ చేరాలి. ప్రతి వ్యక్తిలోనూ భాషాభిమానం నింపాలి. ప్రతి ఇంట్లోనూ తల్లిదండ్రులు పిల్లలతో తెలుగులోనే మాట్లాడేలా ప్రోత్సహించాలి. కథలు చెప్పాలి, పాటలు పాడాలి. పండగలు, పబ్బాలలో తెలుగుదనం ఉట్టిపడేలా చూడాలి. పదో తరగతి దాకా తెలుగును తప్పనిసరిగా బోధించాలి. తెలుగు మీడియాన్ని ప్రోత్సహించాలి. ఇంగ్లీష్ ప్రాముఖ్యతను కాదనకూడదు కానీ తెలుగును తక్కువ చేయకూడదుబీ తెలుగు భాషా దినోత్సవాలు, సాహిత్య ఉత్సవాలు నిర్వహించాలి. తెలుగు అభివృద్ధికి బడ్జెట్ కేటాయించాలి. యువ రచయితలకు ప్రోత్సాహం ఇవ్వాలిబీ మొబైల్ యాప్స్, వెబ్‌సైట్స్, ఆన్‌లైన్ పాఠాలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా తెలుగును సాంకేతికతలోనూ విస్తరించాలి. కృత్రిమ మేధ, అనువాద యంత్రాలు, వాయిస్ అసిస్టెంట్లకు తెలుగును మరింత అనుకూలంగా తీర్చిదిద్దాలి. 30 ఏళ్ల క్రితం తెలుగు భాషోద్యమ సమాఖ్య వాళ్లు ఉద్యమ కరదీపికగా 'తెలుగువాణి' అనే పక్షపత్రికను నిర్వహించేవారు. ఆ పత్రికలో ప్రచురితమైన ఒక వక్కపొడుల సంస్థ ప్రకటనలోని నినాదం నాకింకా గుర్తుంది. 'వక్క పలుకుల రుచి మధురం, తెలుగు పలుకులు మృదుమధురం'. 15వ శతాబ్దంలో ఎక్కడో యూరప్ నుంచి విజయనగర సామ్రాజ్యానికి వచ్చిన నికోల్ డి కంటి అనే భాషా పరిశోధకుడు తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అని కొనియాడాడు.

# రాజకీయమూ...ఓ వ్యసనమే!?

**యాభై ఏళ్ల కిందట అసెంబ్లీ ఎంత హుందాగా ఉండేది. పుచ్చలపల్లి సుందరయ్య మొదలుకొని నేటి గుమ్మడి నర్సయ్య వరకు స్వార్థపూరిత రాజకీయాలకు దూరంగా ఉంటూ ప్రజాసమస్యలపై పోరాడేవారు. అలాంటి నేతలు ఇప్పుడు సభలో ఉన్నారా? ఏ శాసనసభ్యుడిని తీసుకున్నా..అవినీతి,నేరపూరిత మరకలెన్నో..వ్యాపారులు,రియల్ ఎస్టేట్ చేసుకునే వారు రాజకీయాల్లో చేరి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు అయ్యాక రాజకీయాల రూపురేఖలే మారిపోయాయి.**



తుమ్మలపల్లి ప్రసాద్

త్రాగుడు, జూదం, బెట్టింగ్‌లు కొందరికి ఓ వ్యసనంగా ఉంటుంది. కొందరికి పరిమితి ఉండదు. ఇరవై నాలుగు గంటలూ అదే పనిగా ఉంటూ భార్య పిల్లలనూ, కుటుంబాన్ని మర్చిపోతుంటారు. నేడు వీటి సరసన రాజకీయం చేరిందని చెప్పవచ్చు. కొందరు తొక్కుతున్నారు, మరికొందరు తొక్కించబడుతున్నారు. రాజకీయ పదవి కోసం, రాజకీయాల్లో ఆధిపత్యం కోసం కొందరు ఎంతకైనా దిగజారుతున్నారు. పూర్వ కాలంలో రాజకీయాలంటే ప్రజలకు సేవ చేయాలనే చిత్తశుద్ధి ఉండేది. నేటి కాలంలో రాజకీయాలంటే ప్రత్యర్థులను ఎక్కడ దెబ్బ కొట్టాలా! ఎంత ఎక్కువగా కూడ బెట్టాలా అనే చందంగా తయారైంది. చివరకు రాజకీయ వ్యసనం ఎంతగా తలకెక్కిందంటే తోబుట్టువులను, కట్టుకున్న వారిని, కన్న వారిని దూరం చేసుకొనే స్థాయికి చేరుకుంది.



**భర్త కంటే రాజకీయమే ముఖ్యం అంటున్న ఎన్ఆర్ ఐ భార్య!**

తనకు తన భర్త కంటే తెలంగాణ రాష్ట్రంలో రాజకీయమే ముఖ్యం అని ఒక ఎన్ ఆర్ ఐ భార్య అంటున్నారంటేనే ఈ రాజకీయ వ్యసన పిచ్చి ఎంతగా తలకెక్కిందో ఆలోచించవచ్చు. అమెరికాలో వేల కోట్ల ఆస్తి పరురాలు ఒకరు ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు చేస్తున్నారు. వద్దు మొర్రో అని భర్త మొత్తుకుంటున్నా వినడం లేదంటా! భార్య రాజకీయ వ్యసనానికి విసిగి వేసారిన భర్త, భార్యతో విడాకుల కోసం అమెరికాలో కోర్టు మెట్లు ఎక్కినట్లు తెలిసింది. అయినా ఆమె భర్త ను వదులుకోవడానికే సిద్ధ పడుతోంది కానీ తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలను మాత్రం వదలనంటుంది. ఈమెకు రాజకీయాల్లో ఏమైనా మంచి పేరు ఉందా అంటే అదీ లేదు.

**కళ్లముందు వైఎస్ కుటుంబం:**

మన కళ్ళ ముందు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని చూస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగిన వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన మరణానంతరం నేడు అన్నా చెల్లెళ్ళ అనుబంధం ఏ విధంగా ఉందో మన కంటికి కనిపిస్తుంది. ఆస్తుల విషయంలో రాజకీయాలను అడ్డం పెట్టుకుంటున్నారా? లేక రాజకీయ పదవుల పందేరంలో రోడ్డు కెక్కుతున్నారా! ఏదైతేనేం ఇది రాజకీయ వ్యసన క్రీడలో భాగమే అని చెప్పవచ్చు. అన్న వైఎస్ జగన్, చెల్లెలు షర్మిల ల తారా స్థాయికి చేరిన విభేదాలు మన కళ్ళ ముందు కనిపిస్తున్నాయి.



**తాము తక్కువ కాదంటున్న కెసిఆర్ కుటుంబం:**

ప్రక్క రాష్ట్రంలో జగన్ కుటుంబానికి తాము తక్కువ కాదన్నట్లు తాజాగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత లేఖాస్త్రం కనిపిస్తుంది. కెటిఆర్, కవిత, హరీష్ రావుల ట్రయాంగిల్ ఫైట్‌లో భాగమే ఈ లేఖాస్త్రం అని భావించక తప్పడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజకీయంగా అతి ఎక్కువగా అనుభవించిన కుటుంబం ఏదైనా ఉందంటే అది కెసిఆర్ కుటుంబమే అని చెప్పవచ్చు. కెసిఆర్, కెటిఆర్, కవిత, హరీష్ రావు, సంతోష్‌లను త్రాచులో తూకం వేసి ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అని చెప్పలేము కానీ మొత్తంగా పదేళ్ల పాటు ఒక రాష్ట్రాన్ని ఒక కుటుంబం తనివితీరా అనుభవించారనడంలో అతిశయోక్తి లేదు. అయినా వారి రాజకీయ దాహం తీరలేదు. ఎవరైతేనేం మన కుటుంబ సభ్యులు, మన రక్త సంబంధీకులు అని కూడా చూడటం లేదు. ఎవరిని ఎక్కడ తొక్కాలా అనే రాజకీయ ఎత్తుగడలే కనిపిస్తున్నాయి. కారణం రాజకీయ వ్యసనంలో భాగంగానే ఇలా జరుగుతుంది. తాతకు దగ్గులు నేర్పడం అంటే ఇదే మరి! తండ్రి కెసిఆర్‌లో ఉన్న ప్లస్ మైనస్‌లను ఎత్తిచూపే ముందు తనను ఎంపీగా ఢిల్లీకి పంపిస్తే లిక్కర్ స్కాం కేసులో ఇరుక్కుని కెసిఆర్ కుటుంబ పరువే కాదు, తెలంగాణ పరువు, అంతే కాదు ఆడబిడ్డల పరువు తీసిందని రాష్ట్రం మొత్తం కోడై కూసింది. దీనిని బట్టే రాజకీయ ధనదాహం ఎంతవరకు ఉంటుందో ఇట్టే తెలిసిపోతుంది.

**పూర్వ కాలంలో పోగొట్టుకున్న వారే ఎక్కువ:**

స్వాతంత్ర్య కాలంలో కానీ ఆ తర్వాత 1980వ సంవత్సరం వరకు రాజకీయాలను పరిశీలిస్తే ఎక్కువ మంది నాయకులు తమ ఆస్తులను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పోగొట్టుకున్న వారే ఎక్కువగా కనిపిస్తారు. నేటి తరం చెప్పలేము కానీ నాటి తరం కమ్యూనిస్టు నాయకులు తొంబై శాతం రాజకీయాల్లో ఆస్తులు పోగొట్టుకున్న వారే ఎక్కువగా కనిపిస్తుంటారు. ఒకనాడు ప్రజలకు సేవ చేయాలనే తపనతో నాయకులు రాజకీయాలు చేస్తే, నేడు ధన దాహంతో.... అంతే కాకుండా కొందరు వ్యసనపరులుగా మారి రాజకీయాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. అతిగా మద్యం తాగే వారిని రిహాబిటేషన్ సెంటర్‌కు పంపవచ్చు, మరి రాజకీయ ధన దాహ వ్యసనపరులను ఎక్కడికి పంపాలి! ఇది ఆలోచించే విషయం.

**తుమ్మలపల్లి ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్**
**స్టేట్ బ్యూరో చీఫ్ - నవభూమి దినపత్రిక**
**సెల్: 9912010030**

# అనాదిగా అణిగిపోయిన గొంతుకలకు ఆశాదీపం -బాను ముష్తాక్



సాహిత్య లోకంలో ఈ మధ్యే ఓ గొప్ప సంబరం జరిగింది. తరతరాలుగా తెరమరుగైన గొంతుకలకు దక్కిన అపురూప విజయం అది. ఈ వారం మన తెలుగు పక్క రాష్ట్రం కర్ణాటకకు చెందిన రచయిత్రి, న్యాయవాది, సమాజ సేవకురాలు బాను ముష్తాక్‌కు అంతర్జాతీయ బుకర్ బహుమతి 2025 దక్కింది. ఆమె హృదయాన్ని మెలిపెట్టే కథల సంపుటి "హార్ట్ ల్యాంప్"ని దీప భాస్తి కన్నడ నుండి ఆంగ్లంలోకి అద్భుతంగా అనువదించారు. ఈ పుస్తకం దక్కన్ పీఠభూమి నుండి ఓ బలమైన గొంతుకను ప్రపంచ సాహిత్య వేదికపైకి తీసుకురావడమే కాకుండా, కన్నడ భాషలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారం పొందిన మొట్టమొదటి రచనగా మొట్టమొదటి కథల సంపుటిగా చరిత్రలో నిలిచింది. ఇది కేవలం బాను ముష్తాక్ సాధించిన విజయం కాదుబీ సమాజంలోని చీకటి కోణాలను వెలికితీసి, ఎవరూ పట్టించుకోని గొంతుకలను ప్రపంచానికి వినిపించే సాహిత్యపు మహత్తర శక్తికి ఇది ఓ గొప్ప నిదర్శనం.



**"హార్ట్ ల్యాంప్" - ఆడబిడ్డల బతుకు చిత్రాలు:**

"హార్ట్ ల్యాంప్" అనేది మూడు దశాబ్దాల (1990-2023) పాటు రాసిన పన్నెండు కథల సంకలనం. ఇది దక్షిణాదిలోని ఆడబిడ్డల, ముఖ్యంగా ముస్లిం మహిళల జీవితాల్లోని కష్టనష్టాలు, పోరాటాలు, చిన్నచిన్న ధిక్కారాలను లోతుగా విశ్లేషిస్తుంది. 1990 నుంచీ న్యాయవాదిగా పనిచేస్తూ, మహిళా హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముష్తాక్, తన అనుభవాలనే కథలుగా మలిచారు. మతం, కుల వివక్ష, అధికార పోరాటాలు, పితృస్వామ్య బంధనాలతో అల్లుకున్న బతుకు చిత్రాలను ఆమె సూక్ష్మంగా ఆవిష్కరించారు. బుకర్ బహుమతి జ్యూరీ ఆమె సృష్టించిన పాత్రలను "నిజంగా బతుకు దెరువు కోసం పోరాడిన, ధైర్యంగా నిలబడిన అద్భుతమైన చిత్రాలు"గా కొనియాడింది. మతం, సమాజ కట్టుబాట్లు, రాజకీయ శక్తుల ప్రభావం బలంగా ఉండే చోట, అవి ఆడవారిని ప్రశ్నించకుండా లొంగిపొమ్మని డిమాండ్ చేస్తాయి. అలాంటి ప్రపంచంలో ఈ పాత్రలు పడే కష్టాలను ముష్తాక్ తన ఆర్ద్రమైన మాటల్లో ఇలా వివరించారు: "వారిపై అమానుషమైన క్రూరత్వం చూపబడి, దాదాపు బానిసలుగా మార్చబడ్డారు."

**ఈ పురస్కారం తెచ్చిన లాభాలు- భాషకు, అనువాదానికి గౌరవం:**

ఈ పురస్కారం వల్ల అనేక మంచి జరిగింది. ముఖ్యంగా ఇది కన్నడ సాహిత్యానికి అంతర్జాతీయ వేదికపై ఓ మంచి పేరు తెచ్చింది. కన్నడ భాషకు గొప్ప చరిత్ర, అద్భుతమైన భావ వ్యక్తీకరణ సంప్రదాయం ఉన్నాయి. ఎన్నడూ లేనంతగా ప్రపంచ సాహిత్య రంగం కొన్ని ఎంపిక చేసిన భాషలకే ప్రాధాన్యత ఇస్తోంది. అలాంటిది భాస్తి చేసిన సూక్ష్మమైన "కొత్త ఒరవడి" సృష్టించిన అనువాదం, దక్షిణాది భాషల సౌందర్యాన్ని కాపాడాలనే స్పృహతో చేసిన కృషి, ముష్తాక్ విజయాన్ని సులభతరం చేసింది. ఇది ప్రపంచ సాహిత్యానికి మరింత సమ్మిళితత్వాన్ని, ప్రాతినిధ్యాన్ని తెచ్చే దిశగా ఓ కీలకమైన అడుగు. భాషల మధ్య వారధులుగా అనువాదకుల పాత్ర ఎంత ముఖ్యమో ఇది నొక్కి చెబుతుంది. 2016 నుండి ప్రస్తుత రూపంలో ఉన్నప్పటి నుండి ఈ బహుమతిని గెలుచుకున్న మొట్టమొదటి భారతీయ అనువాదకురాలు దీప భాస్తి. ₹50,000 బహుమతిని ముష్తాక్‌తో సమానంగా పంచుకున్నారు. ఇది విస్తృత పాఠకులకు సాహిత్యాన్ని అందించడంలో రచయిత, అనువాదకుడి సహకారం ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది.

**చిన్న కథల సత్తా-బుకర్ వేదికపైకి:**

రెండో ముఖ్యమైన విషయం ఏంటంటే ఈ బహుమతి ఒక చిన్న కథల సంకలనానికి దక్కడం. సాహిత్య మార్కెట్లో నవలలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న ఈ రోజుల్లో, బుకర్ కమిటీ "హార్ట్ ల్యాంప్"ను గౌరవించాలనే నిర్ణయం చిన్న కథల ప్రత్యేకతను చాటిచెబుతోంది. దాని కచ్చితత్వం, చిన్న చిన్న సంఘటనలలోని లోతైన భావాలను పట్టుకునే దాని సామర్థ్యం, విభిన్న దృక్పథాలన్నిటినీ కలిపి ఒక అందమైన చిత్రంగా చూపగల దాని సత్తా. న్యాయమూర్తులు "అందమైన, చైతన్యవంతమైన, జీవితాన్ని ఆశావాదంగా చూపిన కథలు"గా వర్ణించిన ముష్తాక్ సంకలనం, దీనికి సరైన ఉదాహరణ. ప్రతి కథా ఒక పెద్ద, సంక్లిష్టమైన వాస్తవికతలోని ఒక కోణాన్ని ప్రతిబింబించే మెరుస్తున్న రత్నంలా ఉంటుంది.

**సాహిత్యం-క్రియాశీలత- విడదీయరాని బంధం:**

ముష్తాక్ సాహిత్య ప్రయాణం ఆమె సామాజిక సేవతో విడదీయరాని విధంగా ముడిపడి ఉంది. 1970, 80 దశకాలలో నైరుతి భారతదేశంలో కుల, వర్గ వ్యవస్థలపై విమర్శనాత్మక దృష్టి సారించిన బండాయ (తిరుగుబాటు) సాహిత్య ఉద్యమం నుండి ఆమె రచనలు పుట్టుకొచ్చాయి. ఆమె రచనలు సామాజిక విశ్లేషణకు, మార్పుకు ఒక శక్తివంతమైన సాధనంగా నిలబడ్డాయి. తన నిష్కపటమైన వాదనల కోసం ఆమె బెదిరింపులు, సామాజిక బహిష్కరణలను కూడా ఎదుర్కొన్నారు. అయినా సరే, అట్టడుగు వర్గాల జీవితాలను నమోదు చేయాలనే ఆమె తపన ఏమాత్రం తగ్గలేదు. ఆమె ఆరు కథల సంకలనాలు, ఒక నవల, ఒక వ్యాస సంకలనం, ఒక కవితా సంపుటి, వీటిలో చాలా వరకు కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డు వంటి ప్రాంతీయ గుర్తింపులను పొందాయి. ఇవన్నీ ఆమె అంకితభావానికి నిదర్శనం. ముఖ్యంగా, "హార్ట్ ల్యాంప్" ఆమె రచనలలో ఆంగ్లంలోకి అనువదించబడిన మొదటి పుస్తక రూపం. ఇది మన ప్రాంతీయ భాషల్లో ఇంకా వెలుగు చూడని ఎన్నో సాహిత్య నిధులు ఉన్నాయని గుర్తుచేస్తుంది.

**ఆంగ్ల పాఠకులకు సరికొత్త అనుభవం:**

బుకర్ న్యాయమూర్తులు "హార్ట్ ల్యాంప్"ను "ఆంగ్ల పాఠకులకు నిజంగా కొత్తదనం" గా అభివర్ణించారు. ఈ కొత్తదనం కేవలం కథల్లోనే కాదు, అవి అందించే నిగర్వియైన సత్యాలలో, మనం తప్పక ఎదుర్కోవాల్సిన కఠిన వాస్తవాలలో కూడా ఉంది. ముష్తాక్ స్వయంగా ఇలా అన్నారు: "నేను విస్తృతంగా పరిశోధనలు చేయనుబీ నా హృదయమే నా అధ్యయన క్షేత్రం." ఆమె ఈ లోతైన వ్యక్తిగత, సానుభూతితో కూడిన విధానం వల్ల వ్యక్తిగత స్థాయిలోనూ, మానవజాతి సార్వత్రిక స్థాయిలోనూ ప్రతిధ్వనించే కథలను సృష్టించగలిగారు. ఈ ఆశాదీపం ఎప్పటికీ వెలుగుతూనే ఉంటుంది!

బాను ముష్తాక్ సాధించిన అంతర్జాతీయ బుకర్ బహుమతి ఒక అద్భుతమైన సాహిత్య గొంతుకను, ఒక ప్రతిభావంతులైన అనువాదకురాలిని, మన సజీవ సాహిత్య సంప్రదాయాన్ని, మానవ స్ఫూర్తి యొక్క అజేయ శక్తిని వేడుక చేసుకునే సమయం. అంచులనుండి వెలువడే కథలను మరింత శ్రద్ధగా వినమని ఇది మనందరికీ ఒక తక్షణ పిలుపునిస్తుంది. ఎందుకంటే, మన భాగస్వామ్య మానవత్వం గురించి అత్యంత లోతైన అంతర్దృష్టులను మనం తరచుగా ఈ కథల నుండే తెలుసుకుంటాము. ఈ అవార్డు భారతీయ ప్రాంతీయ సాహిత్యం పట్ల మరింత ఆసక్తిని రేకెత్తిస్తుందని, విస్తృతమైన గొంతుకలను అనువదించి ప్రచురించడాన్ని ప్రోత్సహిస్తుందని మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుదాం. తద్వారా ఆంగ్ల సాహిత్య ప్రపంచం మాత్రమే కాకుండా ప్రపంచంపై మన సమిష్టి అవగాహన కూడా సుసంపన్నం అవుతుంది. "హార్ట్ ల్యాంప్" నిజంగా ఒక కొత్త దారిని వెలిగించింది, దాని వెలుగు శాశ్వతంగా ఉంటుందని మనం నమ్ముదాం.

**కింజరాపు అమరావతి**
**82472 86357**

## ఆ సౌందర్యమే శాశ్వతం

భక్తి

బాహ్య సౌందర్యం కన్నా ఆత్మ సౌందర్యం మిన్న' అనే మాట మనం తరచుగా వింటూ ఉంటాం. ఇంతకూ 'ఆత్మ సౌందర్యం' అంటే ఏమిటి? దాన్ని ఎలా పెంపొందించుకోవాలి?

**ఇవి తెలుసుకోవలసిన ఆసక్తికరమైన విషయాలు.**

చాలామంది దృష్టిలో... అందానికి అంటే సౌందర్యానికి ప్రతీక - మోనాలిసా. ఆ చిత్రాన్ని గీసిన కళాకారుడు లియోనార్డో డావిన్సీ. అతను ఫ్రాన్స్‌కు చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి. అతను సృజించిన చిత్రపటం మోనాలిసా నిజానికి ఒక బిడ్డను కోల్పోయిన తల్లిది. సంతాన వియోగంతో ఆమె చాలాకాలంగా బాధపడుతూ ఉంటుంది. ఒక రోజు... తన బిడ్డ పోలికలున్న మరొకరి బిడ్డను చూసినప్పుడు.. ఆమె ముఖంలో చిరునవ్వు ఉదయించింది. దాన్ని డావిన్సీ యథాతథంగా చిత్రించారు. ఆమె ముఖంలో విరిసిన చిరునవ్వు ఎన్ని తరాలు గడచినా... ఇప్పటికీ సౌందర్యానికి ప్రతీకగా నిలిచిపోయింది. ఆధునిక కాలంలో అందానికి ఉన్న నిర్వచనాల ప్రకారం మోనాలిసా పెద్ద అందగత్తె కాదు. కానీ ఆమె సౌందర్యానికి చిహ్నంగా ఆకర్షిస్తూనే ఉంది. ఆ చిత్రపటం నుంచి వచ్చే చైతన్య తరంగాలు మానవుల అంతరాత్మను స్పృశించడమే దీనికి కారణం. అది ఆత్మ సౌందర్యాన్ని ప్రతిబింబించే చిత్రపటం. ఎందుకంటే... ఒక మహిళ ముఖంలో మాతృప్రేమ ప్రతిఫలిస్తున్నప్పుడు... ఆమె అత్యంత సుందరంగా కనిపిస్తుంది. మీ లోపలికి చూడండి...మానవుల దృష్టిని అథోముఖంగా తీసుకువెళ్ళే భౌతికమైన శరీర ఆకర్షణ అంత ముఖ్యమైనది కాదు. మన శరీరంలోని ప్రతి భాగం నుంచి చైతన్య తరంగాలు ప్రవహించేలా మనం ఉండాలి. మనం దేనినైనా మనం తాకితే... దాని నుంచి చైతన్య తరంగాలు ప్రవహించడం ప్రారంభించాలి. అటువంటి సౌందర్యం... దైవికమైన సౌందర్యం. బాహ్య సౌందర్యం వెంట, కృత్రిమమైన ఆకర్షణల వెంట పరుగెత్తడం మంచిది కాదు. వేల సంవత్సరాల నుంచి వారసత్వంగా పొందిన సంస్కృతీ సంప్రదాయాలు మన భారతీయులకు ఉన్నాయి. వాటిని నిలబెట్టుకోవడానికి మనం ప్రయత్నించాలి. సంప్రదాయ కళలు, ఆభరణాలు, దుస్తులు... ఇవి వేల ఏళ్ళుగా వినియోగంలో ఉన్నాయి. వాటిని మనం ఉపయోగించుకోవాలి. కానీ పాశ్చాత్య దేశాల ప్రభావంతో మనం మన సంస్కృతిని మరిపోయాం. బయటి వాటిని అనుసరిస్తున్నాం. దీనివల్ల మనం మనలోని 'ఆత్మ'గా పిలిచే అతి ముఖ్యమైన అంశం అజ్ఞానంతో కప్పడిపోతోంది. మన దేశంలో ఆత్మకు అలంకారంలాంటి విషయాలు వేలకొద్దీ ఉన్నాయి. అవి ఆత్మను అణచివేయవు. కానీ మన కళ్ళు బాహ్యామైన విషయాల మీద త్వరగా కేంద్రీకృతం అవుతాయి. మానవులమైన మన ధ్యాస ఎప్పుడూ బయటే ఉండడం దీనికి కారణం. అలాకాకుండా మన లోపలికి చూడడానికి ప్రయత్నించినప్పుడు... ఆ అంతర్ సౌందర్యాన్ని, దానిలోని ఆనందాన్ని గ్రహించగలుగుతాం.

జామ పండును పేదల యాపిల్ అని అంటారు. ఎందుకంటే అందులోని పోషకాలు యాపిల్‌కు తీసిపోవు. అయితే జామ పండు వలనే కాదు దాని ఆకుల వలన కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే జామ ఆకులను నేరుగా లేదా జామ ఆకుల టీ లేదా జామ ఆకులను నీటిలో మరిగించి ఆ నీటిని తీసుకోవచ్చు.
జామ ఆకులు మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.
వీటిల్లోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు హానికరమైన సూక్ష్మజీవులతో



## జామ ఆకు ప్రయోజనాలెన్నో...

పోరాడతాయి. శరీరంలో చక్కెర స్థాయులను, ఆకలిని నియంత్రించి శరీర బరువును తగ్గించడంలో సహాయ పడతాయి.
మహిళల్లో నెలసరి వలన కలిగే నొప్పులను జామ ఆకులు తగ్గిస్తాయి. వ్యాధి నిరోధకతను పెంచుతాయి.
శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయులను నియంత్రించడంలో జామ ఆకులు బాగా పనిచేస్తాయి. దీని వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.
జామ ఆకుల క్యాన్సర్ కణాల పెరుగుదలను నివారిస్తుందని కొన్ని పరిశోధనల్లో తేలింది. క్యాన్సర్‌కు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను జామ ఆకుల్లోని యాంటీ ఆక్సిడెంట్లు నివారిస్తాయి.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
శనివారం
24 ; మే ; 2025


# లాంగ్ గౌన్లు..క్రాప్ టాప్‌లు!





ప్రపంచం కుగ్రామం అయింది.. ఫ్యాషన్ అంతా ఒక్కటైపోయింది.. అందుకే మనదగ్గర వెస్ట్రన్ వేర్ సర్వసాధారణమైపోయింది.. ఇండోవెస్ట్రన్ ?స్టైల్‌లో ఉండే లాంగ్ గౌన్లు.. కాస్త మోడ్రన్ టచ్‌తో ఉండే లెహంగా, క్రాప్ టాప్‌లు.. ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలుతున్నాయి.. పెళ్ళిళ్ళు, పేరంటాలకు ఇవే సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి..

ఇక్కత్ ఎక్కడున్నా మిమ్మల్ని సెంటరాఫ్ ఎట్రాక్షన్ చేస్తుంది. నల్లని సిల్క్ ఇక్కత్‌ని లాంగ్ గౌన్‌గా కుట్టాం. దీనికి వచ్చిన పెద్ద బార్డర్ హైలైట్‌గా కనిపిస్తున్నది. ఇక పైన ఆరెంజ్ కలర్ ప్యూర్ సిల్క్‌ని జతచేసి దానికి పోట్లీ బటన్స్ ఇచ్చాం. స్లీవ్స్ మీద సీక్వెన్స్, జర్దోసీ వర్క్‌తో నింపేశాం.

ఆకుపచ్చ సిల్క్ క్రాప్ టాప్ ఇది. దీని మీద గోటా పట్టీ, జర్దోసీ వర్క్‌తో నింపేశాం. దీనికి కూడా కోల్డ్ షోల్డర్ అద్దినట్లు ఉంది. ఇక పీచ్ కలర్ ప్యూర్ సిల్క్ లెహంగా మీద ఫుల్‌గా రాజస్థానీ స్టైల్‌లో గోటా పట్టీ వర్క్ చేయించాం. పిస్తా గ్రీన్ కలర్ బార్డర్‌ని జత చేసి దాని మీద గోల్డెన్ లేస్ కుట్టడంతో లెహంగా లుక్కే మారిపోయింది.

నీలాకాశంలో మెరిసే తారకలా కనిపించాలంటే ఈ డ్రెస్ వేయాల్సిందే! లైట్ బ్లూ నెట్ ఫ్యాబ్రిక్‌ని లాంగ్ గౌన్‌గా డిజైన్ చేశాం. వెస్ట్రన్ స్టైల్‌లో ఉండేలా ఎక్కువ గేర్‌తో దీన్ని కుట్టాం. నెక్ దగ్గర సీక్వెన్స్, చిప్స్‌తో హెవీగా వర్క్ చేశాం. 3/4 స్లీవ్స్‌తో గౌన్ లుక్కే మారిపోయింది.

ఎండలో వెన్నెల్లా కనిపించేందుకు తెల్లని లాంగ్ గౌన్ పర్‌ఫెక్ట్ ఛాయిస్. తెల్లని ఆర్గంజా మీద ఎర్రని పూల మాదిరి అప్లిక్ వర్క్ చేశాం. డ్రెస్ మొత్తం ఇదే వర్క్ వస్తుంది. బాక్స్ ప్లీట్స్ పెట్టి పైన ఎర్రని లైక్రా ఫ్యాబ్రిక్ అటాచ్ చేశాం. దీనికి హాల్టర్ నెక్ హైలైట్‌గా నిలిచింది. డార్క్ బ్లూ కలర్ వెల్వెట్‌తో లెహంగా కుట్టాం. దాని మీద మొత్తం జరీ వర్క్‌తో నింపేశాం. గోల్డెన్ జరీ వచ్చిన లేస్‌ని బార్డర్‌గా జతచేశాం. ఇక క్రాప్‌టాప్‌కి పింక్ కలర్ ప్యూర్ సిల్క్ ఎంచుకున్నాం. దీని మీద కుందన్స్, జర్దోసీ, ముత్యాలతో హెవీగా వర్క్ చేశాం. కోల్డ్ షోల్డర్, ఫుల్‌స్లీవ్స్‌తో రాజకుమారిని తలపింపొచ్చు. స్లీవ్స్ మీద గ్లాస్ ట్యూబ్స్‌తో వర్క్ చేశాం.

# సాయిల్ డాక్టర్ సౌమ్య



భూసార పరీక్షలను సులభతరం చేసి, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెస్తోంది, న్యూఢిల్లీకి చెందిన, యువ ఆవిష్కర్త సౌమ్య రావత్. 'సాయిల్ డాక్టర్' పరికరాన్ని ఆవిష్కరించి, గ్రామీణ మహిళల సాధికరతకు పాటుపడుతున్న సౌమ్య గురించిన ఆసక్తికరమైన విశేషాలు...

భూమిలో సారం ఉంటేనే పంటలు బాగా పండుతాయి. అధిక దిగుబడి వస్తుంది. సాధారణంగా చాలామంది రైతులకు సారవంతమైన భూమికి ఎలాంటి పోషకాలు అవసరమనే విషయం తెలియదు. నిజానికి భూసార పరీక్ష చేయగలిగితే, భూమికి అవసరమైన పోషకాల మోతాదులు తెలుస్తాయి. దాంతో పంట దిగుబడి పెంచుకోవడంతో పాటు ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు. అయితే తన రిసెర్చ్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించిన సమయంలో సౌమ్య రావత్, రైతులు భూసార పరీక్షకు దూరంగా ఉంటున్నారనే విషయాన్ని గ్రహించింది. ప్రజలకు శాస్త్రీయతపై నమ్మకం లేదనీ, భూసార పరీక్షలు రైతులకు అందుబాటు ధరల్లో ఉండడం లేదని కూడా తెలుసుకుంది. ఈ ఇబ్బందులతో పాటు, భూసార పరీక్షా కేంద్రాలు అందుబాటులో లేక, ఫలితాలు కూడా సకాలంలో అందడం లేదని ఆమె గుర్తించింది.

**సాయిల్ డాక్టర్ పరికరంతో...**

ఈ సమస్యలకు పరిష్కారం కోసం ఆలోచించిన సౌమ్య, ఎకోసైట్ టెక్నాలజీస్ అనే అగ్రిటెక్ కంపెనీని స్థాపించడంతో పాటు, తక్కువ ఖర్చుతో భూసార పరీక్షలు అందుబాటులోకి తెచ్చేందుకు అరచేతి పరిమాణంలో ఉండే సాయిల్ డాక్టర్ పరికరాన్ని కూడా రూపొందించింది. ఈ పరికరంతో అప్పటికప్పుడే భూసార పరీక్ష చేపట్టవచ్చు. నిమిషాల్లోనే నేల స్వభావం, నేలలోని నత్రజని, భాస్వరం, పొటాషియం, పీహెచ్, తేమ వంటి వాటిని గుర్తించి వివరాలు సేకరించవచ్చు. రైతుల ప్రయోజనం కోసం సాయిల్ డాక్టర్‌ను రూపొందించినా దానికి రైతుల ఆమోదం పెద్ద సవాలుగా మారింది. సౌమ్య మాటలను రైతులు విశ్వసించకపోగా, ఆమె స్వలాభం కోసం తన ఉత్పత్తిని అమ్ముకునే ప్రయత్నాలు చేస్తోందని అనుమానించారు. ఆమె సలహాలు తీసుకునేందుకు కూడా ఏమాత్రం సుముఖత చూపలేదు.

**రైతులు మనసు గెలిచిన సాయిల్ దీదీలు**

తెలిసిన వారు చెబితేనే రైతులు అర్థం చేసుకుంటారని, నమ్ముతారనే నిర్ణయానికొచ్చిన సౌమ్య, సాయిల్ దీదీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, గ్రామీణ మహిళలకు సాయిల్ డాక్టర్ గురించి వివరించి, వారికి దానిపై శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టింది. అలా శిక్షణ పొందిన ఆ 'సాయిల్ దీదీ'లు భూసార పరీక్షలు చేసి రైతులకు సలహాలు ఇవ్వడం మొదలుపెట్టారు. కేవలం సాయిల్ దీదీలతో పరీక్షలు చేయడం ద్వారానే సౌమ్య రైతుల నమ్మకం గెలుచుకోలేదు. ఈ సాయిల్ దీదీలు, నేలకు పరీక్షలు చేపట్టి, కావాల్సిన పోషకాలను సూచించడమే కాకుండా, ఆ తర్వాత ఆ పంటకాలం మొత్తం పంటలను పర్యవేక్షించేవారు. రైతులు తాము సూచించిన ఎరువులు వాడుతున్నారో, లేదో తెలుసుకుంటూ, వాటి ఫలితం ఎలా ఉందని ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ఉంటారు. ఆ విధంగా రైతుల్లో నమ్మకం చూరగొన్నారు. ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో ఎన్‌జీవోలు, ఎఫ్‌పీవోల ద్వారా సాయిల్ డాక్టర్ వినియోగం ఎంతో బాగా పెరిగింది.

**మహిళా సాధికారతతో...**

సాయిల్ దీదీ కార్యక్రమం మహిళా సాధికారతకు దోహదపడింది. మహిళలు ఇంటి పనులకే పరిమితం కాకుండా సాయిల్ డాక్టర్ పరికరాలతో పొలాల్లో పరీక్షలు చేస్తూ ఆదాయంతో పాటు, గుర్తింపు పొందుతున్నారు. సాయిల్ దీదీలు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సొంత వ్యాపారులు చేసుకోవడానికి సౌమ్య రావత్ అవకాశం కల్పించారు. ఇలా సౌమ్య రైతులతో పాటు, మహిళల ఎదుగుదలకు కూడా తోడ్పడింది.

ప్రజలు సాధారణంగా రక్తపోటు, మధుమేహ పరీక్షలు ఎలా తరచూ చేయించుకుంటారో, రైతులు కూడా భూసార పరీక్షలు చేయించాలని, రైతుల్లో అలాంటి మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని ఒక సందర్భంలో సౌమ్య రావత్ అన్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి తగ్గడంతోపాటు ఉత్పాదకత పెరుగుతుందని, భవిష్యత్ తరాలకు సారవంతమైన నేల అందించవచ్చని ఆమె నమ్మకం.

దేశంలో 80 శాతం కంటే ఎక్కువ మంది రైతులకు 2 హెక్టార్ల(దాదాపు 5 ఎకరాలు) కంటే తక్కువ భూమి ఉంది. రైతులు తమ భూమికి అవసరమైన పోషకాల గురించి తెలియక గుడ్డిగా అధికంగా ఎరువులు వాడుతున్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి బరమవుతుంది. అలాగే వనరులు వృధా అవడంతో పాటు ఉత్పాదకత తగ్గుతుంది.

# పిల్లల గది ఇలా ఉండాలి



పిల్లల ఆలోచనలు, అభిరుచులకు అనుగుణంగా సౌకర్యవంతంగా ఉండేలా వారి గదిని తీర్చిదిద్దాలి. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచుతూ వాళ్లు ఆనందంగా గడిపేలా గదిని అలంకరించాలి. పిల్లల గదిని డిజైన్ చేసేటప్పుడు ఏ అంశాలు పరిగణనలోకి తీసుకోవాలో తెలుసుకుందాం....

పిల్లల గదిలో గోడలకు ఒకే రంగు కాకుండా మూడు లేదా నాలుగు రంగులు ఉండేలా చూసుకోవాలి. గులాబీ, నీలం, పసుపు, ఆకుపచ్చ లాంటి ముదురు రంగులను ఎంచుకోవడం మంచిది.

గోడలకు వాల్ పేపర్లు అంటిస్తే గది ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కార్టూన్ బొమ్మలు, పిల్లలకు ఇష్టమైన కథల్లోని పాత్రల బొమ్మలు అంటించవచ్చు. ఫ్లోరల్ లేదా జంగిల్ థీమ్‌తో ఉన్న వాల్ పేపర్లు కూడా బాగుంటాయి. వీటిని పిల్లల ఇష్టప్రకారం ఎంపిక చేయడం మంచిది. కొంతమంది పిల్లలకు ప్రపంచంలోని దేశాల గురించి తెలుసుకోవాలనీ, వివిధ ప్రదేశాలకు వెళ్లాలనే ఆసక్తి ఉంటుంది. అలాంటప్పుడు రంగురంగుల ప్రపంచ పటాన్ని వాల్ పేపర్‌గా ఏర్పాటు చేయాలి. సీలింగ్ మీద.... రాత్రిపూట మెరిసే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాల బొమ్మలు అంటిస్తే పిల్లలు వాటిని చూస్తూ నిద్రపోతారు.



గది అంతటా వెలుగు ప్రసరించేలా ట్యూబ్‌లైట్ అమర్చాలి. చిన్న బెడ్ లైట్ కూడా ఉంటే మంచిది. పిల్లల గదిలో సోఫా కమ్ బెడ్‌ను ఏర్పాటు చేస్తే అది రెండు విధాలుగా పనికివస్తుంది. దిండ్లకు కార్టూన్ బొమ్మలు లేదా మంచి కొటేషన్స్ ఉన్న గలీబులను తొడిగితే బాగుంటుంది. ఆకర్షణీయమైన డిజైన్లతో ఉన్న దుప్పట్లను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. తెలుపు లేదా లేత రంగుల్లో ఉన్నవాటిని ఎంపిక చేసుకుంటే బాగుంటుంది.

పిల్లల గదిలో బుక్ షెల్ఫ్ తప్పనిసరిగా ఉండాలి. ఇందులో వాళ్లు ఆడుకునే బొమ్మలు, చదువుకునే పుస్తకాలు, కథల పుస్తకాలు లాంటివి సర్ది పెట్టాలి. గదిలో ఓ పక్కగా స్టడీ టేబుల్, కుర్చీలను ఏర్పాటు చేయాలి. టేబుల్ మీద పెన్నులు, పెన్సిళ్లు, టేబుల్ లైట్, రైటింగ్ ప్యాడ్ సర్దాలి.

# నృత్యంతో నిత్య యవ్వనం..

మారుతున్న జీవనశైలి.. యవ్వనంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. అందంతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తున్నది. ఫలితంగా.. ముప్ఫై ఏళ్లకే ముఖ వర్చస్సు తగ్గిపోతున్నది. ముడతలు పడి 'ముదిమి'కి చేరువవుతున్నది. నలభైల్లోనే ఊబకాయంతో శరీరం ఫిట్‌నెస్ కోల్పోతున్నది. యాభై ఏళ్లు నిండకుండానే.. వృద్ధాప్యం స్వాగతం పలుకుతున్నది. అయితే.. ఈ సమస్యలన్నిటినీ ఒకేఒక్క 'డ్యాన్స్' తరిమేస్తుంది. రోజూ ఓ గంట నృత్యం చేస్తే.. నిత్య యవ్వనం మీ సొంతమవుతుంది. అందానికి అండగా నిలవడంతోపాటు శరీరాన్నీ షార్ప్‌గా మార్చేస్తుంది.

నృత్యంలో సెకండ్ల వ్యవధిలోనే ముఖ కవళికలు మారిపోతుంటాయి. అంటే.. ఫేషియల్ ఎక్సర్‌సైజ్‌లు పూర్తయినట్టే! దాంతో ముఖ కండరాలు బలంగా తయారవుతాయి. ముఖంపై గీతలు, ముడతలు తగ్గుముఖం పడతాయి. రక్త ప్రసరణతోపాటు ముఖవర్చస్సూ మెరుగవుతుంది.

డ్యాన్స్‌తో జ్ఞాపకశక్తి పెరుగుతుందని 'ద న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' నిర్వహించిన అధ్యయనం తేల్చింది. కొన్నిరకాల ఏరోబిక్ డ్యాన్స్ వ్యాయామాలు.. మెదడులో జ్ఞాపకశక్తిని నియంత్రించే హిప్పోకాంపస్ ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయట. ఫలితంగా, చిత్తవైకల్యం చిత్తవుతుంది.

సంగీతానికి తగ్గట్టుగా చేసే నృత్యంతో ఒత్తిడి తగ్గుతుందని 'జర్నల్ ఆఫ్ అప్లయిడ్ జిరంటాలజీ' నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఉత్సాహంగా వేసే స్టెప్పులు.. నిరాశను తరిమికొడతాయి.

శరీరంలో సెరటోనిన్ హార్మోన్ స్థాయులను పెంచుతాయి. ఇవి మనిషి మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. దాంతో, శరీరమే కాదు.. ఆలోచనలూ యవ్వనంగా మారుతాయి.

డ్యాన్స్ చేస్తున్నంత సేపు శరీరం ఉల్లాసంగా ఊగిపోతుంది. ఫలితంగా ఫిట్‌నెస్ మరింత మెరుగుపడుతుంది. బరువు తగ్గడంతోపాటు శరీరం నాజూగ్గా తయారవుతుంది.

వయసు మీద పడేకొద్దీ వేధించే సమస్య.. కీళ్ల నొప్పులు. నృత్యంతో ఈ సమస్యకు ఇట్టే చెక్ పడిపోతుంది.



నృత్యం వల్ల శారీరక పనితీరు మెరుగుపడుతుందని 'ద స్కాలర్లీ పబ్లిషింగ్ అండ్ అకడమిక్ రిసోర్సెస్ కోయలిషన్' పరిశోధన వెల్లడించింది.

ఎంత వేగంగా డ్యాన్స్ చేస్తే.. అంతగా హృదయ స్పందన వేగం పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి భరోసా ఇస్తుంది. దీర్ఘకాలంలో జీవన నాణ్యతను పెంచుతుంది.

ఇక భాగస్వామితో కలిసి చేసే డ్యాన్స్.. బంధాలను మరింత బలపరుస్తుంది. ఫలితంగా, ఆనంద భావనలు పెరిగి.. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడి తగ్గడంతోపాటు రోగ నిరోధక వ్యవస్థను దృఢంగా మారుస్తుంది.మరెందుకు ఆలస్యం! మ్యూజిక్ సిస్టం ఆన్‌చేసి.. ఏజ్‌తో మ్యాజిక్ చేసేయండి. ఇష్టమైన పాటలకు స్టెప్పులేస్తూ.. వయసును ఒక్కో స్టెప్పు తగ్గించుకోండి.

# ఇంట్లో ఆఫీస్ స్పేస్



ఇంటి నుంచి పనిచేసే విధానం ఇప్పటికీ కొనసాగుతోంది. కొన్ని సంస్థలు పూర్తి స్థాయిలో ఈ అవకాశాన్ని కల్పిస్తుంటే మరికొన్ని మాత్రం వారానికి మూడు రోజులు ఇంటి నుంచి పనిచేయమంటున్నాయి. దీంతో ఇల్లే ఆఫీసులా మారిపోతోంది. ఇలాంటప్పుడు కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలుగకుండా ఇంట్లో ఆఫీస్ స్పేస్‌ను ఎలా ఏర్పాటు చేసుకోవాలో తెలుసుకుందాం....

ముందుగా ఇంట్లో ప్రశాంతంగా ఉండే చోటుని ఎంపిక చేసుకోవాలి. కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉపయోగించని గది అయితే మంచిది. అలా ప్రత్యేకమైన గది లేని పక్షంలో ఇంట్లో ఒక మూలగా ఆఫీస్ స్పేస్‌ను ఏర్పాటు చేసుకోవాలి. శబ్దాలు వినిపించని చోటైతే పని చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.


ఆఫీసు పని కోసం నిర్దేశించుకున్న చోట లేదా ఆ గదిలో ఒక టేబుల్ దాని ముందు సౌకర్యవంతంగా ఉండే కుర్చీని వేసుకోవాలి. పక్కనే కావాల్సిన వస్తువులు పెట్టుకోవడానికి వీలుగా చిన్న స్టాండ్ లేదా ర్యాక్‌లను అమర్చుకోవాలి. ఓ మూలగా మొక్కల కుండీలు పెట్టుకుంటే ప్రశాంతంగా అనిపిస్తుంది.

టేబుల్ మీద కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్, కేబుల్ ఆర్గనైజర్, ఛార్జర్, నోట్‌ప్యాడ్, క్యాలెండర్, పెన్ స్టాండ్ తదితరాలను సర్దుకోవాలి. టేబుల్ లైట్, చిన్న ఫ్లవర్ వాజ్‌లను కూడా పెట్టుకుంటే బాగుంటుంది.

గోడలకు మంచి పెయింటింగ్స్ లేదా స్టిక్కర్స్ ఏర్పాటు చేస్తే కార్యాలయంలో ఉన్న అనుభూతి కలుగుతుంది.ఆఫీసు పని చేసుకునే గదిలో గాలి, వెలుతురు ప్రసరించేలా ఉండాలి. రాత్రిపూట పనిచేసేవారు తెల్లటి కాంతిని ఇచ్చే ట్యూబ్‌లైట్లను అమర్చుకోవాలి. ఫ్యాన్ శబ్దం చేయకుండా చూసుకోవాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 హైదరాబాద్ శనివారం 24 । మే । 2025





## నష్టాల నుంచి బయటపడ్డ మార్కెట్లు.. 769 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్..



**ముంబై- నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. గురువారం భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు శుక్రవారం భారీగా పెరిగాయి. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గడం కలిసివచ్చింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు రాణించడంతో మార్కెట్లు భారీగా పెరిగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 80,897.00 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,897.00 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 81,905.17 పాయింట్లు పెరిగింది. చివరకు 769.09 పాయింట్లు పెరిగి.. 81,721.08 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 243.45 పాయింట్లు లాభపడి.. 24,853.15 వద్ద ముగిసింది. ఎటర్నల్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్, నెస్లే, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, ట్రెంట్ లాభాల్లో ముగిశాయి. ఇక సన్‌ఫార్మా, గ్రాసిమ్ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 1.6 శాతం, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ ఐటీ ఒక్కొక్కటి ఒకశాతం పెరిగాయి. బ్యాంక్ 0.8 శాతం, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, 0.7 శాతం నుంచి 0.5 శాతం వరకు పెరిగాయి. ఫార్మా మాత్రమే 0.4 శాతం పడిపోయింది.

## సరికొత్త రికార్డు స్థాయికి బిట్‌కాయిన్ ధర.. ఎంతకు చేరిందో తెలుసా..



**ముంబై- నవభూమి:** ఈ వారం బిట్‌కాయిన్ సరికొత్త సృష్టించింది. ఈ క్రమంలో బిట్‌కాయిన్ ధర మొదట సారిగా $110,000 (రూ.91 లక్షలకు పైగా) స్థాయికి చేరుకుంది. ఆసియా మార్కెట్లలో గురువారం ఉదయం ట్రేడింగ్ సమయంలో బిట్‌కాయిన్ 2.2% వరకు పెరిగి రికార్డ్ స్థాయిని తాకింది. అమెరికాలో స్టేబుల్‌కాయిన్ బిల్లు గురించి అంచనాలు పెరిగిన నేపథ్యంలో ఈ బూమ్ వచ్చింది. ఇది క్రిప్టోకరెన్సీకి కొత్త నియమాలను సృష్టిస్తుందని నమ్ముతున్నారు. ఎక్స్ఛేంజ్‌లో వ్యాపారులు కొనుగోలు చేసిన కాల్ ఆప్షన్‌లలో, అత్యధిక ఓపెన్ ఇంటరెస్ట్ %వి110,000, వి120,000, వి%300,000 స్థాయిలో ఉన్నాయి. ఈ ఎంపికలన్నీ జూన్ 27తో ముగిసిపోతాయి. ఈ క్రమంలో బిట్‌కాయిన్ మరింత పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**పలు కంపెనీల ఆసక్తి..**

మైఖేల్ సాయిలర్‌తో అనుబంధించబడిన స్ట్రాటజీ అనే కంపెనీ ఇప్పటివరకు $50 బిలియన్ల (రూ.4 లక్షల కోట్లకు పైగా) విలువైన బిట్‌కాయిన్‌లను కొనుగోలు చేసింది. ఇది కాకుండా, కన్వర్టిబుల్ బాండ్లు, ప్రిఫర్డ్ స్టాక్స్ వంటి అనేక కొత్త టెక్ కంపెనీలు కూడా వివిధ మార్గాల్లో బిట్‌కాయిన్‌లను సేకరిస్తున్నాయి. కాంటర్ ఫిట్జ్‌గెరాల్డ్ యూనిట్ అయిన టెథర్ హెూల్డింగ్స్, సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్ కలిసి ట్వంటీ వన్ క్యాపిటల్ ఇంక్ అనే కొత్త కంపెనీని ఏర్పాటు చేశాయి. ఇవి బిట్‌కాయిన్ ట్రెజరీపై పని చేస్తాయి. దీంతో పాటు, వివేక్ రామస్వామి కంపెనీ స్ట్రైవ్ ఎంటర్‌ప్రైజెస్ కూడా నాస్‌డాక్ అసెట్ ఎంటిటీస్ ఇంక్‌లో జాబితా చేయబడింది.

## అదానీ లాభాల పంట

**న్యూఢిల్లీ-నవభూమి:** అదానీ గ్రూప్ కంపెనీలు మార్చి 31వ తేదీతో ముగిసిన 2025 ఆర్థిక సంవత్సరంలో లాభాల మోత మోగించాయి. గ్రూప్ కంపెనీలన్నింటి స్థూల లాభం రూ.90,000 కోట్లకు చేరింది. 21 నెలల పాటు రుణాలు చెల్లించేందుకు అవసరమైన నగదు నిల్వ జమ అయింది. ఆరేళ్లలో గ్రూప్ స్థూల లాభాలు మూడింతలు పెరిగి రూ.24,870 కోట్ల నుంచి (2018-19) రూ.89,806 కోట్లకు (2024-25) చేరినట్టు కంపెనీ ప్రకటించింది. 2024 ఆర్థిక సంవత్సరంతో ఆర్జించిన రూ.82,976 కోట్లతో పోల్చితే లాభం 8.2శ పెరిగింది. ఆరేళ్ల కాలంలో (2019-2025) 24శ సమీకృత వార్షిక వృద్ధి (సీఏజీఆర్) నమోదయింది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ కంపెనీలు రూ.40,565 కోట్ల నికర లాభం ఆర్జించాయి. నికర లాభం ఆరేళ్ల సీఏజీఆర్ 48.5శ ఉంది. ఇదే కాలంలో కంపెనీ స్థూల ఆస్తులు 25శ సీఏజీఆర్‌తో రూ.6,09.133 లక్షల కోట్లకు చేరాయి. స్థూల రుణాలు 2024 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.2.41 లక్షల కోట్ల నుంచి రూ.2.9 లక్షల కోట్లకు చేరాయి. రూ.53,843 కోట్ల నగదు నిల్వను కూడా పరిగణనలోకి తీసుకుంటే గ్రూప్ కంపెనీల నికర రుణభారం రూ.2.36 లక్షల కోట్లుగా నమోదయింది. ఆస్తులపై రాబడులు (ఆర్ఓఏ) 16.5 శాతంగా ఉన్నాయి. ప్రపంచంలో మౌలిక వసతుల రంగంలోని కంపెనీల్లో గరిష్ఠ ఆర్ఓఏ ఇదేనని గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాబీ సింగ్ తెలిపారు. లాభాల్లో అద్భుత వృద్ధి కారణంగా స్థూల లాభాల్లో రుణాల వాటా 2019 నాటి 3.8శ నుంచి 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 2.6 శాతానికి తగ్గింది. స్థూల లాభాల్లో 82శ మౌలిక వసతుల విభాగం నుంచే వచ్చినట్టు ఆయన చెప్పారు. అదానీ గ్రూప్ మౌలిక వసతుల విభాగంలో యుటిలిటీ కంపెనీలు అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్‌బీ రవాణా కంపెనీలు అదానీ పోర్ట్స్, సెజ్,అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయి. పన్ను చెల్లింపుల అనంతర నగదు నిల్వ 13.6శ వృద్ధితో రూ.66,527 కోట్లున్నదని, భారీ నగదు ప్రవాహం కారణంగా రికార్డు స్థాయిలో రూ.1.26 లక్షల కోట్ల ఆస్తులు జోడయ్యాయని రాబీ సింగ్ తెలిపారు. అదానీ పోర్ట్‌ఫోలియోలో ఇంత భారీగా ఆస్తులు జోడు కావడం ఇదే ప్రథమమని పేర్కొంటూ దీని వల్ల మొత్తం ఆస్తుల విలువ రూ.6.1 లక్షల కోట్లకు చేరినట్టు ఆయన వెల్లడించారు. ఈ మొత్తంలో నాలుగింట మూడు వంతుల ఆస్తులు గల ఆరేళ్ల కాలంలోనే జోడయ్యాయన్నారు.

## బజాజ్ చేతికి కేటీఎం



**న్యూఢిల్లీ-నవభూమి:** రుణాల ఊబిలో కూరుకుపోయి కష్టాలు పడుతున్న ఆస్ట్రియాకు చెందిన బైక్‌ల తయారీ కంపెనీ కేటీఎంలో మెజారిటీ వాటాలు కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు బజాజ్ ఆటో ప్రకటించింది. తమ పూర్తి యాజమాన్య సంస్థ బజాజ్ ఆటో ఇంటర్నేషనల్ హెూల్డింగ్స్ బీవీ ద్వారా ఈ కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు వెల్లడించింది. ఇందుకోసం ఇప్పటికే 80 కోట్ల యూరోల (రూ.7,765 కోట్లు) రుణ ప్యాకేజి సమకూర్చినట్టు తెలిపింది. అన్ని రకాల అనుమతులు సాధించినట్టయితే కేటీఎంలో ప్రస్తుతం మైనారిటీ వాటాలున్న బజాజ్ మెజారిటీ వాటాలతో ఆ కంపెనీ యజమానిగా మారుతుందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఉమ్మడి అభివృద్ధి కార్యక్రమం కింద భారత్ కేంద్రంగా నిర్వహిస్తున్న కేటీఎం వ్యాపారాల్లో వేగం పెంచే కృషిని కొనసాగిస్తామని బజాజ్ తెలిపింది. ఈ కార్యక్రమం కింద ఉభయ సంస్థలు ఉమ్మడిగా బైక్‌ల అభివృద్ధి, తయారీ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 80 దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. కేటీఎం రుణ పునర్నిర్మాణానికి, వ్యాపారాల కొనసాగింపునకు తాము సమకూర్చిన నిధులు ఉపయోగపడతాయని కంపెనీ ఆ ప్రకటనలో తెలిపింది. ఆ 80 కోట్ల యూరోల్లో 20 కోట్ల యూరోలు ఇప్పటికే అందించామని, మిగతా సొమ్మును త్వరలో సమకూరుస్తామని కూడా పేర్కొంది. అత్యం త కీలక దశలో నిధులు సమకూర్చడంతో పాటు యాజమాన్య బాధ్యతలు కూడా చేపట్టడం ద్వారా కేటీఎం భవిష్యత్తును నిర్దేశించగల శక్తిగా బజాజ్ నిలుస్తుందని కంపెనీ తెలిపింది.


## మార్కెట్లోకి కొత్త ఆల్ట్రోజ్



**న్యూఢిల్లీ-నవభూమి:** టాటా మోటార్స్ అత్యంత ప్రజాదరణ పొందిన ఆల్ట్రోజ్ కారు కొత్త వెర్షన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. సరికొత్త హంగులతో తయారుచేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.6.89 లక్షలు కాగా హై ఎండ్ వెర్షన్ ధర రూ.11.49 లక్షలు. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఐదు ఆకర్షణీయమైన రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది. ప్రీమియం డిజైన్, అసాధారణ భద్రతా ఫీచర్లు, అత్యాధునిక టెక్నా లజీ దీని ప్రత్యేకతలని కంపెనీ తెలిపింది.

# హార్మోనీ 2.0 విడుదల చేసిన ఎక్సికామ్

## ఈవీ ఛార్జింగ్ లో విశ్వశనీయత మరియు సామర్థ్యాల పునర్నిర్వచనం




**గురుగ్రామ్-నవభూమి:** భారతదేశపు ప్రముఖ ఈవీ ఛార్జింగ్ మరియు కీలకమైన పవర్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఎక్సికామ్ తమ ఆధునిక %DC% ఫాస్ట్ ఛార్జర్ హార్మోనీ డైరెక్ట్ 2.0 విడుదలను ప్రకటించింది. దృఢమైన విశ్వశనీయత, తెలివైన స్టేషన్ ఆర్థికాంశాలు మరియు ఉన్నతమైన యూజర్ అనుభవం లక్ష్యంగా రూపొందించబడింది. ఈ ఉత్పత్తి ఎక్సికామ్ నిర్వహించిన శక్తితో నిండిన పరిశ్రమ కార్యక్రమం 2.0 ప్రారంభించారు. కీలకమైన అనుసరణ అడ్డంకులను నేరుగా పరిష్కరించడానికి రూపొందించబడిన హార్మోనీ డైరెక్ట్ 2.0 భారతదేశ ఈవీ మౌళిక సదుపాయాల ప్రయాణంలో కీలకమైన పురోగతిని సూచిస్తుంది. ప్రాథమికంగా హార్మోనీ డైరెక్ట్ 2.0కి హార్మోనీ ఈవీ ఆధారం, ఇది భారతదేశపు తొలి స్వదేశీయంగా అభివృద్ధి చేసిన ఛార్జర్ ఆపరేటింగ్ సిస్టం. హార్మోనీ ఈవీతెలివికి ప్రాధాన్యతనిస్తుంది, సాటిలేని నియంత్రణ, అనుకూలీకరణ మరియు విశ్వాసం కోసం ఛార్జర్-టు-కార్-టు-క్లౌడ్ పరస్పర చర్యలను ఆటోమేట్ చేస్తుంది. ఛార్జర్ కు విలక్షణంగా చేర్చిన సెన్సర్-ఆధారిత డయోగ్నిస్టిక్స్ మరియు రిమోట్ ఛార్జర్ నిర్వహణ కోసం AI-ప్రారంభించబడిన హార్మోనీ కనక్ట్ లు ఉన్నాయి, ఇది వైఫల్యాలను ఎంతగానో తగ్గిస్తుంది స్టేషన్ విశ్వశనీయతను అత్యధికం చేస్తుంది. "భారతదేశంలో ఈవీ అవలంబనను పెంచడానికి విశ్వశనీయత మరియు నమ్మకాలు కీలకం," అని అనంత్ నహత, మేనేజింగ్ డైరెక్టర్ మరియు %CEO%, ఎక్సికామ్ అన్నారు. "హార్మోనీ డైరెక్ట్ 2.0తో, సంప్రదాయబద్ధమైన ఛార్జింగ్ పరిష్కారాలను అధిగమించే ఉత్పత్తిని మేము రూపొందించాము మరియు మౌళికసదుపాయాల దృఢత్వం, వాణిజ్య కార్యకలాపం, మరియు సహజమైన యూజర్ అనుభవం కోసం కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతుంది. ఈ ఉత్పత్తి అంతర్జాతీయ టెక్నాలజీ పోకడలు మరియు స్థానిక మార్కెట్ డిమాండ్స్ రెండిటి గురించి మా విస్తృతమైన అవగాహనను ప్రదర్శిస్తుంది, భారతదేశపు ఈవీ వ్యవస్థకు మా నిబద్ధతను దృఢపరుస్తుంది." టెక్నాలజీకి మరింత ప్రాధాన్యతనిస్తూ, అన్షుమన్ దివ్యాంషు, CEO, EVSE బిజినెస్, ఎక్సికామ్ ఇలా అన్నారు, "హార్మోనీ డైరెక్ట్ 2.0 సాటిలేని సామర్థ్యం మరియు కార్యాచరణ మేధస్సును అందించడానికి ఎంతో సూక్ష్మంగా రూపొందించబడింది, ఛార్జ్ పాయింట్ మరియు వాహనాల ఆపరేటర్లకు అత్యంత ప్రధానమైన లక్షణాలు తీసుకువస్తుంది."హార్మోనీ డైరెక్ట్ 2.0 ప్లగ్స్ మధ్య వ్యవస్థ లోడ్ ను భాగస్వామం చేసే సామర్థ్యం ద్వారా వినూత్నమైన సామర్థ్యాన్ని పరిచయం చేసింది. స్మార్ట్ పవర్ నిర్వహణ ద్వారా, ఛార్జర్ రియాక్టివ్ నష్టాల సమస్యలను కూడా నిర్వహిస్తుంది తద్వారా శక్తి వ్యయాలను గణనీయంగా తగ్గిస్తుంది. ఇంకా, ఇది సాటిలేని హార్మోనీ నెట్ టెక్నాలజీని ప్రారంభించింది మరియు బహుళ ఛార్జర్లలో వాస్తవిక సమయంలో పవర్ ను భాగస్వామ్యం చేసే మేధస్సును ప్రారంభించింది, మరియు ఛార్జ్ పాయింట్ ఆపరేటర్స్ కోసం సరళత మరియు స్థాయిలో మార్పు సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇంకా, దీని మల్టి-స్టేక్ ఛార్జింగ్ పనితీరు స్మార్ట్ ఛార్జింగ్ ను తదుపరి స్థాయికి తీసుకువెళ్తుంది, బహుళ సంక్లిష్టత పరిస్థితులను ప్రారంభిస్తుంది. యూజర్ సౌకర్యం కోసం నిర్మించబడిన దీనికి సహజమైన, స్మార్ట్-ఫోన్ వంటి యూజర్ ఇంటర్ ఫేస్ ఉంది. అనుకూలమైన కేబుల్ మరియు కనక్టర్ డిజైన్ జోడించబడింది, ఫ్లీట్ ఆపరేటర్లు మరియు వ్యక్తిగత ఈవీ డ్రైవర్లు సహా యూజర్లు అందరికీ సులభమైన నిర్వహణను నిర్థారిస్తుంది. భారతదేశం తమ ప్రతిష్టాత్మకమైన ఈవీ అవలంబన లక్ష్యాల వైపు వేగంగా పయనిస్తున్న కారణంగా, మౌళికసదుపాయాల విశ్వశనీయత విజయానికి నిర్వచించదగిన చర్యగా ఉంటుంది. హార్మోనీ డైరెక్ట్ 2.0తో, ఎక్సికామ్ ఈ పరివర్తన ముందు తమ స్థానాన్ని నిలిపింది, నేటి ఆవశ్యకతలను నెరవేర్చడమే కాకుండా రేపటి సవాళ్ల కోసం కూడా సిద్ధంగా ఉండే మౌళికసదుపాయాల పరిష్కారాన్ని కేటాయిస్తోంది.

## ప్యూర్ మోటార్‌స్పోర్ట్ రాయల్టీలో మొనాకో గ్రాండ్ ప్రిక్స్‌ను
# టాటా ప్లే ఫ్యాన్‌కోడ్ స్పోర్ట్స్‌లో లైవ్‌లో చూడండి!



**న్యూఢిల్లీ-నవభూమి:** వేగం శైలిని కలిసే రేసుకు స్వాగతం. రబ్బరు వజ్రాలు మెరిసేంత ప్రకాశవంతంగా రబ్బర్ మండుతుంది! మొనాకో గ్రాండ్ ప్రిక్స్ ఫార్ములా 1 క్యాలెండర్‌లో ఇది మరో తేదీ మాత్రమే కాదు- ఇది కిరీటంలోని ఆభరణం. అధికారికంగా రేసు ప్రారంభమైన 75వ సంవత్సరం. ఇది ఒకటి కన్నా ఎక్కువ కారణాలతో ప్రత్యేకంగా మారింది. మోంటే కార్లో వైండింగ్ వీధుల్లో జరిగే ఈ లెజెండరీ రేసు, హై-ఆక్టేన్ రేసింగ్‌ను లిస్టర్‌లతో పాటు ఔరా అనిపించే తీరప్రాంత దృశ్యాలను మిళితం చేస్తుంది. మీరు వీల్-టు-వీల్ డ్రామా కోసం, సినిమాటిక్ స్కైలైన్ కోసం, హెయిర్‌పిన్ మలుపులలో చరిత్రను చూసే థ్రిల్ కోసం లేదా అత్యంత ప్రసిద్ధ సెలబ్రిటీల మెరుపులను, గ్లామర్‌లో ఆస్వాదించేందుకు సిద్ధంగా ఉంటే, %F%1 మొనాకో 2025 మీకు తప్పని సరి పిట్ స్టాప్ అవుతుంది. టాటా ప్లే వాల్యూ యాడెడ్ సర్వీస్ - ఫ్యాన్‌కోడ్ స్పోర్ట్స్ మీకు ముందు వరుస కవరేజీని అందించడంతో, అడ్రినలిన్, అత్యద్భుతాన్ని, మోటార్‌స్పోర్ట్ వైభవాల అంతిమ కలయికను వీక్షించేందుకు ట్యూన్ చేయడానికి సరైన కారణాన్ని చూపిస్తుంది.

**ఫాస్ట్ - ఫ్యూరియస్: మొనాకో డ్రిఫ్ట్**

ఇది ఇరుకైనది, మలుపులు కలిగినది మరియు ఇది కనికరం చూపనిది- మొనాకో ట్రాక్ ఒక వీధి-రేసింగ్ దృశ్యం. సర్క్యూట్ డి మొనాకో డ్రైవర్లను వారి సంపూర్ణ పరిమితతులను ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తుంది. తప్పు చేసేందుకు అవకాశమే లేకుండా చేస్తుంది. ఇది డ్రైవర్ నైపుణ్యానికి అంతిమ పరీక్ష- కంటి రెప్పలు వేస్తే మీరు అద్భుతాన్ని వీక్షించడం సాధ్యం కాదు. ఈ టర్బోచార్జ్ ఇంజిన్లు అచ్చంగా బీస్ట్‌లుగా మారిపోతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని మోటార్‌స్పోర్ట్ ఔత్సాహికులకు అత్యంత ఉల్లాసకరమైన అనుభవాన్ని వాగ్దానం చేస్తాయి. మొదటి ల్యాప్ నుంచి చివరి వరకు సాహసోపేతమైన ఓవర్‌టేక్‌లు, డ్రమటిక్ క్రాష్‌లు ఇవన్నీ మీకు ఉత్కంఠత కలిగిన క్షణాలను అందిస్తుందనడంలో సందేహం లేదు.

**ప్రతి మలుపులోనూ చరిత్ర**

F1 అభిమానులు ఈ సర్క్యూట్‌పై ప్రమాణం చేస్తారు. మొనాకో కేవలం ఒక రేసు అని మేము అంగీకరించలేమని, ఇది ఒక లెజెండ్ అని అంటారు. ఆయిర్టన్ సెన్నా ఆరు విజయాల నుంచి షూమేకర్ లెక్కించిన మాయాజాలం వరకు, ఈ ట్రాక్ మోటార్‌స్పోర్ట్ వైభవానికి సజీవ మ్యూజియం. మొనాకోను అధిగమించడం చాలా కష్టం- కనుక ఎవరైనా సాహసోపేతమైన కదలికను ప్రదర్శించినప్పుడు, ఇది తక్షణ హైలైట్-రీల్ క్షణం అవుతుంది. మీరు టెన్షన్, రిస్క్ మరియు ఉత్కంఠత కలిగిన యాక్షన్‌ను ఇష్టపడితే, ఇది మీ రేసు అవుతుంది. ప్రతి టన్నెల్, హెయిర్‌పిన్ వారసత్వంతో నిండి ఉంటుంది- ఈ కాలాతీత కథకు కొత్త అధ్యాయాన్ని జోడిస్తుందని హామీ ఇస్తుంది.

**"హెూమ్‌టౌన్ హీరో" ప్రెజర్ కుక్కర్**

మొనాకోలో రేసింగ్ కంటే నాటకీయమైనది ఏమిటి? ప్రతి మలుపులో ఊపిరి పీల్చుకునే స్వదేశీ ప్రేక్షకులతో స్థానిక హీరోగా మొనాకోలో రేసింగ్ చేయడం. అందరి దృష్టి మొనాకో ప్యాడాక్ సొంత యువరాజు చార్లెస్ లెక్లెర్క్‌పై ఉంది. అతను పెరిగిన వీధుల్లో అతను ఎలా పోటీగా దిగుతున్నాడో చూడటం మీకు మరెక్కడా కనిపించని భావోద్వేగాన్ని, ఘనతను అందిస్తుంది. ఇది వారసత్వం, హృదయ స్పూర్తి, విముక్తి మరియు వారి అబ్బాయి కోసం నగరం మొత్తం ఉత్సాహంగా నినాదాలు చేయడాన్ని ఆస్వాదించడం సరికొత్తగా కనిపించనుంది.

**ఇది మీకు ఇష్టమైన డ్రైవర్ గెలవాలని కలలు కనే ఏకైక రేసు!**

ఈ ఏడాది వీధుల్లో ఎవరు ఆధిపత్యం చెలాయిస్తారు? వెర్స్టాపెన్ దూకుడు, హామిల్టన్ అనుభవం, లెక్లెర్క్ హెూమ్-కోర్ట్ హంగ్రీ-డ్రైవర్ పోటీ ఎప్పటిలాగే తీవ్రంగా ఉంటుంది. మీరు ప్రతి పిట్ స్టాప్ మరియు ఫోటో ఫినిషింగ్‌ను ప్రత్యక్షంగా చూడాలనుకుంటారు. డ్రైవర్లు పాయింట్ల కోసం మొనాకోతో పోటీ పడరు- వారు వారసత్వం కోసం పోటీ పడతారు. ఇక్కడ విజయం అంటే అమరత్వం- మొనాకో పవిత్ర భూమి, మరియు ప్రతి డ్రైవర్ చరిత్రలో టైర్ మార్కును ఇక్కడ వదిలిపెట్టాలని కోరుకుంటారు.

# ఇదే సూపర్ ఛాన్స్.. రూ.1,199కే ఆకాశయానం




**న్యూఢిల్లీ-నవభూమి:** జీవితంలో ఒక్కసారైనా విమానం ఎక్కాలనేది మీ కలా.. అయితే, మీ కోరిక తీరేందుకు ఇదే మంచి ఛాన్స్.. వెంటనే ఎయిరిండియా లాంచ్ చేసిన మెగా సేల్‌లో టికెట్ బుక్ చేసుకోండి. బస్సు లేదా రైలు టికెట్‌కు అయ్యే ఖర్చుతోనే ఫ్లైట్ ఎక్కేయండి. డిసెంబర్ 10, 2025 వరకూ దేశవిదేశాల్లో ఎక్కడికైనా అతితక్కువఖర్చుతోనే విమాన ప్రయాణం చేసే అవకాశం మిస్సవకండి. సామాన్యులు విమానం ఎక్కడాన్ని ఒక కలగానే భావిస్తారు. కానీ, ఇప్పుడది అసాధ్యమేమీ కాదు. బస్సు లేదా రైలు ప్రయాణాలకు అయ్యే ఖర్చుతోనే విమానం ఎక్కేయచ్చు. ఎందుకంటే ఎయిరిండియా మరోసారి ప్రయాణీకుల కోసం స్పెషల్ సేల్ ఆఫర్ లాంచ్ చేసింది. కేవలం రూ.1,199 తోనే దేశీయ మార్గాల్లో విమాన ప్రయాణం చేయవచ్చు. ఎయిరిండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా స్పెషల్ సేల్ కింద టికెట్లు బుక్ చేసుకోవాలి. డిసెంబర్ 10, 2025 వరకూ దేశవిదేశీ ప్రయాణాల కోసం టికెట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే, మే 23, 2025 రాత్రి 11:59 గంటల వరకే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఎయిర్ ఇండియా లాంచ్ చేసిన లిమిటెట్ టికెట్ సేల్ ఆఫర్ మే 23, 2025 వరకే అందుబాటులో ఉంటుంది. ఈ స్పెషల్ సేల్ కింద దేశవిదేశీ ప్రయాణాల కోసం ప్రయాణీకులు అతి తక్కువ ఖర్చుతోనే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం లభిస్తుంది. వన్-వే దేశీయ టిక్కెట్లను ప్రయాణికులు ఇప్పుడు కేవలం రూ.1,199 నుంచి బుక్ చేసుకోవచ్చు. అంతర్జాతీయ రౌండ్-ట్రిప్ ఛార్జీలు రూ.11,969 నుంచి ప్రారంభమవుతాయి. గతంలో సెప్టెంబర్ 30, 2025 వరకూ ఉన్న ట్రావెల్ విండో డిసెంబర్ 10, 2025 వరకూ పొడిగించబడింది. ఉత్తర అమెరికా, యూరప్ ఆస్ట్రేలియా వంటి ఎంపిక చేసిన సుదూర అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణీకులు టికెట్ బుక్ చేసుకోవచ్చు.

**ఎక్కువ డబ్బు ఆదా కావాలంటే..**

ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లో నేరుగా బుక్ చేసుకునే కస్టమర్లకు సౌలభ్య రుసుములు ఉండవు. FLYAI ప్రోమో కోడ్‌ని ఉపయోగిస్తే ఒక్కో ప్రయాణీకుడి రూ.3,000 వరకు అదనంగా డబ్బు ఆదా అవుతుంది. %UPI% లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలని ఎంచుకునే వారు వరుసగా UPIPROMO, NBPROMO% కోడ్‌లను ఉపయోగించి రూ.2,500 వరకు అదనపు తగ్గింపులను పొందవచ్చు.

**డిస్కౌంట్ యాడ్-ఆన్**

ఎయిర్ ఇండియా ప్రీపెయిడ్ బ్యాగేజీపై (నాన్-స్టాప్ విమానాలకు) 40%, సీటు ఎంపికపై 20% వరకు తగ్గింపును అందిస్తోంది. ఎక్స్ ట్రా లెగ్‌రూమ్ సీట్లు, ప్రాధాన్యతతో కలిపి ఈ ఆఫర్ ఉంటుంది. ఈ వాల్యూ యాడెడ్ సర్వీసెస్ ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, యాప్ లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీని వలన ప్రయాణీకులు సరసమైన ధరలకే ప్రయాణించేలా ప్లాన్ చేసుకోవచ్చు.

**ఈ కార్డులపై స్పెషల్ బ్యాంక్ ఆఫర్స్**

ఎకానమీ, ప్రీమియం ఎకానమీ, బిజినెస్, ఫస్ట్ వంటి అన్ని క్లాసులకు వర్తించే రౌండ్-ట్రిప్ బుకింగ్‌లపై రూ. 8,000 వరకు తక్షణ తగ్గింపు అందించడానికి ఎయిర్ ఇండియా %HSBC% బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆఫర్ ఎయిర్‌లైన్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా చేసే బుకింగ్‌లకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. అదే విధంగా టికెట్ల లభ్యత, ఫస్ట్ ఇన్ ఫస్ట్ సేల్ విధానంలో టికెట్లు కేటాయిస్తున్నారు. మారకం రేట్లు, ఇతరత్రా పన్నుల కారణంగా కొన్ని నగరాలకు టికెట్ల ధరలు కొద్దిగా మారవచ్చు. మరిన్ని వివరాలకు, బుకింగ్ కోసం www.airindia.com సందర్శించండి:


**ముఖ్యమైన విషయాలు**

దేశీయ ఛార్జీలు రూ.1,199 నుంచి ప్రారంభం
అంతర్జాతీయ రౌండ్ ట్రిప్పులు రూ. 11,969 నుంచి మొదలవుతాయి.
డైరెక్ట్ బుకింగ్‌లపై జీరో కన్వీనియన్స్ ఫీజు
సెప్టెంబర్ 30, 2025 వరకు ప్రయాణం చేయవచ్చు (ఎంపిక చేసిన మార్గాలకు డిసెంబర్ 10,2025 వరకూ)
ప్రోమో కోడ్‌లు, %HSBC% కార్డుల ద్వారా అదనపు తగ్గింపులు
అమ్మకం ముగింపు తేదీ - 25 మే 2025

**ఎలా బుక్ చేసుకోవాలి?**

ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, ఎయిర్ ఇండియా మొబైల్ యాప్, ఎయిర్‌పోర్టు టికెట్ కార్యాలయాలు , కస్టమర్ కాంటాక్ట్ సెంటర్, ఆథరైజ్డ్ ట్రావెల్ ఏజెంట్లు ద్వారా ప్రయాణీకులు టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

## బాబోయ్ మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు..ఎంతకు చేరాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలో బంగారం, వెండి ధరలు ఈరోజు కూడా భారీగా పెరిగాయి. ఈ క్రమంలో చెన్నై, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా, ఢిల్లీ వంటి ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు పుంజుకున్నాయి. అమెరికన్ డాలర్, యూఎస్ ట్రెజరీ దిగుబడులు రెండు వారాల కనిష్ట స్థాయికి పడిపోవడంతో బంగారాన్ని సురక్షిత ఆస్తిగా పరిగణించి ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేస్తున్నారు. కొన్ని వారాల క్రితం భారీగా తగ్గిన ధరలు ఇప్పుడు మళ్లీ పెరగడం పట్ల సామాన్య ప్రజలు కొనుగోలు చేయాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఈరోజు ధరలు ఇలా..**

ఈ క్రమంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం మే 23, 2025న ఉదయం 6.35 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ. 490 పెరిగి రూ. 97,920కి చేరుకుంది. ఇదే సమయంలో 22 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ.450 వృద్ధి చెంది రూ. 89,760కి చేరింది. ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 98,070కి చేరగా, 22 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 89,910కు చేరుకుంది.

**వెండి రేట్లు ఎలా ఉన్నాయంటే..**

వెండి ధరలు కూడా ఈ ధోరణిని కొనసాగించాయి. ఈ క్రమంలో కిలో వెండి ధర ఢిల్లీలో 100 రూపాయలు పెరిగి రూ. 1,01,000కి చేరుకుంది. మరోవైపు హైదరాబాద్, వరంగల్, విజయవాడ, తిరుపతిలో కిలో వెండి ధర రూ.1000 పెరిగి రూ.112,100కు చేరింది. ఇక చెన్నై, కేరళ ప్రాంతాల్లో కూడా సిల్వర్ రేట్లు రూ.112,100గా ఉన్నాయి. నాసిక్, నోయిడా, మైసూర్, సూరత్, నాగ్‌పూర్, పాట్నా, జైపూర్, ముంబై ప్రాంతాల్లో వెండి రేట్లు రూ. 1,01,000 స్థాయికి చేరుకున్నాయి.

**అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు**

ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర 0.7% పెరిగి ఔన్స్‌కు %$%3,336.43కు చేరుకుంది. ఇది మే 9 తర్వాత గరిష్ట స్థాయికి చేరుకుంది. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్ కూడా 0.7% పెరిగి %వి%3,337.60కి చేరుకున్నాయి. స్పాట్ సిల్వర్ ధర దాదాపు 1% పెరిగి ఔన్స్‌కు %వి%33.66కి చేరింది. ఈ క్రమంలో అంతర్జాతీయంగా బంగారం ధరలు నాలుగో రోజు బలపడ్డాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, అమెరికాలో ఆర్థిక లోటు ఆందోళనలు సహా ఇండియాలో పలు అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేశాయి. ఈ సంవత్సరం బంగారం ధర 26% పెరగడం విశేషం.

## ఐటీసీ లాభాలు అంతంతే


**న్యూఢిల్లీ-నవభూమి:** మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో ఐటీసీ లిమిటెడ్ లాభాలు నామమాత్రంగానే పెరిగాయి. ఈ కాలానికి కంపెనీ రూ.18,266 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.6,416.85 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 9.2 శాతం పెరిగినా నికర లాభంలో వృద్ధి మాత్రం రెండు శాతమే ఉంది. ఆదాయం భారీగా పెరగడానికి ఐటీసీ హెూటల్స్ విభజన (డీమెర్జర్) ద్వారా సమకూరిన రూ.15,179 కోట్ల రాబడి ప్రధానంగా దోహదం చేసింది. అనుబంధ కంపెనీలను మినహాయించి (స్టాండ్ అలోన్) చూసినా క్యూ4లో ఐటీసీ ఆర్థిక ఫలితాలు అంత ఆశాజనకంగా లేవు. ఈ కాలానికి కంపెనీ రూ.17,248 కోట్ల ఆదాయంపై రూ.4,874 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 9.6 శాతం పెరిగినా నికర లాభం మాత్రం 0.8 శాతం మాత్రమే పెరిగింది.

**ఆర్థిక సంవత్సరం మొత్తానికి**

2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా రూ.73,465 కోట్ల ఆదాయంపై ఐటీసీ రూ.20,092 కోట్ల నికర లాభం నమోదు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం 10.2 శాతం పెరిగినా, నికర లాభం మాత్రం నామమాత్రంగా రూ.182 కోట్లు మాత్రమే పెరిగింది. ఉత్పత్తి ఖర్చులు పెరిగి పోవడం, డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండడం ఇందుకు ప్రధాన కారణమని కంపెనీ తెలిపింది.

**ఒక్కో షేరుపై రూ.7.85 చొప్పున డివిడెండ్**


ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.7.85 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని ఐటీసీ బోర్డు సిఫారసు చేసింది. ఈ ఏడాది మార్చిలో ప్రకటించిన రూ.6.5 మధ్యంతర డివిడెండ్‌ను కూడా కలిపితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.14.35 చొప్పున డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. రూపాయి ముఖ విలువ ఉన్న కంపెనీ షేర్లపై ఇది 1,435 శాతానికి సమానం.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



## రేప్ కేసులో బెయిల్.. నిందితుల విజయోత్సవ ర్యాలీ..





సుమారు 16 నెలల క్రితం అంటే 2024 జనవరిలో జిల్లాలోని ఓ హోటల్ గదిలో ఉన్న ఓ జంటపై కొందరు దాడి చేశారు. మహిళను సమీపంలోని అడవిలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసుకు సంబంధించి అఫ్తాబ్ చందనకట్టి, మదార్ సాబ్ మండక్కి, సమీవుల్లా లాలనవర్, మహమ్మద్ సాదిక్ అగసిమని, షోయబ్ ముల్లా, తౌసిప్ చోటి, రియాజ్ సవికేరి అనే ఏడుగురు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. అయితే, ఈ ఏడుగురు నిందితులకు హావేరి సెషన్స్ కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు హావేరిలోని అక్కి ఆలూర్ పట్టణం లో 'కమ్ బ్యాక్' ర్యాలీ నిర్వహించారు. బైకులు, కార్లతో భారీ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కారు సన్‌రూఫ్ నుంచి నిందితులు బయటకు వచ్చి కేకలు వేస్తూ, విజయ సంకేతాలు తీస్తూ ర్యాలీ తీశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# అక్రమ కట్టడాలపై బుల్డోజర్లు



**అహ్మదాబాద్ –నవభూమి:** దేశంలోని చాలా రాష్ట్రాల్లో చెరువులు, సరస్సులు, ప్రభుత్వ భూములు కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను.. అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారు. అక్రమ కట్టడాలను సహించేది లేదని తేల్చి చెబుతున్నారు. ఇక తెలంగాణలో అయితే హైడ్రా పేరుతో ఒక విభాగాన్నే ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. చెరువులు, కుంటలు, నీటి వనరులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను నేలమట్టం చేస్తోంది. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే రకమైన కఠిన చర్యలు ఆయా ప్రభుత్వాలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో కూడా అధికారులు.. ఆక్రమణలపై కొరడా ఝుళిపిస్తున్నారు. అహ్మదాబాద్‌లోని చందోల సరస్సు వద్ద భారీగా నిర్మించిన అక్రమ కట్టడాల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా ఏకంగా 8500 నిర్మాణాలను కూల్చివేశారు. డానిలిమ్డాలోని చందోల సరస్సు వద్ద అక్రమ కట్టడాలను తొలగించే పనుల్లో భాగంగా అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రెండవ దశ ఆపరేషన్‌ను కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రారంభించారు. ఈ కూల్చివేత ఆపరేషన్‌లో భాగంగా 8500 అక్రమ నిర్మాణాలను తొలగించారు. చందోల సరస్సులోని 2.50 లక్షల చదరపు మీటర్ల ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. అయితే ఈ ఆపరేషన్‌ను అధికారులు పకడ్బందీగా చేపట్టారు. అహ్మదాబాద్ నగరంలోని 7 జోన్‌ల నుంచి కార్పొరేషన్‌కు చెందిన 350 మంది సిబ్బంది 50 టీమ్‌లుగా పాల్గొన్నాయి. చందోల సరస్సు ప్రాంతాన్ని మొత్తంగా 7 బ్లాక్‌లుగా విభజించి.. అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రారంభించారు. మొత్తంగా 35 బుల్డోజర్లు, 15 ఎర్త్‌మూవర్ యంత్రాలను తీసుకువచ్చి.. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. శిథిలాల తొలగింపు, సరస్సును మరింత లోతు చేయడం, సరిహద్దు గోడ నిర్మాణం, సరస్సు ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం వంటివి అధికారులు భవిష్యత్ ప్రణాళికలలో చేర్చారు. డానిలిమ్డాలో ఉన్న చందోల సరస్సు గుజరాత్ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆధీనంలో ఉంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా దీన్ని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేయడంపై చర్చలు జరిగినా.. ప్రస్తుత ఆక్రమణల కారణంగా దాన్ని స్వాధీనం చేసుకోవడానికి కార్పొరేషన్ అధికారులు. దీంతో చందోల సరస్సు ప్రస్తుతం ప్రభుత్వ నియంత్రణలోనే కొనసాగుతుంది. అక్రమ నిర్మాణాల కూల్చివేతల ఆపరేషన్ పూర్తి అయిన తర్వాత.. దాదాపు ఒక ఏడాది క్రితం అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆమోదించిన టెండర్ ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు ముందుకు సాగనున్నాయి. మొదటి దశలో పోలీసుల సహాయంతో అక్రమ ఆక్రమణలను తొలగించిన తర్వాత మిగిలిన రెండవ దశలో భూమిని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ క్లియర్ చేయనుంది. అయితే భారీ ఎత్తున కూల్చి వేతలు ప్రారంభించడంతో అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కూల్చివేత డ్రైవ్ సమయంలో అక్కడ శాంతి భద్రతలను కాపాడటానికి 3 వేల మందికి పైగా పోలీసులు, స్టేట్ రిజర్వ్ పోలీస్ సిబ్బందిని మోహరించినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మొదటి దశలో సంఘ విద్రోహ శక్తులు, అక్రమంగా స్థిరపడిన బంగ్లాదేశీయులను గుర్తించినట్లు వెల్లడించారు. కూల్చివేత మొదటి దశకు ముందు.. చందోల సరస్సులో అక్రమంగా నివసిస్తున్న 202 మంది బంగ్లాదేశీయులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండో దశలో మిగిలిన ఆక్రమణలను క్లియర్ చేయాలని అహ్మదాబాద్ కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుందని పోలీసులు తెలిపారు. అయితే ఈ చందోల సరస్సులోని అక్రమ నిర్మాణాలు.. గతంలో నిర్వహించిన డ్రోన్ సర్వేలో వెలుగులోకి వచ్చాయి. సరస్సుకు చెందిన భూభాగంలో దాదాపు 8 వేల ఇళ్లు అక్రమంగా నిర్మించబడ్డాయి. మొదటి దశ కూల్చివేత తర్వాత 2010 నుంచి లేదా అంతకుముందు నుంచి ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయ వసతి కల్పిస్తామని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించింది. మొదటి దశ కూల్చివేతలో భాగంగా ఏప్రిల్ 29 నుంచి మే 1వ తేదీ వరకు 3 రోజుల పాటు అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, అహ్మదాబాద్ నగర పోలీసులు చందోల సరస్సు వద్ద అక్రమ నిర్మాణాలను తొలగించడానికి ఒక ఆపరేషన్‌ను నిర్వహించారు. తొలి రోజు 1 లక్ష చదరపు మీటర్ల ప్రాంతాన్ని చదును చేశారు. ఇందులో ఫామ్‌హౌస్‌లు, గిడ్డంగులు, తాత్కాలిక నివాసాలు ఉన్నాయి. రెండో రోజు 50 వేల చదరపు మీటర్ల ప్రాంతంలోని అక్రమ నిర్మాణాలు తొలగించారు. చివరి రోజు ఘోడాసార్ సమీపంలో 25 దుకాణాలు, 1000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న పెద్ద గిడ్డంగి వంటి వాణిజ్య సంస్థలపైనా దృష్టి సారించారు.

## డ్రోన్ దాడి కారణంగా మాస్కో ఎయిర్‌పోర్ట్ మూసివేత



**న్యూఢిల్లీ –నవభూమి:** పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదంపై తాము జరుపుతున్న పోరు గురించి ప్రపంచ దేశాలకు వివరించేందుకు భారత్ మొత్తం ఏడు అఖిలపక్ష దౌత్య బృందాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ బృందాలు 33 దేశాల్లో పర్యటించనున్నాయి. పాకిస్థాన్ ప్రాయోజిక తీవ్రవాదం, ఆపరేషన్ సిందూర్ పై వివిధ దేశాలకు వివరించడానికి పార్లమెంటు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాలు ఇప్పటికే ఆయా దేశాలకు వెళ్లిన విషయం తెలిసిందే. అలా వెళ్లిన ఓ ప్రతినిధి బృందానికి తాజాగా భయానక అనుభవం ఎదురైంది. డీఎంకే ఎంపీ కనిమోళి కరుణానిధి నేతృత్వంలోని దౌత్య బృందం రష్యా వెళ్లిన విషయం తెలిసిందే. అయితే, వీరు ల్యాండ్ అయ్యే సమయానికి మాస్కో లో డ్రోన్ దాడి జరిగింది. దీంతో మాస్కో ఎయిర్‌పోర్ట్‌ను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. ఈ కారణంగా కనిమోళి నేతృత్వంలోని భారత దౌత్య బృందం విమానం గాల్లోనే చాలాసేపు చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. విమానం ల్యాండింగ్‌కు గంటల తరబడి ఆలస్యమైంది. ఈ ఘటనతో దౌత్య బృందం తీవ్ర భయాందోళనకు గురైంది. రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. రెండు దేశాలు డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో ఉక్రెయిన్ డ్రోన్ దాడి కారణంగా మాస్కోలో దేశీయ, అంతర్జాతీయ విమాన కార్యకలాపాలు కొన్ని గంటల పాటు నిలిపివేశారు. దీంతో భారత దౌత్య బృందం విమానం ల్యాండింగ్‌కు అధికారులు అనుమతి నిరాకరించారు. ఈ అంతరాయం కారణంగా విమానం చాలాసేపు గాల్లోనే చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. గంటల తరబడి అలా గాల్లోనే ఉన్న విమానం చివరికి సురక్షితంగా మాస్కో ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యింది. రష్యాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు విమానాశ్రయంలో అఖిలపక్ష ఎంపీల ప్రతినిధి బృందాన్ని స్వాగతించి.. వారిని సురక్షితంగా వారి హోటల్‌కు తీసుకెళ్లారు.

## ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న ఎదురుకాల్పులు.. మావోయిస్టు మృతి

**రాయ్‌పూర్–నవభూమి:** ఛత్తీస్‌గఢ్‌లోని వరుసగా ఎదురుకాల్పులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సుక్మా జిల్లాలోని కిష్టారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు భద్రతా బలగాలకు నిఘా వర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో కిష్టారం అటవీ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించాయి. ఈ విషయాన్ని గమనించిన మావోయిస్టులు.. భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు సైతం ఎదురు కాల్పులకు దిగాయి. దీంతో ఇరువైపులా ఎదురు కాల్పులు కొనసాగుతోన్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఈ ఎన్‌కౌంటర్‌ను జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ పర్యవేక్షిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. వీరిలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు పలువురు కీలక నేతలు సైతం ఉన్నారు. నంబాల కేశవరావుపై రూ. కోటిన్నర రివార్డు ఉన్న సంగతి తెలిసిందే.

## రన్యారావుతో నగదు లావాదేవీలు..

### హోంమంత్రిపై కాంగ్రెస్ నేతలే ఈడీకి ఫిర్యాదు చేశారు : కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ –నవభూమి:** బంగారం స్మగ్లింగ్ కేసు లో అరెస్టైన కన్నడ నటి రన్యారావు కేసు కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కేసులో కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర మెడకు ఉచ్చు బిగుస్తోంది. ఆయన చైర్మన్‌గా వ్యవహరిస్తున్న సంస్థకు రన్యారావుకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఆయనకు చెందిన విద్యా సంస్థపై సోదాలు కూడా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ తాజాగా స్పందించారు. ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. వర్గపోరుతో కాంగ్రెస్‌లోని కొందరు నేతలే పరమేశ్వరపై ఈడీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వారే ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్‌లోని ఓ వర్గం పరమేశ్వరపై ఈడీకి ఫిర్యాదు చేసింది. వారే ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారు. నేను ఒకటి స్పష్టంగా చెప్పదల్చుకున్నాను. పరమేశ్వర మంచి రాజకీయ నాయకుడు. ఆయన్ని మేము గౌరవిస్తాము. కానీ కాంగ్రెస్‌లో ఫిర్యాదులు పంపే వ్యక్తులు ఉన్నారు. ఈ విషయాలు సీఎం సిద్ధరామయ్యకు కూడా తెలుసు. నిఘా విభాగం ఆయన కిందే ఉంది. ఇప్పుడు ఆయన కూడా డ్రామా చేస్తున్నారు. ఈ విషయంపై ఆయన్ని అడగండి. పరమేశ్వరపై చర్య తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఎవరు లేఖలు రాస్తున్నారో..?' అని ప్రహ్లాద్ జోషీ వ్యాఖ్యానించారు. రన్యారావుకు హోం మంత్రి జీ పరమేశ్వరకు చెందిన విద్యా సంస్థకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగిన మాట వాస్తవమేనని రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గురువారం అంగీకరించారు. అయితే అది ఆయన వివాహ బహుమతిగా రన్యారావుకు అందజేసిన మొత్తమని వివరించారు. 'ఒక వివాహం జరిగింది ప్రజలకు బహుమతిగా మేము 10 వేలు, 5 లేదా 10 లక్షలు ఇస్తాం. ఆమె ఏం చేసినా అది తప్పే. ఆ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. నేను కేవలం పరమేశ్వర విషయమే మాట్లాడుతున్నా. ఆమెకు ఆయన అందజేసినది బహుమతి మాత్రమే' అని శివకుమార్ మీడియాకు తెలిపారు. పరమేశ్వర పలు దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆయనే కాదు కాంగ్రెస్ నేతలెవ్వరూ తప్పుడు పనులు చేయరని ఆయన సమర్థించారు. రన్యారావు స్మగ్లింగ్ కేసులో సంబంధాలు ఉండటమే కాక, ఆమెతో ఆర్థిక లావాదేవీలు జరిగాయని, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణతలో హోం మంత్రికి చెందిన విద్యా సంస్థలపై ఈడీ బుధవారం దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో రన్యారావుతో నగదు లావాదేవీలు జరిగినట్టు ఈడీ గుర్తించింది.

## కొడనాడు ఎస్టేట్ కేసులో సీబీసీఐడీ విచారణకు రమేష్

**చెన్నై–నవభూమి:** నీలగిరి జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత వేసవి విడిది కేంద్రమైన కొడనాడు ఎస్టేట్‌లో 2017లో జరిగిన వాచ్‌మన్ హత్య, మరోవాచ్‌మన్‌పై హత్యాయత్నం, దోపిడీ, కంట్రోల్‌రూమ్ ఇన్‌ఛార్జి ఆత్మహత్య తదితర సంఘటనలపై విచారణ జరుపుతున్న సీబీసీఐడీ.. ఈ కేసులతో సంబంధం ఉన్న ఆత్తూర్ రమేష్‌ను గురువారం విచారించారు.

## రీల్స్ కోసం గొడవ.. బాయ్‌ఫ్రెండ్స్ ముందే కొట్టుకున్నారు



**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రస్తుత తరం యువత రీల్స్ పిచ్చిలో పడి ఏం చేస్తున్నారో వారికే అర్థం కాని పరిస్థితి నెలకొంది. తాజాగా ఇద్దరు యువతులు రీల్స్ చేయడంలో తలెత్తిన గొడవ.. నడిరోడ్డుపై జుట్లు పట్టుకుని కొట్టుకునే వరకు వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆ ఇద్దరు బాయ్ ఫ్రెండ్స్ అక్కడే ఉండగా.. వారు ఆపేందుకు ఎంత ప్రయత్నించినా వారు మాత్రం వెనక్కి తగ్గకుండా సివంగుల్లా కొట్టుకున్నారు. చివరికి వారు ఆగకపోవడంతో బాయ్‌ఫ్రెండ్స్ వదిలేసి పక్కన నిలబడి సినిమా చూసినట్లు చూశారు. అయితే మొదట ఒక చోట ప్రారంభమైన గొడవ.. అక్కడి నుంచి రోడ్డు మీదికి వచ్చేసింది. రోడ్డుపైకి వచ్చిన తర్వాత కూడా వారి కొట్లాట కొనసాగడంతో అక్కడే ఉన్న స్థానికులు ఆ దృశ్యాలను వీడియో తీసి నెట్టింట పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యాయి. బరేలీలో ఇద్దరు యువతులు తమ బాయ్‌ఫ్రెండ్స్‌తో కలిసి బయట షాపింగ్ మాల్ దగ్గరకు వెళ్లారు. సరదాగా రీల్స్ చేద్దామని అనుకున్నారు. అయితే రీల్స్ కోసం లోకేషన్ ఎంపిక విషయంలో ఇద్దరు యువతుల మధ్య మాటమాట పెరిగింది. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు తీవ్ర ఆగ్రహానికి గురై.. బూతులు తిట్టుకునే వరకు వెళ్లింది. అక్కడితో ఆగకుండా ఒకరినొకరు జుట్లు పట్టుకుని బట్టలు చిరిగేంతలా పొట్టు పొట్టు కొట్టుకున్నారు.

అయితే ఇలా గొడవ పడుతున్న యువతులను ఆపేందుకు మొదట వారి బాయ్‌ఫ్రెండ్స్ శతవిధాలా ప్రయత్నించారు. అయినా ఆ పని వారి వల్ల కాకపోవడంతో ఇక మీ ఇష్టం అన్నట్టు వదిలేశారు. ఇక ఆ యువతుల కొట్లాట అక్కడితో ఆగకుండా.. వెళ్తూ వెళ్తూ రోడ్డుపైన కూడా కొనసాగింది. వారి బాయ్‌ఫ్రెండ్స్ కూడా జోక్యం చేసుకునే ధైర్యం చేయకపోవడంతో.. అక్కడ చుట్టూ ఉన్న జనం కూడా వారిని ఆపడానికి బదులు అదేదో సినిమా షూటింగ్ అన్నట్లుగా చూశారు. మరికొందరు తమ ఫోన్లలో ఆ వీడియోలను రికార్డ్ చేశారు. అయితే ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో చివరికి పోలీసుల వద్దకు చేరింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. రీల్స్ కోసం మొదలైన ఈ గొడవ చివరికి రచ్చరచ్చగా మారి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆడవాళ్లు ఇలా కూడా ఉంటారా అంటూ నెటిజన్లు సైతం తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ వారు చేసిన పనికి మండిపడుతున్నారు. అయితే, ఈ గొడవలో బాయ్‌ఫ్రెండ్స్ మాత్రం కనీసం ఒక మాట కూడా అనుకోకుండా, కొట్టుకోకుండా ప్రశాంతంగా ఉండటం గమనార్హం.

## తల్లి మరణం.. పదవీ విరమణ రోజు.. అయినా 11 తీర్పులిచ్చిన సుప్రీం జడ్జి ఓకా



**న్యూఢిల్లీ–నవభూమి:** దటీజ్..జస్టిస్ ఓకా. అవును సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎఎస్ ఓకా చరిత్రనే మార్చారు. తన పదవీ విరమణరోజు సాంప్రదాయాల్ని పక్కనపెట్టి పనే పరమావధి అని చేసి చూపించారు. ఎంతో ప్రేమ ఉన్న తన తల్లిని కోల్పోయి ఒక్క రోజు కూడా గడవగముందే కోర్టుకు హాజరయ్యారు. అంతేకాదు, ఏకంగా చివరి రోజున 11 తీర్పులు ఇచ్చారు. "పదవీ విరమణ" అనే పదాన్ని తాను ద్వేషిస్తానని, చివరి రోజున పని చేయకపోవడం అనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని ఓకా చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకా శనివారం (మే 24న) పదవీ విరమణ చేయబోతున్నారని బార్ అండ్ బెంచ్ ప్రకటించింది. దీనికి ముందు రోజు ముందు ఓకా తన తల్లి చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరు కావడానికి ముంబైకి బయలుదేరి వెళ్లారు. ఒక్క రోజులోనే ఢిల్లీకి తిరిగివచ్చి కోర్టుకు హాజరయ్యారు. పదవీ విరమణ రోజున పని చేయకూడదనే సంప్రదాయాన్ని పక్కనపెట్టి జస్టిస్ ఓకా తన సాధారణ బెంచ్‌లో భాగంగా 11 తీర్పులు వెలువరించారు. తర్వాత చీఫ్ జస్టిస్ బిఆర్ గవైతో కలిసి ఉత్సవ బెంచ్‌కి వెళ్లారు.

కాగా, ఈ వారం ప్రారంభంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన ఓకాకు సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ అభినందన సభ ఏర్పాటు చేసింది. ఆ సభలో జస్టిస్ ఓకా మాట్లాడుతూ చివరి రోజున పని చేయకూడదనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని సభా ముఖంగా ప్రకటించారు. "పదవీ విరమణ చేసే న్యాయమూర్తి చివరి రోజున పని చేయకూడదనే సుప్రీంకోర్టులో అనుసరించే ఒక సంప్రదాయాన్ని నేను ఆమోదించను. ఆ సంప్రదాయాన్ని వదిలించుకోవడానికి మనకు కొంత సమయం పడుతుంది, కానీ కనీసం చివరి రోజున నేను రెగ్యులర్ బెంచ్‌లో కూర్చుని కొన్ని తీర్పులు ప్రకటించడంలో నాకు సంతృప్తి ఉంది" అని ఆయన చెప్పారు. "పదవీ విరమణ" అనే పదాన్ని తాను ద్వేషిస్తున్నానని, జనవరి 2025 నుండి వీలైనన్ని ఎక్కువ కేసులు వినాలని నిర్ణయించుకున్నానని, అలాగే పనిచేశానని ఆయన అన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టిన అగ్నివీరులు



**శ్రీనగర్––నవభూమి:** భారత త్రివిధ దళాల్లో సిబ్బంది నియామకానికి సంబంధించి.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం.. దేశవ్యాప్తంగా ఎంతటి దుమారాన్ని రేకెత్తించిందో తెలిసిందే. అయితే ఈ అగ్నిపథ్ పథకం కింద నియామకం అయిన అగ్నివీరులు.. కేవలం 4 ఏళ్ల కాలానికి మాత్రమే సైన్యంలో పనిచేస్తారు. ఆ తర్వాత అందులో కేవలం 25 శాతం మందిని మాత్రమే త్రివిధ దళాల్లోకి తీసుకోనుండగా.. మిగిలిన వారు ఇంటికెళ్లాల్సిందే. ఇక ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో భారత త్రివిధ దళాలు అలర్ట్‌గా ఉండి.. పాక్ చేసిన దాడులతో ఎలాంటి నష్టం కలగకుండా చేశాయి. పాకిస్తాన్ క్షిపణి, డ్రోన్ దాడుల నుంచి.. భారత ఎయిర్‌బేస్‌లను రక్షించడంలో దాదాపు 3 వేల మంది అగ్నివీరులు కీలక పాత్ర పోషించారు. వీరిలో చాలా మందికి 20 సంవత్సరాల లోపే ఉండగా.. గత 2 సంవత్సరాల్లో అగ్నిపథ్ పథకం కింద నియామకం అయ్యారని రక్షణ వర్గాలు తెలిపాయి. కీలకమైన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లను ఆపరేట్ చేయడం దగ్గరి నుంచి.. పదే పదే పాకిస్తాన్ చేస్తున్న దాడులను ఎదుర్కొంటూ అనేక స్థావరాలు, నగరాలు, వైమానిక స్థావరాలను రక్షించుకోవడం వరకు అగ్నివీరులు.. సాధారణ సైనికులకు దీటుగా అసమాన ప్రతిభ కనబరచారని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. అగ్నివీరుల సహకారాన్ని నిర్ణయాత్మకంగా, ప్రశంసనీయంగా ఉన్నతాధికారులు అభివర్ణించాయి. ప్రతి ఎయిర్ డిఫెన్స్ యూనిట్‌లో 150 నుంచి 200 మంది అగ్నివీరులు ఉన్నారని.. వారిని ప్రధానంగా పశ్చిమ సరిహద్దులో మోహరించినట్లు వెల్లడించాయి. గన్నర్లు, ఫైర్ కంట్రోల్ ఆపరేటర్లు, రేడియో ఆపరేటర్లు మరియు గన్లు, క్షిపణులతో అమర్చబడిన భారీ వాహనాల డ్రైవర్లు వంటి.. 4 ప్రత్యేకమైన ట్రేడ్‌లలో అగ్నివీరులు సేవలందించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఎయిర్ డిఫెన్స్ కంట్రోల్ అండ్ రిపోర్టింగ్ సిస్టమ్ అయిన ఆకాశ్‌తీర్‌ను ఆపరేట్ చేయడంలో కూడా అగ్నివీర్‌లు సహాయం చేశారు. ఈ ఆకాశ్‌తీర్.. భారతదేశ వైమానిక రక్షణ ప్రతిస్పందనకు కేంద్ర బిందువుగా మారింది. షోల్డర్ లాంచ్‌డ్ క్షిపణులను ప్రయోగించడంలో.. ఎల్–70, Zu–23–2B వంటి అప్‌గ్రేడ్ చేసిన యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌లను ఆపరేట్ చేయడంలో.. పెచోరా, షిల్కా, OSA-AK, స్ట్రెలా, తుంగుస్కా వంటి సిస్టమ్‌లను నిర్వహించడంలో అగ్నివీరులు ప్రముఖ పాత్ర వహించారు. ఆకాష్‌తో పాటు ఇతర భూమి నుంచి ఆకాశంలోకి ప్రయోగించే క్షిపణులను మోహరించడంలో, ప్రయోగించడంలో చాలా యాక్టివ్‌గా పాల్గొన్నారు.

## పొత్తులపై మహానాడులో ప్రకటిస్తా..



**చెన్నై––నవభూమి:** వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుపై కడలూరు మహానాడులో ప్రకటించనున్నట్లు డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. నామక్కల్‌లో గురువారం జరిగిన డీఎండీకే నిర్వాహకుల సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన విధి, విధానాలను ప్రేమలత వివరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ కడలూరులో నిర్వహించనున్న పార్టీ మహానాడులో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు, పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థుల వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు 234 నియోజకవర్గాల్లో ఎన్నికల ఇన్‌ఛార్జుల ఎంపిక మొదలుపెడతామన్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విజయ్ ప్రభాకర్‌తో కలిసి తాను పర్యటించి, పార్టీ నిర్వాహకులను, ప్రజలను కలుసుకోనున్నట్టు ప్రేమలత తెలిపారు. 2021 నుంచి కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిర్వహించిన 'నీతి ఆయోగ్' సమావేశంలో తమిళనాడు తరుపున డీఎంకే మంత్రులు మాత్రమే పాల్గొన్నారని, కొన్ని సమావేశాల్లో వారిని అనుమతించలేదని, అయితే ఈ నెల 24న జరగనున్న సమావేశంలో తాను పాల్గొనబోతున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించడం పలు అనుమానాలకు దారితీస్తోందని, ఆయ న ఎందుకోసం వెళ్తున్నారో రాష్ట్రప్రజలకు స్పష్టంగా చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

## టర్కీకి భారత్ స్ట్రాంగ్ మెసేజ్

**శ్రీనగర్––నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం జరిగిన పరిణా మాలతో పాకిస్థాన్‌కు అన్ని రకాలుగా మద్దతు ఇస్తోన్న టర్కీకి భారత్ స్ట్రాంగ్ మెసేజ్ పంపింది. టర్కీపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన భారత్.. దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోన్న పాకిస్తాన్‌పై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు తూర్పు ఆసియా మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ: 'పాకిస్థాన్ ప్రోత్సహిస్తోన్న సరిహద్దు ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు టర్కీ.. ఇస్లామాబాద్‌పై ఒత్తిడి తెస్తుందని మేము ఆశిస్తున్నాం. దశాబ్దాలుగా పాక్ పెంచిపోషిస్తున్న ఉగ్ర మౌలిక సదుపాయాలపై నమ్మదగిన, ధ్రువీకరించగల చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాం. దేశాల మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, ఒకరిపై ఒకరు ఉన్న అవగాహన.. ఆందోళనలను అర్థం చేసుకోవడంపై ఆధారపడతాయి' అని పేర్కొన్నారు. ఇప్పటికే దేశంలో బాయ్‌కాట్ టర్కీ నినాదం ఊపందుకుంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌కు టర్కీ మద్దతుగా నిలవడంతో భారత్– అంకారా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్‌కు టర్కీ కేవలం సైద్ధాంతిక, మానవతా మద్దతుతోనే సరిపెట్టకుండా ఆయుధాలు, డ్రోన్లను కూడా సరఫరా చేసింది. పాకిస్థాన్ దాడుల్లో ఉపయోగించిన 300–400 డ్రోన్లలో ఎక్కువ శాతం టర్కీ నుంచే వచ్చాయని భారత్ తెలిపింది. ఈ డ్రోన్లు సైనిక స్థావరాలు, పౌర నివాసాలే లక్ష్యంగా దాడులు జరిపాయి. లడఖ్‌లోని లేహ్ నుంచి గుజరాత్‌లోని సిర్‌క్రీక్ వంటి పశ్చిమ సరిహద్దులో మొత్తం 36 ప్రాంతాల్లో పాక్ దాడులకు ప్రయత్నించింది. ఇక, పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని ఉగ్రశిబిరాలపై భారత్ దాడుల తర్వాత కూడా టర్కీ పాక్ పక్షాన నిలిచింది. అదే సమయంలో పహల్గామ్ దాడిలో పాక్ ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు చెందిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ఉగ్రవాదులు ఉన్నప్పటికీ టర్కీ ఈ దాడిని ఖండించలేదు. జమ్ము కశ్మీర్‌పై పాకిస్థాన్ ఆక్రమణకు టర్కీ మద్దతు ఇచ్చిన చరిత్ర ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో తన యుద్ధ నౌకను కరాచీ పోర్టుకు పంపిన టర్కీ.. దీనిని సాధారణ పర్యటనగా పేర్కొన్నా, ఇది వ్యూహాత్మక సంకేతంగా పరిగణించాల్సిందే. ఆయుధాల తోపాటు యుద్ధ విమానాలను టర్కీ పంపినట్టు నివేదికలున్నాయి. అయితే టర్కీ వాటిని ఖండించింది. విమానాలు కేవలం ఇంధనం నింపుకోవడానికే వచ్చాయని తెలిపింది. కాగా, కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను.. టర్కీ ప్రెసిడెంట్ ఎర్డోగాన్ అభినందించారు. అంతేకాక నిజమైన స్నేహానికి నిదర్శనం పాకిస్థాన్ అంటూ వ్యాఖ్యానించారు. ఉగ్రవాద శిభిరాలపై భారత్ సైన్యం దాడి తర్వాత, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్.. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు సానుభూతి సందేశం పంపించారు. 'ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన మా సోదరుల కోసం అల్లాహ్ దయ చూపాలని ప్రార్థిస్తున్నాను. పాకిస్థాన్ ప్రజలకు, ప్రభుత్వానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను'' అని ఆ సందేశంలో పేర్కొన్నారు.

## పట్టపగలు బహిరంగంగా తిరుగుతున్న ఉగ్రవాదులు

**న్యూఢిల్లీ–నవభూమి:** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ తమకేమీ తెలియదన్నట్లు నటిస్తున్న పాకిస్థాన్‌పై భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మండిపడ్డారు. తమ నేలపై ఉగ్రవాదం లేదంటూ పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనను ఆయన ఖండించారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంలో పాకిస్థాన్ ప్రభుత్వంతోపాటు ఆ దేశ సైన్యం కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యూరప్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో భాగంగా నెదర్లాండ్స్‌లో మంత్రి జై శంకర్ పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన జాబితాలోని ఉగ్రవాదులంతా పాకిస్థాన్‌లోనే ఉన్నారన్నారు. వారంతా పెద్దపెద్ద నగరాల్లో నివసిస్తున్నారని చెప్పుకొచ్చారు. అక్కడి నుంచే వారు ఈ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | శనివారం | 24 । మే । 2025



# సంధ్య థియేటర్ ఘటన: సీపీ సీవీ ఆనంద్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సి మరోసారి నోటీసులు

డిసెంబర్ 4, 2024న హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి జాతీయ మానవ హక్కుల కమిషన్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై ఆరు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సిఆదేశించింది.గత ఏడాది డిసెంబర్ 4న ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షోను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఇదే సమయంలో సినిమా హీరో అల్లు అర్జున్ థియేటర్ వద్దకు రావడంతో అభిమానులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీనితో అక్కడ తొక్కిసలాట జరిగి, పరిస్థితి అదుపుతప్పింది. ఈ తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్ళాడు. సుమారు 4 నెలల 25 రోజుల పాటు చికిత్స పొందిన శ్రీతేజ్ ఇటీవల డిశ్చార్జ్ అయ్యాడు, అయినప్పటికీ అతని ఆరోగ్యం పూర్తిగా కుదుటపడలేదు. ఎన్‌హెచ్‌ఆర్‌సి చర్యలు:ఈ ఘటనపై అడ్వకేట్ రామారావు ఇమ్మనేని ఫిర్యాదు చేశారు. చిక్కడపల్లి పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, తగిన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ తొక్కిసలాట జరిగిందని, ఇది రేవతి మరణానికి, ఆమె కుమారుడి గాయాలకు దారితీసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో పోలీసులు సమర్పించిన నివేదికలో సరైన వివరాలు లేవని ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు పోలీసులు లాఠీఛార్జికి ఎందుకు దిగాల్సి వచ్చిందో, థియేటర్‌కు సమీపంలో డీజేలు, ఇంత హంగామా జరుగుతున్నా పోలీసులు ఏం చేశారో వివరణ ఇవ్వాలని కమిషన్ కోరింది.

నవచిత్ర



# అనుష్క అలా డిసైడ్ అయితే వాళ్లకి పండగే..



స్వీటీ అనుష్క సినిమాలకు గ్యాప్ ఇవ్వడం వల్ల ఆమె ఫ్యాన్స్ అంతా కూడా ఆమెను ఎంతో మిస్ అయ్యారు. నిశ్శబ్దం తర్వాత కెరీర్ లో కూడా సైలెన్స్ మెయింటైన్ చేస్తూ వచ్చిన అనుష్క 3 ఏళ్ల గ్యాప్ తర్వాత నవీన్ పొలిశెట్టితో మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా చేసింది. ఆ సినిమాలో అనుష్కని చూసి తెలుగు ఆడియన్స్ ఖుషి అయ్యారు. ఇక ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ కాబట్టి స్వీటీ ఫ్యాన్స్ అయితే ఆమెను చూసేందుకే రిపీటెడ్ గా సినిమాకు వెళ్లారు. ఐతే ఆ సినిమా తర్వాత మళ్లీ కథల ఎంపికలో లేట్ చేసింది అనుష్క. ఫైనల్ గా క్రిష్ డైరెక్షన్ లో ఘాటితో రాబోతుంది. ఈ సినిమా ఈపాటికి రిలీజ్ అవ్వాల్సింది కానీ ఇంకా షూటింగ్ పూర్తి కాలేదని వాయిదా వేశారు. అనుష్క ఘాటి రిలీజ్ ఎప్పుడు అన్నది క్లారిటీ రాలేదు. క్రిష్ కూడా ఘాటి విషయం లో సైలెంట్ గా ఉంటున్నాడు. ఇదిలా ఉంటే తనపై ఫ్యాన్స్ చూపిస్తున్న ఈ ప్రేమని దృష్టిలో ఉంచుకుని అనుష్క ఒక క్రేజీ డెసిషన్ తీసుకుందని తెలుస్తుంది. ఇక మీదట కెరీర్ లో గ్యాప్ తీసుకోకూడదని అనుష్క నిర్ణయం తీసుకుందని తెలుస్తుంది. అంతేకాదు ఒకప్పటిలా కమర్షియల్ సినిమాల్లో కూడా ఆమె నటించాలని అనుకుంటుందట. అనుష్క కమర్షియల్ సినిమాలు చేయాలని అనుకుంటే మాత్రం ఆమెకు వరుస ఛాన్స్ లు వస్తాయని చెప్పొచ్చు. కమర్షియల్ సినిమాలు చేస్తూనే అనుష్క ఫిమేల్ సెంట్రిక్ సినిమాలతో స్టార్ ఇమేజ్ సంపాదించింది. అనుష్క తిరిగి మళ్లీ కమర్షియల్ సినిమాలు చేస్తే మాత్రం మిగతా హీరోయిన్స్ కి గట్టి షాకే తగిలే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. అనుష్క ఘాటి రిలీజ్ తర్వాత పెద్దగా గ్యాప్ తీసుకోకుండానే మరో సినిమా చేయాలని అనుకుంటుందట. ప్రభాస్ తో మరోసారి అనుష్క జత కడితే చూడాలని ఫ్యాన్స్ అంతా ఎదురుచూస్తున్నారు. ఐతే ఆ కాంబినేషన్ కుదరలాంటే అలాంటి ఒక కథ సెట్ అవ్వాలి. ప్రభాస్ మాత్రమే కాదు అనుష్క తను చేసిన మిగతా స్టార్స్ అందరితో కలిసి చేస్తే మాత్రం ఆమె ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే అని చెప్పొచ్చు. మరి కెరీర్ పట్ల అనుష్క నిజంగానే సీరియస్ గా ఆలోచిస్తుందా లేదా మళ్లీ గ్యాప్ తీసుకునే ఆలోచనలో ఉందా అన్నది తెలియాల్సి ఉంది. ఘాటి రిలీజ్ ప్రమోషన్స్ టైంలో అనుష్కని ఫ్యాన్స్ కూడా వరుస సినిమాలు చేయాలని రిక్వెస్ట్ చేయాలని ఫిక్స్ అయ్యారు.

# ఓటీటీకి వచ్చేసిన..లేటెస్ట్ ఫ్యామిలీ, కామెడీ థ్రిల్లర్



గత నెలలో థియేటర్లలోకి వచ్చి మిశ్రమ స్పందన తెచ్చుకున్న వినోదాత్మక చిత్రం సారంగపాణి జాతకం . ప్రియదర్శి రూపా కొడవాయూర్ జంటగా నటించిన ఈ చిత్రం ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే సడన్‌గా డిజిటల్ స్ట్రీమింగ్ కు వచ్చి అందరినీ ఆశ్చర్య పరిచింది. డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ, శ్రీదేవి మూవీస్ శివలెంక కృష్ణ ప్రసాద్ కాంబినేషన్‌లో 'జెంటిల్ మన్, సమ్మోహనం' వంటి సక్సెస్ ఫుల్ చిత్రాల తర్వాత ముచ్చటగా మూడవ చిత్రంగా ఈ మూవీ వచ్చింది. శ్రీనివాస్ అవసరాల , సీనియర్ నరేశ్, వెన్నెల కిశోర్, తనికెళ్ల భరణి, హర్ష చెముడు ప్రధాన పాత్రలు పోషించారు.ఇక కథ విషయానికి వస్తే.. చిన్నప్పటి నుంచి అతనికి జాతకాలంటే పిచ్చి ఉన్న సారంగపాణి (ప్రియదర్శి) తను సెల్స్ మెన్‌గా పనిచేసే కార్ షోరూమ్ మేనేజర్ మైథిలి (రూపా కొడవాయూర్) తో ప్రేమించుకుంటారు. పెద్దలను ఒప్పించి, ఇద్దరూ పెళ్ళి చేసుకుందాం అనుకుంటారు. ఆ సమయంలో సారంగ చేయి చూసిన జిగేశ్వర్ (అవసరాల శ్రీనివాస్) అతని జాతకంలో ఓ చిక్కుముడి ఉందని చెబుతాడు. దాంతో షాక్ కు గురైన సారంగ.. ఈ సమస్య నుంచి తప్పించుకునే వరకు మైథిలీతో తన పెళ్ళిని వాయిదా వేస్తాడు. జిగేశ్వర్ చెప్పిన చిక్కుముడి ఏమిటీ? దాన్ని విప్పడానికి సారంగ ఏం చేశాడు? ఈ మొత్తం వ్యవహారంలో సారంగను ఎవరెవరు ఎలా అపార్థం చేసుకున్నారు? తిరిగి సారంగ, మైథిలి ఎలా ఒక్కటి అయ్యారు? అనేది మిగతా కథ.ముక్కూ ముఖం తెలియని వ్యక్తి చెయ్యి చూసి చెప్పిన జాతకాన్ని నమ్మి.. సారంగపాణి ఎలా కష్టాలను కొన్ని తెచ్చుకున్నాడు? అనే కథాంశంతో ప్రారంభం నుంచి ముగింపు వరకూ నాన్ స్టాప్ వినోదంతో సాగుతుంది.

# ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. తండ్రైన కిరణ్ అబ్బవరం



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తండ్రిగా ప్రమోషన్ పొందారు. ఆయన భార్య రహస్య గురువారం పండంటి మగబిడ్డకు జన్మని చ్చింది. ఈ విషయాన్ని వారు గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించి కిరణ్.. హనుమాన్ జయంతి రోజే తండ్రి అయ్యానని.. జై శ్రీరామ్ అంటూ కొడుకు పాదాలను ముద్దాడుతున్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఇప్పుడు ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతుండగా కిరణ్ అభిమానులతో పాటు అందరి హీరోల అభిమానులు, నెటిజన్లు, టాలీవుడ్ సెలబ్రిటీస్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.ఇదిలాఉండగా ఐదేండ్ల క్రితం వచ్చిన రాజా వారు రాణి వారు చిత్రంతో హీరో హీరోయిన్లుగా నటించిన కిరణ్ అబ్బవరం రహస్య గోరక్ లు ఆ సినిమా తర్వాత ప్రేమికులుగా మారారు. గత సంవత్సరం పెళ్లి చేసుకున్న వీరు ఇప్పుడు ఓ బిడ్డకు జన్మనిచ్చి తల్లిదండ్రులుగా ప్రమోషన్ పొందారు.

# తమన్నా గురించి ఇంటి పక్కన వారి కామెంట్స్..!



మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతుంది. ఇప్పటికీ ఆమె క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఆఫర్లు కాస్త తగ్గినా ప్రేక్షకుల్లో ఆమెకు ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదు. సోషల్ మీడియాలో ఆమె ఫాలోయింగ్ చూస్తే మతి పోతుంది. పదుల కొద్ది ఫ్యాన్ పేజీలు ఉంటాయి, ఆమె అఫిషియల్ సోషల్ మీడియా పేజీలకు విపరీతమైన ఆధరణ ఉంటుంది. మిల్కీ బ్యూటీ మరో పదేళ్ల పాటు ఇండస్ట్రీలో హీరోయిన్‌గా కాకున్నా ఏదో ఒక రకంగా సినిమాల్లో కనిపిస్తూ ఉండే అవకాశాలు ఉన్నాయి. తమన్నా ఐటెం సాంగ్ చేసింది అంటే ఆ సినిమాకు మంచి హైప్ వస్తుంది, అంతే కాకుండా తమన్నా వెబ్ సిరీస్ చేస్తే ఆ వెబ్ సిరీస్‌కి మంచి బజ్ క్రియేట్ అవుతుంది. తమన్నా ఈ మధ్య కాలంలో బాలీవుడ్ సినిమాలు, వెబ్ సిరీస్‌లపై ఎక్కువ దృష్టి పెడుతుంది. సాధారణంగా సౌత్ ఇండస్ట్రీ నుంచి వెళ్లిన వారికి హిందీ సినిమా ఇండస్ట్రీలో పెద్దగా ఆఫర్లు రావు అనే టాక్ ఉంది. కానీ తమన్నాకు అక్కడ మంచి ఆఫర్లు వస్తున్నాయి. ఈ మధ్య కాలంలో తెలుగు సినిమాల్లో కంటే ఇతర భాషల్లో ఎక్కువగా నటిస్తూ ఉంది. మిల్కీ బ్యూటీ తమన్నా చేస్తున్న హంగామా గురించి ఎంత చెప్పినా తక్కువే. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలు, వీడియోలు ఈమె వయసు పెరుగుతుందా..? తగ్గుతుందా? అనే అనుమానం కలుగుతుంది. మూడు పదుల వయసులోనూ ఈమె పాతికేళ్ల పడుచు అందగత్తెగా కనిపిస్తుంది అంటూ అభిమానులు తెగ కామెంట్ చేస్తూ ఉంటారు. రెగ్యులర్‌గా అభిమానులతో టచ్‌లో ఉండే మిల్కీ బ్యూటీ తమన్నా తాజాగా ఒక చిట్ చాట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఒడి దొడుకుల గురించి చెప్పుకొచ్చింది. సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టడం కోసం నా తల్లిదండ్రులను ఒప్పించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. నేను సినిమాల్లో నటిస్తాను అంటూ తెలిసిన వెంటనే పక్కింటి వారు కామెంట్ చేయడం మొదలు పెట్టారు. మా ఇంటి చుట్టు పక్కల వారు అమ్మా నాన్నతో అవమానకరంగా మాట్లాడారు. ఇండస్ట్రీలో ఉండే దారుణ పరిస్థితి గురించి కుప్పలు తెప్పలుగా అమ్మానాన్న కి వారు చెప్పి భయపెట్టారు. వారి మాటలు విని నన్ను ఇండస్ట్రీలో అమ్మానాన్న అడుగు పెట్టనివ్వకుంటే నేను హీరోయిన్‌గా కనీసం పరిచయం అయ్యేదాన్ని కాదు అంది. సినిమా ఇండస్ట్రీ అనగానే కొందరు తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ, విమర్శలు చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడటం మనం చూస్తూ ఉంటాం. ఇప్పటికీ సోషల్ మీడియాలో కొందరు అంకుల్స్ హీరోయిన్స్ ఎలా ఉండాలి, వారు ఎలాంటి డ్రెస్‌లు వేసుకోవాలి అంటూ చెబుతూ పోస్ట్‌లు పెట్టడం చూస్తూ ఉంటాం. బాధ్యతగల మీడియా అలాంటి వారిని ఎంకరేజ్ చేయకుండా, వారికి తగిన సమాధానం చెప్పి అమ్మాయిల సమన్యాయం ను కాపాడాల్సిన అవసరం ఉందని తమన్నా అభిప్రాయం వ్యక్తం చేసింది. సినిమా ఇండస్ట్రీ అంటే ఒకప్పుడు మాత్రమే కాదు, ఇప్పటికీ ఒకింత భయం ఉంటుంది. అమ్మాయిలను ఇండస్ట్రీలోకి పంపించడం అవసరమా అని చాలా మంది భావిస్తూ ఉంటారు.

# అల్లు అర్జున్, అట్లీ సినిమా.. ఐదుగురు కథానాయికలు!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ , పాన్ ఇండి యా డైరెక్టర్ అట్లీ కాంబోలో ఓ సెన్సేషనల్ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ కాంబో కోసం భారతదేశ సినీ ప్రేమికులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అల్లు అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాతో తెలుగింటి అల్లుడు అట్లీ ఫస్ట్ టైమ్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండగా సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురించి విడుదల చేసిన ఎనౌన్స్‌మెంట్ వీడియో ఇప్పటికీ సౌత్ ఇండస్ట్రీని షేక్ చేస్తోంది. లాస్ ఏంజెల్స్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేకంగా హీరో అల్లు



అర్జున్, హాలీవుడ్ టెక్నిషియన్స్, డైరెక్టర్ అట్లీపై చిత్రీకరించిన ఈ ప్రత్యేక వీడియో అందరిని సంభ్రమశ్చర్యాల్లో ముంచింది.సినిమా టికెట్లుతెలుగు సినిమా టికెట్లుదిలా ఉంటే.. కొన్ని రోజులుగా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు ఫుల్ స్వింగ్‌లో సాగుతున్నాయి. ఇందుకోసం ఇటీవల హైదరాబాద్ వచ్చిన అట్లీ అర్జున్ ను కలిసి ఈ చిత్రంకి సంబంధించిన చర్చల్లో పాల్గొన్నారు. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్ట్ %ూ22 ఇ ూ%6 గా పిలవబడుతున్న ఈ చిత్రం, భారతీయ విలువలతో కూడిన కథనంతో ఓ భారీ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమాలో కథానాయుకల విషయంలో ఓ ఆసక్తికర వార్త నెట్టింట విపరీతంగా చక్కర్లు కొడుతుంది.సినిమా టికెట్లుఈ సినిమాలో ఐదుగురు కథానాయికలకు ప్రాధాన్యం ఉందని, ఇప్పటికే వారితో చర్చలు ముగిసి వారిని సెలక్ట్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వారిలో ఇప్పటికే దీపికా పదుకుణే మృణాల్ ఠాగూర్ జాన్వీ కపూర్ లు సెలక్ట్ అయ్యారని, ఇంకా లేటెస్ట్ టాలీవుడ్ సెన్సేషన్ భాగ్య (శ్రీ భోర్సే )తో చర్చలు జరుగుతున్నాయని, ఇక మరొక నాయిక కోసం సెర్చింగ్ జరుగుతుందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి.తెలుగు సినిమా టికెట్లుఇదంతా చూస్తున్న నెటిజన్లు అట్లీ అసలు ఏం కుక్ చేస్తున్నావయ్యా ఊహలకు అందడం లేదు.. మైండ్ దొబ్బుతుందంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్లు చేస్తున్నారు. మరికొంతమది ఎంతమందినైనా పెట్టుకోండి గానీ రెగ్యులర్‌గా అప్డేట్స్ మాత్రం ఇవ్వండి చాలు అంటున్నారు.అయితే ఇంతవరకు ఈ వార్తలపై సదరు నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేకున్నాసోషల్ మీడియాలో మాత్రం బాగా వైరల్ అవుతుండడం గమనార్హం. మేకర్స్ స్వయంగా ప్రకటిస్తే తప్పా ఈ వార్తలపై క్లారిటీ వచ్చే అవకాశం లేదు.

# మార్ష్ శతక మోత



**అహ్మదాబాద్-నవభూమి:** వరుసగా నాలుగు ఓటములతో ప్లేఆఫ్సుకు దూరమైన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఎట్టకేలకు అదరగొట్టింది. పట్టికలో అగ్రస్థానాన కొనసాగుతున్న గుజరాత్ టైటాన్స్‌ను వారి సొంతగడ్డపైనే దీటుగా ఎదుర్కొంది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (64 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 117) తొలి శతకం సాధించగా.. పూరన్ (27 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఆ తర్వాత బౌలర్లు కూడా కట్టడి చేయడంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంత్ సేన 33 పరుగుల తేడాతో టైటాన్స్‌ను మట్టికరిపించింది. అటు గుజరాత్‌కిది కేవలం నాలుగో ఓటమి కాగా.. లఖ్‌నవూ ఆరు విజయాలు, 12 పాయింట్లతో కాస్త మెరుగైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 2 వికెట్లకు 235 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (36) సహకరించాడు. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 202 పరుగులు చేసింది. షారుక్ (57), రూథర్‌ఫోర్డ్ (38), గిల్ (35), బట్లర్ (33) రాణించారు. ఓరౌర్కీకి 3, అవేశ్.. బదోనిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్ష్ నిలిచాడు. ఇదిలావుండగా క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గుజరాత్ జట్టు లావెండర్

# ఆయుష్‌కు అండర్ 19 పగ్గాలు



**న్యూదిల్లీ-నవభూమి:** ఐపీఎల్‌లో అదరగొడుతున్న యువ సంచలన బ్యాటర్లు ఆయుష్ మాత్రే, వైభవ్ సూర్యవంశీలపై సెలెక్టర్ల దృష్టి పడింది. వచ్చే నెలలో ఇంగ్లండ్‌లో పర్యటించే భారత అండర్-19 జట్టు కెప్టెన్‌గా మాత్రేను ఎంపిక చేశారు. జూన్ 24 నుంచి జూలై 23 వరకు ఇంగ్లండ్ అండర్-19తో భారత కుర్రాళ్లు ఐదు యూత్ వన్డేలు, రెండు నాలుగు రోజుల టెస్టులు ఆడనున్నారు. జట్టులో మొత్తం 16 మంది ఆటగాళ్లున్నారు. జట్టులో హైదరాబాద్‌కు చెందిన వికెట్ కీపర్ రాపోలు అలంకృత్ స్టాండ్‌బై ఆటగాడిగా ఎంపికయ్యాడు. కాగా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన 17 ఏళ్ల మాత్రే చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గాయపడడంతో జట్టులోకి వచ్చి ఓపెనర్‌గా చెలరేగుతున్నాడు. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనే 206 పరుగులు సాధించాడు. ఇక 14 ఏళ్ల వైభవ్ విధ్వంసం అందరికీ తెలిసిందే. ఇప్పటికే ఓ మెరుపు శతకం కూడా బాదేయడంతో తనకు అండర్-19 జట్టులో చోటు ద్వారా ప్రమోషన్ లభించినట్టయ్యింది.

నవక్రీడ

# ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్.. భారత జట్టును ప్రకటించనున్న బీసీసీఐ..!

**న్యూదిల్లీ-నవభూమి:** ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌కు భారత జట్టును మే 24న (శనివారం) ప్రక టించే అవకాశాలు న్నాయి. జూన్ 20న హెడింగ్లీలో సిరీస్‌తో భారత్ పర్యటనను ప్రారం భిస్తుంది. ఆ తర్వాత ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్ ట్రాఫోర్డ్, ది ఓవల్‌లో మ్యాచులు జరుగను న్నాయి. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ముం బయిలో జరిగే విలేకరుల సమావేశంలోనే జట్టును ప్రకటించే అవకాశం ఉందని భావిస్తు న్నారు. మే 24న లేదంటే 25న ప్రకటిస్తారా? అన్నదానిపై కొంత గందరగోళం నెలకొంది. ఎక్కువగా శనివారమే జట్టును ప్రకటించే అవ కాశం ఉందంటూ బీసీసీఐ వర్గాలను ఉటం కిస్తూ జాతీయ మీడియా తెలిపిం ది.అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ముందుగానే టెస్ట్ జట్టును ఎంపిక చేయాల్సి ఉంటుంది. కానీ, రోహిత్ శర్మ ఈ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం.. విరాట్ కోహ్లీ సైతం సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఇద్దరు సీనియర్లు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో టెస్ట్ జట్టు ఎంపికను రెండువారాల పాటు వాయిదా వేశారు. ప్రస్తుతం టెస్ట్ కెప్టెన్ రేసులో శుభ్‌మన్ గిల్ ముందున్నాడు. అయితే, జస్ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ సైతం రేసులో ఉన్నారు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ప్లేఆఫ్‌కు చేర్చి.. అందరి ప్రశంసలు అందుకున్నాడు.శుభ్‌మన్ గిల్, గుజరాత్ టైటాన్స్ ఓపెనింగ్ జోడీ అయిన బీ సాయి సుదర్శన్ నార్తాంప్టన్‌లో ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగే రెండో మ్యాచ్‌కు ముందు ఇండియా 'ఏ' జట్టులో చేరనున్నారు. భారత టెస్ట్ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్ లాంటి ఆటగాళ్లు మే 30న జరిగే మొదటి మ్యాచ్ కంటే ముందే మే 25న ఇతర భారత 'ఏ' జట్టు సభ్యులతో కలిసి ఇంగ్లాండ్‌కు బయలుదేరే అవకాశాలున్నాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**